

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 271

శుక్రవారం 22-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అణగారిన ప్రజల కళ్ళల్లో ఆనందం మీ ఒక్కరి వల్లే సాధ్యం
మన పేద బిడ్డల భవితవ్యం మీరుంటేనే భద్రం
ఇలాంటి మహోన్నత ప్రజాసేవ కోసం
మీరు మళ్ళీ కావాలి సిఎం !



అవును, అభివృద్ధి అంటే అద్దాల మేడలు, ఆకాశహర్మ్యాలు మాత్రమే కాదని, నిరుపేదల పెదాలపై నిర్మలమైన చిరునవ్వులే అసలైన అభివృద్ధి అని బలంగా నమ్మి, అది సాధించి అభివృద్ధికే సరికొత్త అర్థం చెప్పిన మానవతామూర్తి మీరు! ఒక్క చదువులతోనే మన తలరాతలు, మన బిడ్డల జీవితాలు మారగలవని గ్రహించి గొప్పింటికే పరిమితమైన ఖరీదైన చదువుల్ని నిరుపేదల ముంగిట్లో సాక్షాత్కరింపజేసిన మహోన్నత వ్యక్తి మీరు! విద్య, వైద్యం ప్రతి ఒక్కరి కనీస హక్కులుగా గుర్తించి లక్షలాది రూపాయల కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ ఎందరో అభాగ్యులకు ప్రాణ భిక్ష పెడుతున్న పుణ్యశీలి మీరు! నాలుగు మెతుకుల కోసం పగలనక రేయనక కష్టపడే కర్షక, కార్మికుల బాధలను అర్థం చేసుకొని దేశ చరిత్రలోనే ఎక్కడా కనీవినీ ఎరుగని సంక్షేమ పథకాలతో వారి ప్రతి చెమట బిందువును తుడిచివేస్తున్న ఆపద్బాంధవులు మీరు, ఆత్మ బంధువు మీరు! ఇలా ఎన్నో ఇంకెన్నో...! ఒక్కమాటలో చెప్పాలంటే పేదల కోసం దేవుడు పంపిన ప్రతినిధి మీరు!

ఒకటి మాత్రం నిజం. మీది రాజన్న హృదయం. పేదల పక్షపాత ప్రభుత్వం మీది. మీ పాలనలోనే బీదసాదలకి క్షేమం, సంక్షేమం. మీరుంటేనే బ్రతకగలమన్న ధైర్యం, మనగలమన్న నమ్మకం. మీ పునరాగమనమే వారి జీవితాలలో సరికొత్త ఉషోదయం! అందుకే మీరు మళ్ళీ రావాలి. ఆల్ ది బెస్ట్ సియం సార్!

మీకివే మా జన్మదిన శుభాకాంక్షలు !

విద్యారంగ వైభవమే అభినవ గమ్యంగా విరబూసిన విద్యా దీవెనలు

	ప్రతి పేద తల్లికి అండగా నిలబడిన **జగనన్న అమ్మఒడి**	పాఠశాలల స్వరూపాన్నే మార్చివేసిన **మనబడి - నాడునేడు**	నాణ్యమైన విద్యా ప్రమాణాల కోసం **బైజూస్ డిజిటల్ కంటెంట్**	ప్రతి చిన్నారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన **జగనన్న విద్యా కానుక**	**టెక్నాలజీ రిచ్ ఎడ్యుకేషన్** కోసం ట్యాబ్స్, స్మార్ట్ టీవీలు, IFP లు
ఆనందం - ఆరోగ్యం కలిపి వడ్డించిన **జగనన్న గోరుముద్ద**	విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు **ఇంగ్లీష్ మీడియం**	ప్రణాళికా బద్ధమైన చదువుల కోసం **CBSE సిలబస్**			
నైపుణ్యాలతో కూడిన విద్యనందించే **జాతీయ విద్యా విధానం**	ఉన్నత చదువులకు సైతం ఆసరాగా **జగనన్న విద్యా దీవెన**	విద్యార్థుల సంక్షేమానికి చేయూతగా **జగనన్న వసతి దీవెన**			



మన పిల్లలు గొప్పగా చదవాలి, మన గ్రామాల పిల్లలూ రేపు గొప్ప గొప్ప స్థానాలలో నిలబడాలి, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలి. దానికోసం ధీటైన విద్యా ప్రమాణాలు అందించేందుకు ఎంతటి ఖర్చుకైనా వెనుకాడను.

శ్రీ వై.యస్. జగన్‌మోహన్ రెడ్డి
గౌరవనీయ ముఖ్యమంత్రివర్యులు


ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభవించిన పథకాలు

	మత్స్యకారులను ఆదుకునేందుకు **YSR మత్స్యకార నేస్తం పథకం**	చిన్న, మధ్య తరహా పరిశ్రమల వారికి **YSR నవోదయం పథకం**	చేనేత కార్మికులకు చేయూతగా **YSR నేతన్న హస్తం**
	చిరు వ్యాపారులకు అండగా **జగనన్న తోడు**	ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ వాలాల జీవనం కోసం **YSR వాహన మిత్ర**	అడ్వకేట్ మిత్రుల కోసం **YSR 'లా' నేస్తం**
టైలర్, బార్బర్, ధోబి మిత్రుల కోసం **జగనన్న చేదోడు**	వృద్ధులు, అభాగ్యుల గౌరవం కాపాడే **YSR పెన్షన్ కానుక**	నిరుద్యోగులకు ఆసరాగా **YSR ఆదర్శం పథకం**	అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా **గ్రామ వాలంటీర్ల వ్యవస్థ**

	పేదల ఆయుష్షుకు ప్రాణం పోసే **YSR ఆరోగ్యశ్రీ**	శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి కోసం **YSR ఆరోగ్య ఆసరా**
దుర్ఘటనలలో దెబ్బతిన్న కుటుంబాల కోసం **YSR భీమా**	నిరుపేద కళ్ళల్లో వెలుగులు నింపే **YSR కంటి వెలుగు**	వైద్య విద్యకు పట్టం కడుతూ 17 నూతన **వైద్య కళాశాలలు**

	డ్వాక్రా మహిళల కోసం **YSR ఆసరా పథకం**	మహిళల గృహ నిర్మాణం కోసం **YSR ఆవాస్ యోజన**	పేద మహిళలకు ఆలంబనగా **YSR సున్నా వడ్డీ పథకం**	కాపు మహిళల జీవన ప్రమాణాలు పెంచేందుకు **YSR కాపు నేస్తం**	నిరుపేద కుటుంబాల ఆడపిల్లల వివాహానికి **YSR కళ్యాణ కానుక**	SC, ST, OBC మైనారిటీ పేద మహిళల కోసం **YSR చేయూత పథకం**
అగ్రవర్ణ మహిళలకు చేదోడుగా **YSR EBC నేస్తం**	మహిళల, పిల్లల ఆరోగ్య పరిరక్షణకై **YSR సంపూర్ణ పోషణ**		విత్తనము నుండి విక్రయం దాకా రైతన్నకు తోడుగా **YSR రైతు భరోసా**	వ్యవసాయానికి పగటిపూట 9 గంటల **ఉచిత విద్యుత్**	సురక్షితమైన తాగునీరు, సాగునీరుకై **YSR జలయజ్ఞం**	ఆత్మీయ నేత హృదయంలో నుండి ఇలా ఎన్నో... ఇంకెన్నో...


జగనన్నామ సంక్షేమ సంవత్సరం
సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందిస్తున్న
నవతరం యువనాయకుడా..
ప్రజా 'విజయీభవ'
సంక్షేమాంధ్ర రథసారథి
అంబటి మురళీకృష్ణ
పెత్తందార్లతో పోరాటానికి
పేదవాని కోసం సంక్షేమ విప్లవం రగిల్చిన..
'సంక్షేమ విప్లవాద్యుడు'
మాన్యశ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గార్కి
జన్మదిన శుభాకాంక్షలతో..
మీ స్ఫూర్తితో - మేము సైతం
బజరంగ్ 'జగనన్నామ సంక్షేమ సంవత్సరం'లో తలపెట్టిన 51 లక్ష్యాన్ని అధిగమించి
68 సంక్షేమ శిబిరాలు నిర్వహించి, దిగ్విజయంగా కొనసాగుతున్న క్రమంలో..
మీ అంబటి మురళీకృష్ణ
బజరంగ్ ఫౌండేషన్, మామిళ్ళపల్లి, పొన్నూరు.
Bajrang Foundation Initiatives
మీ గుండె పదిలం
దివ్యాంగ దర్శిని
NAARI RITHUVU
VIDYA VIJETHA
Mark YOUTH DRIVE
PYTHON TRAINING & CERTIFICATION PROGRAMME
BAJRANG FOUNDATION
Incredible Inspiration
21-12-2022 నేత్రజ్యోతి - మామిళ్ళపల్లి
21-12-2022 విద్యావిజేత - మామిళ్ళపల్లి
28-12-2022 నేత్రజ్యోతి - కొప్పురావూరు
28-12-2022 వాలంటీర్ ఎగ్జామ్ - కొప్పురావూరు
04-01-2023 నేత్రజ్యోతి - వెలిగండ్ల
10-01-2023 నేత్రజ్యోతి - వెల్లలూరు
15-02-2023 నేత్రజ్యోతి -పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, గుంటూరు
20-02-2023 ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత - కొటప్పకొండ
06-03-2023 నేత్రజ్యోతి - ముత్తాయపాలెం
12-03-2023 దివ్యాంగదర్శిని - ముత్తాయపాలెం



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 271

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సీఈసీ, ఈసీల నియామకానికి..

సీఈసీ, ఈసీల నియామకానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ ఆమోదించింది.

వివరాలు 6లో ►



తమిళనాడు మంత్రికి జైలు

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో తమిళనాడు మంత్రి కె.పొన్ముడి, ఆయన భార్యకు హైకోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ►

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



చదువే ఆయుధం

పేదరికంపై ఎక్కుపెట్టి ఎదిరిద్దాం: చింతపల్లి సభలో సీఎం జగన్

55 నెలలుగా ప్రతి అడుగూ మార్పువైపే

'నాడు-నేడు', ఇంగ్లిష్ మీడియం, ఐఎఫ్‌పీలు, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు.... ఎన్నో తెచ్చాం

టోఫెల్ సహా... సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా అడుగులు

ఇవన్నీ చూసి ప్రైవేట్ స్కూళ్లు మన పిల్లలతో పోటీ పడాల్సి వస్తోంది

4లో

- వచ్చే ఏడాది 8వ తరగతి నుంచి 'ఫ్యూచర్ స్కిల్స్' సబ్జెక్ట్
- జనవరి చివరికి 62,097 తరగతి గదులన్నీ డిజిటలైజ్డ్
- ట్యాబ్‌లలో పాఠ్యాంశాలే ఉంటాయి.. తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు
- పెత్తందార్ల పిల్లలకేనా ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు?.. పేద బిడ్డలకు ఇస్తుంటే ఏడుపులా?.. తప్పుడు రాతలతో విద్యార్థులపై విషం కక్కొద్దని చెబుతున్నా
- అల్లూరి జిల్లా చింతపల్లిలో ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించిన సీఎం
- రూ.620 కోట్లతో 4,34,185 మందికి బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు
- పిల్లల సమక్షంలోనే పుట్టినరోజు వేడుకలు.. కేక్ కోసి తినిపించిన సీఎం జగన్

అది పేపరా.. పట్టిన పీడా?

ఈనాడు.. ఇంత దిగజారుడు రాతలా?: సీఎం జగన్ మండిపాటు

మీ పిల్లలు, మనవళ్లకేమో ఇంగ్లిష్ మీడియం చదువులు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లా?

మేం పేద పిల్లలకు ఇస్తే చెడిపోతారా?

నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలపై తప్పుడు కథనాలా?

4లో

2009లోనే సీఎం జగన్

యుద్ధభేరి మోగించారు

బాబు, లోకేశ్, పవన్ యుద్ధభేరితో జగన్ జైత్రయాత్రల పరంపరను ఆపలేరు

ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం

11లో

ఇదంజాతన్



కూటమిలో పార్టీలకు ఫండింగ్ చేస్తే మీ పార్టీకే పీఎం అభ్యర్థి అని చెబుదాం!



శ్రీసత్యసాయి జిల్లాలోని చిత్రావతి నదిలో బోట్లపై వినూత్నంగా సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు

ఊరూరా సంబరాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు

వస్త్ర, అన్న, రక్తదానంతో అభిమానం చాటుకున్న నేతలు, ప్రజలు

వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ.. ఇతరత్రా సేవా కార్యక్రమాలు

ర్యాలీలతో కదం తొక్కిన అభిమానులు.. వాడవాడలా కేక్ కటింగ్‌తో సందడి

2లో

ట్రెండింగ్‌లో సీఎం బర్త్‌డే విషెస్

ప్రపంచవ్యాప్తంగా సీఎం జగన్ బర్త్‌డే హ్యాష్ ట్యాగ్ హల్‌చల్

ఎక్స్ యాప్‌లో 3.50 లక్షలకు పైగా పోస్టులతో ట్రెండింగ్‌లో నంబర్‌వన్.. 18.1 కోట్ల మందికి చేరిన బర్త్ డే సందేశాలు

ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో 5వ స్థానం

- వివరాలు 2లో

సీఎం జగన్‌కు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

2లో

అవ్వాతాతల వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు

ఈనెల నుంచే రూ.2,750 నుంచి రూ.3,000కు పెరుగుదల

జనవరి 1న పెంచిన కొత్త పెన్షన్ చెల్లింపు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అవ్వాతాతలు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, పాదరక్షలు కుట్టేవారు, ఒంటరి మహిళలు, హెచ్‌ఐవీ బాధితులకు వచ్చే జనవరి 1వ తేదీ నుంచి పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేయనున్నారు. ఈ పెన్షన్‌ను డిసెంబర్ నుంచే రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచుతూ ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో ▶

టెలికాం సేవలపై కేంద్రం నియంత్రణ



- వేలం లేకుండానే శాటిలైట్ స్పెక్ట్రమ్‌ల కేటాయింపు
- రాజ్యసభలో ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్.. మూజువాణి ఓటుతో ఆమోదించిన సభ

6లో

క్రిమినల్ చట్టాలకు పార్లమెంట్ ఆమోదం

బ్రిటిష్ వలస పాలన నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఇండియన్ పీనల్ కోడ్–1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్–1898, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత బిల్లు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు, భారతీయ సాక్ష్య బిల్లులను కేంద్రం తీసుకువచ్చింది.

6లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

జలకళతో వలస తప్పింది



ఊర్లో సరిగా పంటలు పండక బతుకు దెరువు కోసం కుటుంబాన్ని వదిలేసి దేశంకాని దేశం వెళ్లి ఎంతో కష్టపడేవాడిని. మాది వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం పైడికాలువ పంచాయతీలోని సీతోరుపల్లె. నాకు భార్య, ఇద్దరు కుమారులు. మాకు నాలుగున్నర ఎకరాల మెట్ట భూమి ఉంది. వర్షం వస్తేనే పంట పండేది. అదే మాకు జీవనాధారం. పిల్లలు పెద్దవారవుతున్న క్రమంలో ఖర్చులు పెరుగుతూ వచ్చాయి. వ్యవసాయంలో వరుసగా నష్టాలు రావడంతో చేసేది లేక జీవనోపాధి కోసం భార్యా పిల్లలను వదిలి సింగపూర్‌కు వెళ్లాను. అక్కడ ఐదేళ్లు పని చేశాను. సింగపూర్‌లో ఉన్న తమిళ స్నేహితులు సోషల్ మీడియా ద్వారా ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి నాకు తెలిపారు. ప్రభుత్వం ప్రజల కోసం అన్ని పథకాలను అమలు చేస్తున్నప్పుడు మనం వలస బతుకులు బతకాల్సిన అవసరం లేదని అనేవారు. మాకు అలాంటి సీఎం ఉంటే మేము ఇప్పటికిప్పుడే మా రాష్ట్రానికి వెళ్లి కుటుంబాలతో కలిసి జీవించే వారమని అనేవారు. దీంతో నేను సింగపూర్ నుండి 2019 చివర్లో ఇంటికి వచ్చాను. మా గ్రామంలోని గ్రామ సచివాలయంలో వైఎస్ఆర్ జలకళ పథకానికి దరఖాస్తు చేశాను. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం నా భూమిలో ఉచితంగా బోరు వేయడమే కాక ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ మోటారు, వైరు, పైపులు, స్టార్టర్‌తో సహా ఉచితంగా అమర్చింది. ఇందుకు ప్రభుత్వం మొత్తం రూ. 4,47,061 ఖర్చు చేసింది. దీంతో సాగు నీటి బాధ తప్పింది. చక్కగా పంటలు పండించుకుంటున్నాము. నాలుగేళ్లుగా రైతు భరోసా కూడా వస్తోంది. పెద్ద కుమారుడు 9, చిన్నోడు 7వ తరగతి చదువుతున్నారు. అమ్మఒడి వస్తోంది. సింగపూర్‌లో నాతో పాటు పని చేసిన ఇతర రాష్ట్రాల వారికి వీడియో కాల్ ద్వారా నేను అప్పుడప్పుడు నా పంట పొలాన్ని చూపిస్తుంటాను. మా రాష్ట్రంలో కూడా ఇలాంటి పథకాలు ఉంటే బాగుండు అని వారు నిట్టూరుస్తున్నారు.

– సీతోరు మల్లికార్జునరెడ్డి, సీతోరుపల్లె
(పుత్తా నవనీశ్వరరెడ్డి, విలేకరి, వల్లూరు)

ఒంటరి జీవితానికి గూడు దక్కింది



పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతం నుంచి 30 ఏళ్ల కిందటే విశాఖపట్నం వచ్చాను. నగరంలోని ఎంవీపీ కాలనీ ఆదర్శ నగర్‌లో చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాను. వికలాంగుడిని. పెళ్లి అయిన కొన్నాళ్లకే భార్య విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తున్నాను. అప్పుడప్పుడు చెల్లెలు అందించే సహకారంతో జీవనం సాగిస్తున్నాను. విశాఖలో చిన్న ఇల్లు మంజూరు చేయాలని దాదాపు 20 ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతున్నాను. అయినా ఎవరూ పట్టించుకోలేదు. 2015లో టిడ్కో ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేయడంతో పాటు అప్పుచేసి జీవీఎంసీకి రూ.25 వేలు డిపాజిట్ కూడా చేశాను. అప్పటి ప్రభుత్వం ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేసింది. దీంతో నా ఆశ నిరాశగానే మిగిలిపోయింది. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖలోని దబ్బందలో ఇల్లు మంజూరైంది. దశాబ్దాల నా చిరకాల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. వికలాంగుల పింఛన్ కూడా ఈ ప్రభుత్వ హయాంలోనే వచ్చింది. ఇంటికొచ్చి మరీ 1వ తేదీనే రూ.3 వేలు చేతిలో పెడుతున్నారు. ఉన్నంతలో ఆనందంగా జీవిస్తున్నాను.

– కుప్పల రమేష్, ఆదర్శనగర్, విశాఖపట్నం
(పలివెల రవీంద్రబాబు, విలేకరి, ఎంవీపీ కాలనీ)

నా పెద్ద కుమారుడు జగన్



నా భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. ఇద్దరు కుమారుల వివాహాలు జరగడంతో వారు వేరుగా కాపురం ఉంటున్నారు. నాకు వితంతు పింఛను మంజూరైంది. గత ప్రభుత్వంలో రూ.200 పింఛను ఇచ్చేవారు. ఆ డబ్బులు దేనికీ సరిపోయేవి కావు. వాటి కోసం బ్యాంకు, పోస్టాఫీసుల చుట్టూ రోజుల తరబడి తిరిగేదాన్ని. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ వచ్చాక నా కష్టాలు తీరాయి. ఇప్పుడు పింఛన్ రూ.2,750 ఇస్తున్నారు. జనవరి నెల నుంచి దానిని రూ.3 వేలకు పెంచుతున్నారు. వలంటీర్ కనకారావు ప్రతి నెల 1వ తేదీ ఉదయమే తలుపుకొట్టి మరీ నా పింఛను సొమ్ము ఇంటి వద్దనే అందిస్తున్నాడు. మాది కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని రాజుపేట. పింఛను సొమ్ముతో సరుకులు, మందులు కొనుగోలు చేసుకుంటున్నా. ప్రతి నెలా ఇంటి ముందుకు వచ్చి ఇస్తున్న రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నాను. ఈ విధంగా నా జీవనానికి పూర్తి స్థాయిలో సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను నా పెద్దకుమారుడిగా భావిస్తున్నా.

– చదలవాడ సుశీల, మచిలీపట్నం
(పి.అశోక్‌కుమార్, విలేకరి, మచిలీపట్నం టౌన్)

సీఎం జగన్‌కు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు


సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నా' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం జగన్ ధన్యవాదాలు తెలిపారు.

సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

సాక్షి, అమరావతి: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయువు, సంతోషాన్నివ్వాలని ఆకాంక్షించారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత ప్రగతి సాధిస్తుందన్న విశ్వాసాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

ఢిల్లీలో ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం జగన్ జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ ఎంపీలు గురువారం ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంటులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీలు గోరంట్ల మాధవ్, అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, బీద మస్తాన్‌రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, చింతా అనురాధ, తలారి రంగయ్య, ఎం.గురుమూర్తి కేక్ కట్ చేశారు. ఏపీ భవన్‌లో ఎంపీ గోరంట్ల మాధవ్ కేక్ కట్ చేశారు.



వరి నాట్లతో సీఎం జగన్ చిత్రం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా కడియంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో రైతులు గురువారం వరి నాట్లతో రూపొందించిన సీఎం జగన్ చిత్రం విశేషంగా ఆకట్టుకుంది.

– కడియం



వైఎస్సార్ జిల్లా పులివెందుల భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో రక్తదానం చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి



పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు



కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలంలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేశ్

ఊరూరా సంబరాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: సీఎం జగన్ పుట్టిన రోజును పురిష్కరించుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఊరూరా ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పేదలు, అనాథలకు వస్త్రదానం చేశారు. భారీ ఎత్తున అన్నదానాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, లండన్, తదితర దేశాల్లోనూ సీఎం జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరం వరకు దారిపొడవునా వైఎస్సార్ సీపీ నేత పుత్తా ప్రతాప్‌రెడ్డి.. సీఎం జగన్ చిత్రాలతో ఏర్పాటు చేసిన జెండాలు, ఫ్లెక్సీలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సినీ ప్రముఖులు అక్కినేని నాగార్జున, మహేశ్‌బాబు ఎక్స్ (ట్విటర్) ద్వారా సీఎం జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది సీఎం మరిన్ని విజయాలు సాధించాలని, నిండు ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. వీరికి సీఎం జగన్ కూడా ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'మరెన్నో సంతోషకరమైన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని మనసారా కోరుకుంటున్నా' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పండుగలా జన్మదిన వేడుకలు

- చిత్తూరు, తిరుపతి జిల్లాల వ్యాప్తంగా ఓ పెద్ద పండుగలా జరిగింది. తిరుపతిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో 115 మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు రక్తదానం చేశారు. రుయాలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చంద్రగిరిలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 338 మంది రక్తదానం చేశారు. కేసీ పేటలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు ఆధ్వర్యంలో వంద మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, తట్టలో పూలు విక్రయించే వంద మందికి గొడుగులు, 15 మందికి బంకులు, 50 మంది నాయి బ్రాహ్మణులకు కిట్లు, 100 మందికి జంగమదేవర కిట్లు పంపిణీ చేశారు. వడమాలపేట మండలం అప్పళాయగుంట నుంచి నగరి వరకు మంత్రి రోజా పార్టీ శ్రేణులతో కలసి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పుత్తూరు ఎస్ఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు శిక్షణ పొందడానికి రూ.2.05 లక్షల విలువగల కుట్టుమిషన్లు అందించారు.
- ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరిగాయి. ఎస్ఆర్ఐటీ కళాశాలలో 430 మంది, తాడిపత్రిలో 100 మంది రక్తదానం చేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలో చిత్రావతి నదిలో బోట్లపై వైఎస్సార్ సీపీ జెండాలు ఎగురవేస్తూ సీఎం జగన్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. హిందూపురంలో ఎంజీఎం పాఠశాల విద్యార్థులు 'హ్యాపీ బర్త్‌డే జగన్ మామయ్యా' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రక్తదానం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, నరసరావుపేట, మాచర్లలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. మంత్రి అంబటి సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో రక్తదానం చేశారు. నరసరావుపేటలో ఎమ్మెల్యే గోపిరెడ్డి రక్తదానం చేశారు. వేమూరు సమీపంలోని ఓ చెరువు మధ్యలో జగన్ అభిమాని కారుమూరు వెంకటరెడ్డి 'మా నమ్మకం నువ్వే జగనన్న' అంటూ ఏర్పాటు చేసిన అక్షరాల ఆకృతి ఆకట్టుకుంది.



- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. విజయవాడ తూర్పు, పశ్చిమలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వేడుకలు అంబరాన్నంటాయి. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరై జగన్ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నారు.



ప్రకాశం జిల్లా కేవీ పాలెం జగనన్న కాలనీలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న స్థానికులు

వెయ్యి ఇళ్లల్లో గృహప్రవేశం

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పార్టీ కార్యాలయాల్లో పార్టీ నేతలు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అన్న, రక్తదాన, దుప్పట్లు, దుస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన కళాకారుడు దేశెట్టి శ్రీనివాసులు తన రక్తంతో ముఖ్యమంత్రి చిత్రాన్ని గీశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అన్నదాన, రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించారు. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు వేడుకల్లో పాల్గొన్నారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు అవయవదానానికి హామీ పత్రం ఇచ్చారు. రామేశ్వరం జగనన్న కాలనీలో 1000 ఇళ్లలో గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. పులివెందుల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రక్తదానం చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి స్థానిక వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో కేక్ కట్ చేశారు. మదనపల్లెలో మల్లెల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 5 వేల మంది ఆటో కార్మికులకు యూనిఫారాలు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా సీఎం జగన్ పుట్టిన రోజు సంబరాలు

సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కన్నులపండుగగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల కరతళధ్వానాలు, జై జగన్ నినాదాల మధ్య పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. అంతకుముందు మహానేత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. మత గురువులు సర్వమత ప్రార్థనలు జరిపి సీఎం జగన్‌ను ఆశీర్వదించారు. పేదలకు దుస్తులు, కుట్టు మిషన్లు, దివ్యాంగులకు ట్రైసైకిల్స్ అందజేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కల్పలతారెడ్డి, ఎమ్మెల్యే తిప్పేస్వామి, తెలుగు అకాడమి చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, పార్టీ నేతలు జూపూడి ప్రభాకరరావు, పుత్తా ప్రతాప్‌రెడ్డి, చల్లా మధు, ఎన్. పద్మజ, నారాయణమూర్తి, రవిచంద్రారెడ్డి, కాకుమాను రాజశేఖర్, ఎన్ఆర్ఐ పండుగాయల రత్నాకర్, కనకరావు మాదిగ, మనోహర్‌రెడ్డి, పానుగంటి చైతన్య, బందెల కిరణ్, నాగదేవి రవికుమార్, పాల్గొన్నారు.

తెలంగాణలోనూ సంబరాలు..

ఏపీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను తెలంగాణలోనూ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ, మూసాపేట, మోతీనగర్, బాలానగర్, ఫతేనగర్ తదితర ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. కేపీహెచ్‌బీకాలనీలోని రమ్యా గ్రౌండ్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రమ్యా గ్రౌండ్స్‌లో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం వైఎస్ఆర్‌సీపీ ఐటి విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాక్షి ఫైనాన్షియల్ డైరెక్టర్ వై.వి.ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, సినీ నటుడు కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు. భరత్‌నగర్ కాలనీ పోచమ్మ గ్రౌండ్‌లో అభిమానులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.7 కోట్ల విలువైన కానుకలు పంపిణీ



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీ, తదితరులు


చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్తూరులో ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎం.సి.విజయానందరెడ్డి మహిళలకు భారీగా కానుకలను పంపిణీ చేశారు. దాదాపు రూ.7 కోట్ల విలువ చేసే నూతన వస్త్రాలను అందజేశారు. రూ.1,300 విలువ చేసే కిట్‌లను చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, మేయర్ అముద చేతుల మీదుగా 44 వేల మంది మహిళలకు అందచేశారు. ఈ సందర్భంగా విజయానంద రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బలమే మహిళలని, వారి ఆశీస్సులు ఆయనకు ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేస్తామని, చిత్తూరు నియోజకవర్గ నుంచి తొలి విజయాన్ని అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గుడిపాల మండలంలో జరిగిన కార్యక్రమంలో 10 వేల మంది మహిళలకు సైతం ఈ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీకాంత్, సహదేవ, ఇందు, కోఆప్షన్ సభ్యులు చందు, అను, పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో బజరంగ్ సేవా తత్పరత



ఉప్పలపాడులో గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మురళీకృష్ణ

పెదకాకాని: గుంటూరు జిల్లా ఉప్పలపాడులో బజరంగ్ ఫౌండేషన్ పౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 1,211 మంది కంటి, గుండె పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 35 మందికి వైద్యులు యాంజియోగ్రాం సూచించగా, వారిని శనివారం ప్రత్యేక వాహనంలో విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లనున్నారు. ఏడుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇద్దరికి జైపూర్ కాళ్లు, వెస్టన్ కమోడ్‌లు అందజేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనలో పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కొనియాడారు. దీన్ని ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ అంకిత భావంతో ప్రజా సేవను కొనసాగిస్తోందన్నారు. గత సంవత్సర కాలంగా 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం'లో కంటి సమస్యల నివారణకు నేత్రజ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో పెద్దేటమ్మ తల్లి పీఠం వద్ద కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పంటపొలంలోనే కేక్ కట్ చేస్తున్న వ్యవసాయ కూలీలు

అంతులేని అభిమానం..!

సీఎం జగన్ జన్మదిన వేడుకలను వ్యవసాయ కూలీలు పంట పొలంలోనే నిర్వహించారు. కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని రామకృష్ణాపురం శివారు ఇరాలి గ్రామానికి చెందిన రైతు పేరే వెంకటేశ్వరరావు పొలంలో వరికోతకు వచ్చిన వ్యవసాయ కూలీలు సీఎం పుట్టినరోజున సందర్భంగా కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని ఇలా చాటుకున్నారు.

– కోడూరు

ట్రెండింగ్‌లో దుమ్ము రేపిన సీఎం బర్త్‌డే విషెస్

ప్రపంచ వ్యాప్తంగా సీఎం జగన్ బర్త్‌డే హ్యాష్ ట్యాగ్ హల్ చల్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ చరిష్మా ఏపాటిదో గురువారం మరోసారి ప్రపంచానికి తెలిసింది. సీఎం పుట్టినరోజునాడు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రపంచ వ్యాప్తంగా అభినందల వెల్లువతో రికార్డులు సృష్టించింది. హెచ్‌బీడీ వైఎస్ జగన్ పేరుతో ఏర్పాటు చేసిన హ్యాష్ ట్యాగ్ ద్వారా ఎక్స్ (ట్విటర్) వేదికగా 3.50 లక్షల మందికి పైగా శుభాకాంక్షలు తెలుపడం ద్వారా ఇండియా ట్రెండింగ్‌లో తొలి స్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా వైఎస్ జగన్ పుట్టిన రోజు సందేశం 18.1 కోట్ల మందికి చేరినట్లు ఎక్స్ గణాంకాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డంకీ, సలార్ వంటి సినిమాలు విడుదల అవుతున్న సమయంలో ఒక రాజకీయ పార్టీ అధినేత పుట్టిన రోజు ఇంత ట్రెండింగ్ కావడం విశేషం. 2 గంటల పాటు ఎక్స్ ఇండియా సర్వర్ షట్‌డౌన్ అయినప్పటికీ ఈ స్థాయిలో ట్వీట్లు రావడం గమనార్హం. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి పోస్ట్‌లు వెల్లువెత్తాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా 5వ స్థానం, ఆసియాలోనూ 5వ స్థానంలో హ్యాపీ బర్త్‌డే వైఎస్ జగన్ ట్రెండింగ్‌లో నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో పాటు కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులు వైఎస్ జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్ 55 నెలల పాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్టు చూపేలా రూపొందించిన ఫొటోను వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా గురువారం విడుదల చేసింది. ఓ వైపు పచ్చని పంట పొలాలు, ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారైన ప్రభుత్వ పాఠశాల, గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలతో ఈ ఫొటో ఆకర్షణీయంగా ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఈ చిత్రం వైరల్ అయ్యింది.

ఖతార్‌లో ఘనంగా సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



సీఎం జన్మదిన వేడుకల్లో ఎన్నారైలు

సఖినేటిపల్లి: సీఎం జగన్ జన్మదిన వేడుకలు గురువారం దోహా–ఖతార్‌లోని అల్సద్‌లో అక్కడి వైఎస్సార్ సీపీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో కేక్‌ను ఆ దేశంలోని పార్టీ కన్వీనర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని రామేశ్వరానికి చెందిన దొండపాటి శశికిరణ్ కట్ చేశారు. పార్టీ గల్ఫ్ ప్రతినిధి మండా వర్జిల్‌బాబు, జాఫర్ హుస్సేన్, నల్లి నాగేశ్వరరావు, కత్రి లక్ష్మయ్య, దిన్నెపాటి ఖాదర్ భాషా, తమలపాకుల అరుణ్‌కుమార్, దొండపాటి రత్నారావు, పెదపాటి సుధాకర్, ప్రకాశ్ పాల్గొన్నారు.


గుంటూరు జీజీహెచ్‌లో సీఎం పుట్టిన రోజు వేడుకలు



అంబులెన్స్‌లు ప్రారంభిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు రాష్ట్ర మంత్రి విడదల రజిని హాజరై మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రూ.60 లక్షలు ఖరీదు చేసే లైఫ్ సేవింగ్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, డిప్యూటీ మేయర్ షేక్ సజిల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, చెన్నై: ఏపీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను గురువారం తమిళనాడులోని చెన్నైలో వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్–తమిళనాడు విభాగం ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్, సీనియర్ నాయకులు శరవణన్, శరత్‌కుమార్‌రెడ్డి, యువజన నేతలు సూర్యారెడ్డి, సాయి సింహారెడ్డి నేతృత్వంలో పూందమల్లిలో ర్యాలీ నిర్వహించారు. చెన్నైలోని ఎంజీఆర్, భారత్, సవీత తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పూందమల్లి పరిసరాల్లో భారీ ర్యాలీ చేపట్టారు. పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. భారీ కేక్‌ను కట్ చేశారు. వ్యాసార్పాడిలోని పాఠశాలలో పిల్లలకు స్కూల్ కిట్లు పంపిణీ చేసి పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం చేశారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ సభకు తరలి వచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



సభకు భారీగా హాజరైన విద్యార్థులు



సభాప్రాంగణం నిండిపోవడంతో బయట నుంచే సీఎం ప్రసంగాన్ని ఆలకిస్తున్న జనవాహినిలో ఓ భాగం

చదువే ఆయుధం

పేదరికంపై ఎక్కుపెట్టి ఎదిరిద్దాం: సీఎం జగన్

విద్యార్థులతో తరగతి గదిలో కూర్చుని ఆప్యాయంగా సీఎం ముచ్చట్లు

భోజనం ఎలా ఉంది? చదువులు ఎలా సాగుతున్నాయి చిన్నా? అంటూ ఆరా

> "మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలనే సదుద్దేశంతో బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు ఇస్తున్నాం. రూ.620 కోట్లతో 4,34,185 మంది పిల్లలకు మామగా ఈ కానుక అందిస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ 8వ తరగతి నుంచి బోధన ప్రారంభిస్తున్నాం. 55 నెలలుగా ప్రతి అడుగూ విప్లవాత్మక మార్పు దిశగానే వేస్తున్నాం. పిల్లలకు మనం ఇవ్వగలిగే విలువైన ఆస్తి చదువులే"
>
> - ట్యాబ్‌ల పంపిణీలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: పేద కుటుంబాలకు చెందిన పిల్లల చదువుల పట్ల దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ తీసుకోనంత శ్రద్ధ వహిస్తూ తర తరాల తలరాతలను మారుస్తున్న మనందరి ప్రభుత్వంపై కొందరు పెత్తందారులు దుర్బుద్ధితో, దురుద్దేశాలతో బురద చల్లుతున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకురావాలని మీ జగన్ ఆరాట పడుతుంటే దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని విప్లవాత్మక సంస్కరణలు చేపడితే విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పుడు రాతలతో పేద విద్యార్థులపై విషం కక్కొద్దని సూచించారు. పిల్లలు మరింత మెరుగ్గా పాఠ్యాంశాలను అవగాహన చేసుకునేలా ట్యాబ్‌లు అందిస్తుంటే వారిని చెడగొడుతున్నారంటూ, పాడు చేస్తున్నారంటూ దుర్మార్గమైన కథనాలు ప్రచురిస్తున్నారని, మరి మీ పిల్లలు, మనవళ్ల చేతిలో ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు ఉండవచ్చా? అని పెత్తందారులను నిలదీశారు. అసలు అది పేపరా?.. పేపర్‌కు పట్టిన పీడా? అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ స్కూళ్లను ఇంగ్లీషు మీడియం, ఇంగ్లీషు ల్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు, డిజిటల్ బోధనతో తీర్చిదిద్ది బైజూస్ కంటెంట్‌తో ఖరీదైన ట్యాబ్‌లను పిల్లలకు ఉచితంగా అందిస్తున్నామని, ప్రాథమిక స్థాయి నుంచి టోఫెల్ శిక్షణతోపాటు సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా అడుగులు వేయడంతో ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు ప్రభుత్వ పాఠశాలలతో పోటీ పడాల్సిన పరిస్థితి కల్పించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 8వ తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. తొలుత విశాఖ ఎయిర్‌పోర్టు చేరుకున్న ముఖ్యమంత్రి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో చింతపల్లి వచ్చారు. ఆశ్రమ పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్ స్టాల్‌ని పరిశీలించి విద్యార్థులతో కలసి క్లాస్ రూమ్‌లో కూర్చొని ఆప్యాయంగా ముచ్చటించారు. క్లాస్‌లు ఎలా జరుగుతున్నాయి? భోజనం ఎలా ఉంది? చదువులు బాగా చెబుతున్నారా చిన్నా? అంటూ విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం చింతపల్లి మైదానంలో సభా వేదిక వద్దకు చేరుకుని బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్ ట్యాబ్స్ రాష్ట్రవ్యాప్తంగా 9,424 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

పేద బిడ్డల బంగారు భవిష్యత్ కోసం..

గిరిపుత్రుల స్వచ్ఛమైన మనసుల మధ్య, పేద బిడ్డల బంగారు భవిష్యత్‌ను ఆకాంక్షిస్తూ నా పుట్టిన రోజున ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం దేవుడిచ్చిన అదృష్టం. రాష్ట్రంలోని పిల్లలే మన భవిష్యత్తు, మన వెలుగులు. మన తర్వాత, మనం వెళ్లిపోయిన తర్వాత కూడా రాష్ట్ర భవిష్యత్తును నిలిపే వారసులు వారంతా. వరుసగా రెండో ఏడాది ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. రూ.620 కోట్లు ఖర్చు చేస్తూ 4,34,185 మంది పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు పెడుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎమ్మెల్యే ప్రతి మండలాన్ని సందర్శిస్తూ 10 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది కూడా నా పుట్టిన రోజున రూ.686 కోట్లతో 5.18 లక్షల ట్యాబ్‌లను పిల్లలకు, టీచర్లకు పంపిణీ చేశాం. ఆఫ్‌లైన్‌లో సైతం పనిచేసేలా బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ చేసి మరీ ఇస్తున్నాం. ట్యాబ్‌ల్లో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఆందోళన చెందొద్దు. వాటిని హెడ్ మాస్టార్‌కు లేదా గ్రామ సచివాలయంలో అందచేస్తే రసీదు ఇచ్చి మరమ్మతులకు పంపిస్తారు. వారం రోజుల్లోనే ట్యాబ్ రిపేరు చేసి ఇస్తారు. లేదంటే మరో ట్యాబ్ మీ చేతిలో పెడతారు. వాటిలో సెక్యూర్డ్ మొబైల్ డివైస్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ లోడ్ చేయడం వల్ల పిల్లలు పాఠాలు, బోధనకు సంబంధించిన అంశాలను మాత్రమే చూడగలుగుతారు. పిల్లలు ఏం చూశారు? ఏం చదివారు? అన్నది టీచర్లకు, తల్లిదండ్రులకు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా తెలుస్తుంది కాబట్టి ఎలాంటి ఆందోళన అవసరం లేదు.



సీఎం జగన్ ప్రసంగిస్తుండగా విద్యార్థినుల కేరింతలు

ఉచితంగా రూ.33 వేల ట్యాబ్, కంటెంట్..

ఒక్కో పిల్లాడి చేతిలో పెడుతున్న ఈ ట్యాబ్ మార్కెట్ విలువ రూ.17,500. దీనికి తోడు బైజూస్ కంటెంట్ ఇస్తున్నాం. రూ.33 వేలు విలువ చేసే ట్యాబ్, కంటెంట్ ఉచితంగా ఇస్తున్నాం. శ్రీమంతుల పిల్లలు బైజూస్ కంటెంట్ కొనుగోలు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలంటే రూ.15 వేలు చెల్లించాలి. మన పిల్లలు దేశంలోనే కాదు ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా నిలవాలన్న తలంపుతో ఇంత ఖర్చు పెడుతున్నాం.

డిజిటల్ గదులు.. ఇంగ్లీష్ ల్యాబ్‌లు

నాడు – నేడు తొలిదశ పూర్తైనస్కూళ్లలో 6వ తరగతి ఆపై ఉన్న 32,213 క్లాస్ రూంలలో ఇప్పటికే ఐఎఫ్‌పీలు అమర్చి డిజిటలైజ్ చేశాం. బైజూస్ కంటెంట్‌తో కూడిన పాఠాలను తరగతి గదిలో నేర్పుతారు. అవే పాఠాలు ట్యాబ్స్‌లో కూడా ఉంటాయి. దీనివల్ల మెరుగ్గా నేర్చుకుంటారు. 1 నుంచి 5వతరగతి వరకు స్కూళ్లలో ఇంగ్లీషు ల్యాబ్‌లు తెచ్చి 10,038 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశాం. ఐఎఫ్‌పీలు, క్లాస్‌రూంల డిజిటలైజేషన్ కోసం మొదటి దఫాలో చేసిన ఖర్చు రూ.427 కోట్లు. నాడు–నేడు రెండో దశ పనులు వేగంగా జరుగుతున్నాయి. 62,097 తరగతి గదులన్నీ పూర్తిగా డిజిటలైజ్ అయ్యే కార్యక్రమం జనవరి 30 నాటికి పూర్తవుతుందని అధికారులు చెప్పారు.

సందేహాల నివృత్తికి యాప్..

ఫిజిక్స్, మేథ్స్, బయాలజీ, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో పిల్లల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈసారి ట్యాబ్‌లలో డౌట్ క్లియరెన్స్ బాట్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసి అందించాం. ఇంత ధ్యాసపెట్టి పిల్లలు ఏం చదువుతున్నారు? ఎలా చదువుతున్నారు? ట్యాబ్‌లలో ఏం ఉండాలి? పిల్లలకు మరింత మెరుగ్గా ఎలా ఉపయోగపడాలి? సులభంగా అర్ధమయ్యేందుకు ఏం చేయాలి? అనే ఆలోచన చేస్తూ తాపత్రయపడుతున్నాం. సందేహాల నివృత్తికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తెచ్చే కార్యక్రమం కూడా జరుగుతుంది. పిల్లలు విదేశీ భాషలను నేర్చుకునేందుకు డ్యుయోలింగో యాప్‌ను కూడా చేర్చాం. ఇలా ట్యాబ్‌లు పిల్లలకు ఒక ట్యూటర్‌లా తోడుంటాయి.

కొత్త టెక్నాలజీకి అనుగుణంగా..

మన పిల్లలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచేందుకు ప్రాథమిక స్థాయి నుంచే 3వ తరగతి నుంచే టోఫెల్ పరీక్షకు సిద్ధం చేసేలా అమెరికాకు చెందిన టోఫెల్ నిర్వాహణ సంస్థ ఈటీఎస్(ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్)తో ఒప్పందం చేసుకున్నాం. టోఫెల్ శిక్షణ కోసం ఒక పీరియడ్ కేటాయించేలా చర్యలు తీసుకున్నాం. మారుతున్న టెక్నాలజీ, పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా వేగంగా అడుగులు వేయాలి. రానున్న 20 ఏళ్లలో చాలా ఉద్యోగాలు కనుమరుగవుతాయని చెబుతున్నారు. మన జీవితాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ప్రభావం పెరుగుతుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మన పిల్లలను సిద్ధం చేస్తూ వచ్చే ఏడాది 8వ తరగతి నుంచి ఫ్యూచర్ స్కిల్స్ అనే సబ్జెక్టును ప్రవేశపెడుతున్నాం. అందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, మెటావర్స్, డేటా ఎనలెటిక్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, వర్చువల్ రియాలటీ, అగ్‌మెంటెడ్ రియాలటీ, ఫైనాన్షియల్ లిటరసీ లాంటి అంశాలన్నీ పిల్లలకు పరిచయం చేసేలా ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్టు తెస్తున్నాం. సంబంధిత ట్యూటర్ల నియామకానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న మన పిల్లలు నేరుగా విదేశీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) సిలబస్‌ను కూడా రాబోయే రోజుల్లో తెస్తున్నాం. దీనికోసం ఐబీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.

గిరికోనల్లో గొప్ప మార్పులు

నా చెల్లెమ్మ భాగ్యలక్ష్మి (పాడేరు ఎమ్మెల్యే) నియోజకవర్గానికి బీటీ రోడ్లు, బ్రిడ్జిలు కావాలని అడిగింది. వాటిని యుద్ధప్రాతిపదికన వేగంగా మంజూరు చేస్తాం. ఇవాళ గిరిజన ప్రాంతాన్ని చూస్తుంటే గొప్ప మార్పులు కనిపిస్తున్నాయి. సాలూరులో ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. పార్వతీపురం, నర్సీపట్నం, పాడేరులో మూడు మెడికల్ కాలేజీలు వస్తున్నాయి. ఐటీడీఏ పరిధిలో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, బుట్టాయిగూడెం, డోర్నాలలో కూడా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ వేగంగా నిర్మాణం అవుతోంది. గిరిజన ప్రాంతాల్లో గతంలో లేనివి కేవలం ఈ 55 నెలల్లో మీ బిడ్డ హయాంలో మాత్రమే జరుగుతున్నాయి.

దుబారా కాదు.. రేపటి భవిష్యత్తు కోసమే

గతంలో మన స్కూళ్లు ఎలా ఉండేవి? ఇవాళ మన బడులన్నీ ఎలా ఉన్నాయి? ఈ 55 నెలల కాలంలో మన ప్రభుత్వ స్కూళ్లు ఎలా మారిపోయాయో చూడాలని కోరుతున్నా. ప్రైవేట్ స్కూళ్లు మెరుగ్గా ఉంటాయనే నానుడి పోయి ఇవాళ అవన్నీ ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడే పరిస్థితి వచ్చిందా? లేదా? జగన్ దుబారాగా డబ్బులు ఖర్చు చేస్తున్నాడని గిట్టని వారు అంటున్నారు. కానీ మేం ప్రతి పైసా మానవ వనరుల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నాం. రేపటి భవిష్యత్తు మీద ప్రతి పైసా ఖర్చు కూడా పెడుతున్నాం. పిల్లలందరికీ నాణ్యతతో కూడిన విద్య ఇవ్వగలిగితే వారి జీవితం, భవిష్యత్తు మారుతుంది. అప్పుడు పేదరికం ఆటోమేటిక్‌గా పక్కకు పోయే పరిస్థితి వస్తుందని గట్టిగా నమ్మాం కాబట్టే ఇంత వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ దిశగానే విద్యా దీవెన, విద్యా కానుక, గోరుముద్ద, అమ్మఒడి పథకాలతో పాటు ఇంగ్లీషు మీడియం చదువులు, బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్, సీబీఎస్ఈ బోధన తెచ్చాం.

విద్యార్థుల సమక్షంలో బర్త్‌డే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. విద్యార్థుల నడుమ భారీ కేక్ కట్ చేసి వారికి తినిపించారు. హ్యాపీ బర్త్‌డే మామయ్యా అంటూ విద్యార్థులు ఆయనకు ఆప్యాయంగా కేక్ తినిపించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం జగన్‌కు బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, ధనలక్ష్మి, పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, తలశిల రఘురామ్, అనంత బాబు, కుంభారవిబాబు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులతో కలిసి బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న సీఎం జగన్

అది పేపరా.. పట్టిన పీడా?

ఈనాడు.. ఇంత దిగజారుడు రాతలా?: సీఎం జగన్ మండిపాటు

దిక్కుమాలిన మాటలు..

"మీ పిల్లల చేతుల్లో ఇవన్నీ ఉంటే చెడిపోరుగానీ పేద పిల్లల చేతుల్లో మాత్రం ట్యాబ్‌లు, ల్యాప్‌టాపులు, స్మార్ట్ ఫోన్లు ఉంటే చెడిపోతారా? మీ పిల్లలు, మనవళ్లేమో ఇంగ్లిషు మీడియంలోనే చదవాలి! పేద పిల్లలు మాత్రం ఇంగ్లిషు మీడియం బడులకు వెళ్లకూడదు..! ఇంగ్లిషులో చదవకూడదా? పేద పిల్లలు ఇంగ్లిషు మీడియంలో చదివితే తెలుగు భాష అంతరించిపోతుందట! కానీ వాళ్ల పిల్లలు, మనవళ్లు మాత్రం ఇంగ్లిషులోనే చదవాలట! ఇది ధర్మమేనా? ఆలోచన చేయండి. దిక్కుమాలిన మాటలు మాట్లాడుతున్నారు. ఇలాంటి రాజకీయాలతో మీ బిడ్డ యుద్ధం చేస్తున్నాడు"

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> మీ పిల్లలు, మనవళ్లకేమో ఇంగ్లీషు మీడియం చదువులు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లా?
>
> మేం పేద పిల్లలకు ఇస్తుంటే చెడిపోతారా?
>
> నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలపై తప్పుడు కథనాలా?

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: "మీ పిల్లలు, మీ మనవళ్ల చేతిలోనేమో ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు ఉండొచ్చు! స్మార్ట్ ఫోన్లు కూడా ఉండొచ్చు! కానీ పేద పిల్లల చేతుల్లో మాత్రం అవి ఉండకూడదా? ఇది సరైన పోకడేనా?" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, చంద్రబాబు, దత్తపుత్రుడు.. వీరంతా ఎంత దిగజారి మాట్లాడుతున్నారో మీ అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. 'పేద పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వనే ఇవ్వకూడదని వారంతా అంటున్నారు. ట్యాబ్‌లు చేతిలో ఉంటే పిల్లలు చెడిపోతున్నారని రాస్తున్నారు. మన ప్రభుత్వ బడులలో చదువుకునే నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లలపై తప్పుడు రాతలు రాస్తున్నారు. ఏవేవో వీడియోలు చూస్తున్నారని, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారని, చెడిపోతున్నారని పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వొద్దని ప్రతి రోజూ పనిగట్టుకుని నాపై విమర్శలు చేస్తున్నారు' అని పేర్కొన్నారు. గురువారం అల్లూరి జిల్లా చింతపల్లిలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం జగన్ మాట్లాడారు.

పేద పిల్లలపై కడుపు మంట..

"జగన్ బర్త్‌డే బహుమతి.. చెడగొడుతోంది మతి! గాడి తప్పుతున్న బైజూస్ ట్యాబ్ చదువులు, ఇతర వీడియోలు, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడుతున్న పిల్లలు, వెనక్కి తీసుకోవాలంటూ తల్లిదండ్రుల నుంచి ఒత్తిళ్లు, అయినా వాడాల్సిందేనంటున్న జగన్ సర్కార్' అని ఈనాడులో కథనాలు రాశారు. ఇది పేపరా..! పేపరుకు పట్టిన పీడా?" అని సీఎం జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇలాంటి పేపర్‌ను చదవొచ్చా? అని ప్రశ్నిస్తూ ఈనాడు పత్రికని నేలకేసి కొట్టారు. నేను ఆ పత్రిక యాజమాన్యాన్ని, ఆ పత్రికను సమర్థించే రాజకీయ పార్టీలకు ఒకటే చెబుతున్నా. ఇంతగా దిగజారి రాతలు రాయకండి.. ఇంతగా దిగజారి మాట్లాడకండి అని చెబుతున్నా. పేద వర్గాల పిల్లల మీద ఇంతగా విషం కక్కకండి అని చెబుతున్నా. పేద పిల్లలకు మంచి జరుగుతుంటే.. ఇంత కడుపు మంట వద్దండీ! అని చెబుతున్నా. ఈరోజు మీరంతా అన్నీ చూస్తున్నారు. ఒకవైపు జగన్ ఫొటోకు పది తల కాయలు పెట్టి రాష్ట్రం అంతా అప్పుల పాలై పోయిందని రాస్తారు. మరోవైపు చంద్రబాబు మేనిఫెస్టో, ఆరు గ్యారంటీలు అంటూ పతాక శీర్షికల్లో ప్రచురిస్తారు. జగన్ ఇచ్చే వాటికన్నా వాళ్లు చెబుతున్నవి మూడింతలు ఎక్కువ. 2014 – 19 వరకూ వాళ్లే పరిపాలన చేశారు. ఇదే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు అప్పుడూ ఉన్నారు. రూ.87,612 కోట్ల రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేశారు. పొదుపు సంఘాల మహిళలను దగా చేశారు. ఇంటికో జాబ్ లేదంటే రూ.2 వేల నిరుద్యోగ భృతి అంటూ ఒక్కరికీ ఇచ్చిన పాపాన పోలేదు. అవ్వాతాతలు, అక్క చెల్లెమ్మలు, రైతులు, పిల్లలు.. ఇలా ఎవరినీ వదలకుండా మోసం చేశారు. ఎంత దారుణమంటే ప్రజలు కొడతారేమోననే భయంతో చివరకు మేనిఫెస్టోను సైతం మాయం చేశారు.



తప్పుడు రాతలతో పేద విద్యార్థులపై విషం కక్కుతోందంటూ ఈనాడు కథనాన్ని చూపుతున్న సీఎం వైఎస్ జగన్



ట్యాబ్‌లు తీసుకున్న ఆనందంలో చిన్నారులు.. ఆశీర్వదిస్తున్న సీఎం

నాడు అసాధ్యం.. నేడు ఎలా సాధ్యమైంది?

ఈ రోజు మీ బిడ్డ 99.5 శాతం వాగ్దానాలను అమలు చేశాడు. రూ.2.40 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. ఒక్కసారి ఆలోచన చేయండి. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు? గతంలో పరిపాలన చేసిన వాళ్లు మీ బిడ్డలా ఎందుకు చేయలేకపోయారు? ఎందుకంటే.. అప్పట్లో ఓ గజదొంగల ముఠా పరిపాలన చేసింది కాబట్టే! ఒక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడు, జన్మభూమి కమిటీల నుంచి మొదలుపెడితే ఇసుక, మద్యం, స్కిల్ స్కామ్, ఫైబర్ గ్రిడ్ దాకా ఏది చూసినా దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడమే. ఇక అప్పుల గురించి విమర్శలు చేస్తున్నారు. గత సర్కారు హయాంతో పోలిస్తే అప్పుల పెరుగుదల ఇవాళ తక్కువగానే ఉంది. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ బురద జల్లుతారు. ఎవరైతే మీకు మంచి చేశారో వారిని గుర్తు పెట్టుకోండి. ఈ రోజు మీ బిడ్డ మీ కళ్ల ముందు నిలబడి మీ కళ్లలోకి చూసి చెప్పగలుగుతున్నాడు. మీకు మంచి జరిగిందా? లేదా? అన్నదే కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా, అండగా నిలబడండి.

ప్రజలంతా మీ వెంటే..



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో జిల్లా ఏర్పాటు చేసిన మన సీఎంకు ధన్యవాదాలు. గిరిజన ప్రాంత ప్రజలకు కనీస అవసరాలు తీరుస్తూ మన గిరిజన హక్కులు కాపాడుతున్న మన అభినవ అల్లూరి జగనన్నకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీ విజనరీ లీడర్‌షిప్‌లో విద్యా రంగానికి మీరు ఇస్తున్న ప్రాధాన్యతకు ప్రపంచ దేశాల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. పోటీ ప్రపంచంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు కూడా పోటీ పడాలని మీరు అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. గ్లోబల్ లాంగ్వేజ్ ఇంగ్లిష్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యతో పాటు వైద్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి మా గిరిజనులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. చంద్రబాబు బాక్సైట్ జీవో 97 తీసుకవస్తే, మీరు గిరిజనుల పక్షాన నిలబడి అధికారంలోకి రాగానే రద్దు చేశారు. నాడు వైఎస్సార్ హయాంలో అటవీ హక్కుల చట్టం తీసుకొస్తే.. నేడు మన జగనన్న ఒక్క పాడేరు నియోజకవర్గంలోనే 1,13,000 మందికి 2,27,000 ఎకరాల భూమిపై హక్కు కల్పించి రికార్డు సృష్టించారు. మా నియోజకవర్గంలో రూ.1,251 కోట్లు నేరుగా ప్రజల అకౌంట్‌లో జమ అయ్యాయి. సామాజిక న్యాయానికి సంపూర్ణ అర్థం చెప్పిన జగనన్నను మేం ఎప్పటికీ మరువం. ఏపీ ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారు.

– కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే

మామయ్యా.. మీ వల్లే చదువుకుంటున్నాం



జగన్ మామయ్యా.. హ్యాపీ బర్త్ డే.. మా నాన్న పేద రైతు కావడం వల్ల మమ్మల్ని చదివించడం ఇబ్బందిగా ఉండేది. మీరు సీఎం అయ్యాక అమ్మ ఒడి ద్వారా ఆదుకున్నారు. నేనే కాదు.. నాలాగ వేల మంది విద్యార్థులు చదువుతున్నారంటే అమ్మ ఒడే కారణం. ఒకప్పుడు మా స్కూల్ సరిగా లేదు. మా జగన్ మామయ్య సీఎం అవ్వడం వల్లే రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మాకు ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చారు. ఒకప్పుడు నాకు ఇంగ్లిష్ రాక ఇబ్బంది పడేదాన్ని. నేను ఇప్పుడు ఇంగ్లిష్‌లో చక్కగా మాట్లాడుతున్నాను. బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్ చాలా బాగున్నాయి. గతంలో స్కూల్‌కు వెళ్లాలంటే ఇష్టం ఉండేది కాదు. మీరు తీసుకొచ్చిన మార్పుల వల్ల, సహాయం వల్ల ఇవాళ ఇష్టంగా స్కూలుకు వెళ్తున్నాం. మంచి పౌష్టికాహారం ఇస్తున్నారు. రోజుకో రకం మంచి ఆహారం ఇస్తున్నారు. మాకు మంచి ట్యాబ్‌లు ఇచ్చారు. ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశారు. చక్కగా చదువుకుంటున్నాం. ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా టాపర్స్‌కు ప్రోత్సాహకం ఇస్తున్నారు. మేం బాగా చదువుకుని మంచి జాబ్ వచ్చే వరకు మీరే మాకు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాను.

– ధారామణి, ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థిని, చింతపల్లి



క్లాస్ రూంలో కూర్చుని విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీఎం



క్లాస్‌రూంలో విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్



చిన్నారులకు సెల్ఫీ తీసిస్తున్న సీఎం వైఎస్ జగన్

ఆ నలుగురూ నాన్‌లోకల్

ఇక్కడ రాజకీయాలతో ఏం పని? • రెవెన్యూ మంత్రి ధర్మాన


మొక్క నాటుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: రాష్ట్రం విడిపోయి పదేళ్లయినా ఆ నలుగురూ వేరే రాష్ట్రంలోనే నివాసం ఉంటారని, మన రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు వారికి అర్హత లేదని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా గార మండల కేంద్రంలో గురువారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్, బాలకృష్ణ వేరే రాష్ట్రంలో ఉంటూ.. ఇక్కడకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. వారిలో ఇద్దరు వ్యాపారాలు చేసుకుంటున్నారని, మరో ఇద్దరు సినిమాలు చేసుకుంటున్నారని అన్నారు. ఒడిశా, తమిళనాడు, తెలంగాణ నుంచి వచ్చి ఇక్కడ ముఖ్యమంత్రి అవుతామంటే ఒప్పుకుంటామా అని ప్రశ్నించారు. విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లపై ఈనాడు దుష్ప్రచారం చేస్తున్నదని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది దిగజారుడు రాజకీయం

- జనాకర్షణ కోసం పవన్‌కళ్యాణ్, బాలకృష్ణతో సభలు
- ఎంతమంది వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరు
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రాన్ని లూటీ చేసి.. ప్రజలను మోసం చేసిన చంద్రబాబు అధికార దాహంతో అలమటిస్తూ.. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మండిపడ్డారు. తన కుమారుడు చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపుసభకు పవన్ కళ్యాణ్ వస్తేనే కానీ నిర్వహించుకోలేని దుస్థితికి టీడీపీ దిగజారిపోయిందన్నారు. తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలిపల్లి వద్ద బుధవారం జరిగిన యువగళం సభకు జనసమీకరణ కోసం రాష్ట్ర నలుమూలల నుంచి ట్రైన్‌లు, బస్సుల్లో కార్యకర్తలను తరలించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. జనాకర్షణ కోసం బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్‌ను సభలకు ఆహ్వానించారని తెలిపారు. ఎన్ని పార్టీలు, ఎంతమంది కలిసి వచ్చినా 2024 జరగబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తాం, రైతులకు మేలు చేస్తాం, ప్రజలకు ఉపకారం చేస్తామని చెబుతున్న ప్రతిపక్ష టీడీపీ నాయకులు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. జాబు కావాలంటే బాబు రావాలి.. ఇంటికో ఉద్యోగమంటూ యువతను మభ్యపెట్టిన చంద్రబాబు తన కొడుకు నారా లోకేశ్‌కు రాజకీయ ఉద్యోగం ఇప్పించుకున్నారే తప్ప సామాన్య నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించలేదన్న విషయం నిరుద్యోగులకు తెలుసన్నారు. 175 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలో దించే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనన్నారు.

దళితుల పక్షపాతి జగనన్నకు జేజేలు

1,180వ రోజు 'బహుజన' రిలే దీక్షలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బహుజనులు

తాడికొండ: దళితులపై ఉన్న అక్రమ కేసులను ఉపసంహరింపజేసిన చేసిన జగనన్నకు పాదాభివందనం చేస్తున్నామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,180వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. దళితులను అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురిచేసిన టీడీపీ ప్రభుత్వం తప్పిదాలపై విచారణ చేసి అక్రమ కేసులు ఎత్తివేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలపై ఉన్న ప్రేమకు నిదర్శనమని చెప్పారు. 2019లో హక్కుల కోసం పోరాటం చేస్తున్న మాదిగలపై చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన అక్రమ కేసులు, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి, పాలకోడూరు, బాపట్ల జిల్లా పర్చూరు, నెల్లూరు జిల్లా రాపూరులో మాలలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గతంలో దళిత బహుజనులను అణగదొక్కేందుకు బాబు అండకో అక్రమంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లోనూ భారీ విజయంతో గెలిపిస్తామన్నారు. సీఎం జన్మదినం సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పల్లె బాబు, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిని వణికిస్తున్న చలిపులి

7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు


చింతపల్లిలో ఉదయం 9గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు


అరకులోయలో చలిమంటలు కాగుతున్న ప్రజలు

సాక్షి, పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): జిల్లాలోని ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకులోయ, చింతపల్లిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 7 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 8.3 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రోజుల వ్యవధిలోనే భారీగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో గిరిజనులు వణికిపోయారు. పాడేరు మండలం మినుములూరులో 11డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ అంతటా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటలకు కూడా మంచు తెరలు అలుముకుంటున్నాయి. చింతపల్లితో పాటు లంబసింగి, గూడెంకొత్తవీధి ప్రాంతాల్లో ప్రయాణికులు కూడా చలి తీవ్రతకు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు వీస్తుండటంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

ఎస్వీ జూలో మరో సింహం మృతి



తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో బుధవారం మరో సింహం మృతి చెందింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవలే అనురాగ్ అనే సింహం జన్యు సంబంధిత కారణాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చనిపోయిన సింహం వయస్సు 23 ఏళ్లు అని, వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు.

టెలికం సేవలపై కేంద్రం నియంత్రణ

వేలం లేకుండానే శాటిలైట్ స్పెక్ట్రమ్‌ల కేటాయింపు

రాజ్యసభలో ప్రవేశపెట్టిన మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆమోదం

న్యూఢిల్లీ: జాతి భద్రత దృష్ట్యా టెలికమ్యూనికేషన్ సేవలను తాత్కాలికంగా నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం కల్పించే కీలకమైన టెలికమ్యూనికేషన్స్ బిల్లు–2023ను గురువారం పార్లమెంట్ ఆమోదించింది. వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా గ్లోబల్ సరీ్వస్ ప్రొవైడర్లకు శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరిపేందుకు కూడా ఈ బిల్లులో నిబంధనలున్నాయి. టెలికమ్యూనికేషన్స్ బిల్లు–2023ను లోక్‌సభ బుధవారమే ఆమోదించగా గురువారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదముద్ర వేసింది. బిల్లును టెలికమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సభలో ప్రవేశపెట్టారు. టెలికం బిల్లు ప్రభుత్వ జోక్యానికి ఎక్కువ తావిచ్చేలా ఉందంటూ పలువురు వ్యక్తం చేసిన ఆందోళనలపై మంత్రి బదులిస్తూ.. వలస పాలన కాలం నాటి పురాతన చట్టాల స్థానంలో ఈ బిల్లును తీసుకువచ్చామన్నారు. ‘టెలికం రంగంలో ఎంతో క్లిష్టమైన నిబంధనలతో కూడిన 100కు పైగా రకాల లైసెన్సులున్నాయి. ఈ బిల్లులో వీటన్నిటినీ తొలగించి, ఒకే ఒక అధికార వ్యవస్థ కిందికి తెచ్చాం.


గురువారం రాజ్యసభ కార్యకలాపాలు కొనసాగుతున్న దృశ్యం

స్పెక్ట్రమ్ కేటాయింపులు పారదర్శకంగా ఉండేందుకు పలు చర్యలు ప్రతిపాదించాం. ఒకటో షెడ్యూల్‌లోని ఏవో కొన్ని ప్రత్యేక కేటగిరీలను మినహాయిస్తే స్పెక్ట్రమ్ కేటాయింపులన్నీ ఇకపై వేలం ద్వారానే జరుగుతాయి’ అని మంత్రి వివరించారు. ‘బిల్లులో సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్రకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు. జాతి భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం టెలికం సేవలను తాత్కాలికంగా అధీనంలోకి తెచ్చుకునేందుకు ఉద్దేశించిన నిబంధన ఇప్పటికే అమల్లో ఉంది. తాజాగా దీనిని మరింత బలోపేతం చేశాం. కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ భారత్ నిధి దేశంలో టెలికం రంగ సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుంది’ అని మంత్రి వివరించారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదంతో చట్ట రూపం దాల్చనుంది.

బిల్లు ముఖ్యాంశాలు..



- శాంతి భద్రతలు, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే పరిస్థితులున్నాయని భావించినప్పుడు టెలికం నెట్‌వర్క్ మొత్తాన్ని ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకోవచ్చు. ప్రజాప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం సందేశా(మెసేజీ)లను రహస్యంగా వినొచ్చు, ప్రసారాలను నిలిపివేయవచ్చు.
- ప్రకృతి విపత్తుల సమయాల్లోనూ ప్రభుత్వానికి ఇటువంటి అధికారాలు దఖలు పడతాయి.
- పై పరిస్థితుల్లో కేంద్రం నేరుగా, లేదా కేంద్రం తరఫున రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రత్యేక అధికారికి టెలికం సర్వీసులను లేదా టెలికం నెట్‌వర్క్‌ను నియంత్రణలోకి తీసుకునే అధికారం సమకూరుతుంది.
- ఎవరైనా అనధికారి టెలికం నెట్‌వర్క్‌ను, పరికరాలను, రేడియోలను వినియోగిస్తున్నారని తేలితే ప్రభుత్వం ఏ భవనాన్ని లేదా విమానం, నౌక సహా ఎటువంటి వాహనాన్ని అయినా తనిఖీ చేయొచ్చు, స్వాధీనం చేసుకోవచ్చు.
- వాణిజ్య అవసరాలకు స్పెక్ట్రమ్‌లను వేలం ద్వారానే కేటాయించాలన్న దేశీయ టెలికం సేవల సంస్థలు జియో, వొడాఫోన్ ఐడియా అభ్యర్థనలను తోసిపుచ్చుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపగ్రహ సేవలందించే కంపెనీలకు పాలనా అనుమతుల ద్వారానే స్పెక్ట్రమ్‌లను కేటాయించేలా నిబంధనలను బిల్లులో పొందుపరిచారు.
- పాలనా అనుమతుల ప్రకారం..స్పెక్ట్రమ్ కేటాయింపులను దేశంలో, అంతర్జాతీయంగా సుదూర శాటిలైట్ సర్వీసెస్, విశాట్..విమానయానం, సముద్రయానంతో అనుసంధానమయ్యే నెట్‌వర్క్‌లు, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వంటి సంస్థలు పొందగలవు.
- ఇంటర్నెట్ ఆధారిత సందేశాలకు, కాల్స్ చేసుకోవడానికి వీలు కల్పించే వాట్సాప్, టెలిగ్రామ్, గూగుల్ మీట్ వంటి యాప్‌లకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయి. వీటిని టెలికం చట్ట పరిధి నుంచి తొలగిస్తారు.
- ఓటీటీ(ఓవర్ ది టాప్) యాప్‌లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) పరిధి నుంచి తొలగిస్తూ బిల్లులో ప్రతిపాదించారు.

అనధికార ట్యాపింగ్‌లకు.. మూడేళ్ల జైలు, రూ.2 కోట్ల జరిమానా

అక్రమంగా, అనుమతుల్లేకుండా ఫోన్ సందేశాలను రహస్యంగా విన్నా, ట్యాపింగ్‌కు పాల్పడినా భారీ జరిమానాతోపాటు కఠిన శిక్ష విధించే నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయి. దేశ ప్రయోజనాలకు, మిత్రదేశాలతో సత్సంబంధాలకు భంగం కలిగించేలా టెలికం సేవలను దుర్వినియోగపరచడం నేరంగా పరిగణిస్తారు. దోషులకు మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.2 కోట్ల వరకు జరిమానా, నేర తీవ్రతను బట్టి ఈ రెండూ విధించే అవకాశం ఉంది. నేరగాళ్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా టెలికం సేవలను అందించే సంస్థలపైనా చర్యలుంటాయి. కాల్ డేటా, ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డుల విషయంలో అక్రమాలకు పాల్పడినా శిక్ష, జరిమానా తప్పదు. టెలికం నెట్‌వర్క్‌లకు, టెలికం సదుపాయాలకు ఉద్దేశ పూర్వకంగా నష్టం కలిగించే వారికి రూ.50 లక్షల వరకు జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదనలున్నాయి.

తప్పుడు ధ్రువ పత్రాలతో సిమ్.. రూ. 50 లక్షల జరిమానా, జైలు

తప్పుడు ధ్రువపత్రాలతో సిమ్ కార్డు పొందే వారికి రూ.50 లక్షల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్షకు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. ఎక్కువ సంఖ్యలో సిమ్ కార్డులను వాడి ‘సిమ్‌బాక్స్’తో అక్రమాలకు పాల్పడే వారికి, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఇతరుల ఫోన్ నంబర్లను స్పూఫింగ్ చేస్తూ మోసాలకు పాల్పడే వారికి కూడా ఇవే శిక్షలుంటాయి. సిమ్ దుర్వినియోగాన్ని అడ్డుకట్ట వేయడంతోపాటు ఇతరులకు వివిధ మార్గాల్లో ఇబ్బంది కలిగించే కాలర్లపైనా చర్యలకు ఇందులో వీలుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, పరిష్కారం పొందేందుకు సైతం బిల్లులో ఏర్పాట్లున్నాయి.

క్రిమినల్ చట్టాలకు ఆమోదం

న్యూఢిల్లీ: బ్రిటిష్ వలస పాలన నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులకు గురువారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులను లోక్‌సభ బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించిన విషయం తెలిసిందే. భారతీయ న్యాయ సంహిత బిల్లు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు, భారతీయ సాక్ష్య బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇండియన్ పీనల్ కోడ్–1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్–1898, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 స్థానంలో ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. ‘ఈ బిల్లులు చట్ట రూపం దాల్చితే ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ మొదలుకొని తీర్పు వరకు అన్నీ ఆన్‌లైన్ అవుతాయి. దేశ విద్రోహ చట్టం రద్దయి పోయింది. రాజద్రోహాన్ని దేశద్రోహంగా మార్చారు. దేశ సార్వభౌమాధికారం, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు కొత్త చట్టం ప్రకారం శిక్షలుంటాయి’అని అమిత్ షా వివరించారు. దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లు, కోర్టులు డిజిటైజ్ అవుతాయని చెప్పారు. వీటిల్లో చండీగఢ్ మొట్టమొదటగా డిజిటైజ్ అవుతుందన్నారు. బ్రిటిష్ పాలనలో గాంధీజీ, తిలక్, సావర్కర్ వంటి వారిని జైళ్లకు పంపిన నిబంధనలను తొలగించడం సంతోషాన్నిచ్చిందని మంత్రి చెప్పారు. బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు సభలో లేనప్పటికీ మంత్రి ఆ పార్టీపై విమర్శలు చేశారు. ఇటాలియన్ అద్దాలు ధరించిన వారు భారత పార్లమెంట్ కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించడాన్ని సగర్వంగా భావించరంటూ కాంగ్రెస్ నేత సోనియానుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

పత్రికల రిజిస్ట్రేషన్ ఇక సులభతరం

బిల్లును ఆమోదించిన పార్లమెంట్

న్యూఢిల్లీ: ప్రచురణ రంగానికి సంబంధించిన బ్రిటిష్ పాలన కాలం నాటి చట్టం స్థానంలో పత్రికల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సమాచార, ప్రసార శాఖల మంత్రి అనురాగ్ వైష్ణవ్ గురువారం లోక్‌సభలో ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు–2023ను ప్రవేశ పెట్టారు. ఇప్పటిదాకా అమల్లో ఉన్న ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్(పీఆర్‌బీ) చట్టం–1867 ప్రకారం పత్రికలను రిజిస్టర్ చేసుకోవాలంటే ఎనిమిదంచెల కఠినమైన విధానాన్ని అనుసరిస్తున్నారు. తాజా బిల్లులో దీనిని సులభతరం చేశారు. కొత్తగా పత్రికను ప్రారంభించాలనుకునే వారు ఒకే ఒక విడతలో రిజిస్టర్ చేసుకునేందుకు వీలు కల్పించేలా నిబంధనలు తీసుకొచ్చారు. ఈ బిల్లు ఆగస్టు 3వ తేదీన రాజ్యసభ ఆమోదం పొందింది.

సీఈసీ, ఈసీల నియామకానికి ప్రధానమంత్రి ప్యానెల్!

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ నియామక బిల్లుకు పార్లమెంట్ పచ్చజెండా

- సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే బిల్లును రూపొందించాం
- లోక్‌సభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ వెల్లడి
- సీఈసీ, ఈసీలకు సుప్రీం న్యాయమూర్తులతో సమాన హోదా

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల(ఈసీ) నియామకం కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన కీలక బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) బిల్లు–2023ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సభలో ప్రవేశపెట్టారు. స్వల్పకాలిక చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును ఈ నెల 12న రాజ్యసభ ఆమోదించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే బిల్లును తీసుకొచ్చినట్లు అర్జున్‌రామ్ మేఘ్వాల్ లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రకటించారు. ఈసీసీ, ఈసీల సర్వీసు నిబంధనలకు సంబంధించి 1991 నాటి చట్టంలో కొన్ని అంశాలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తూ కొత్త బిల్లును రూపొందించినట్లు తెలియజేశారు. ప్రతిపాదిత కొత్త చట్టం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. సీఈసీ, ఈసీల నియామకానికి చట్టాన్ని తీసుకొచ్చే వరకూ ముగ్గురు సభ్యులతో ఒక ప్యానెల్ ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చి నెలలో ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ ప్యానెల్‌లో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని పేర్కొందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే బిల్లును తయారు చేసినట్లు స్పష్టం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజనకు అనుగుణంగా రూపొందించామని అన్నారు. అలాగే సీఈసీ, ఈసీల హోదా, వేతనాలకు సంబంధించిన సవరణలను కూడా బిల్లులో పొందుపర్చారు.

బిల్లులో ఏముంది?

- ప్రస్తుతం సీఈసీ, ఈసీలను కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి నియమిస్తున్నారు.
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీఈసీ, ఈసీల నియామకం ఇకపై ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్యానెల్ పరిధిలోకి రానుంది. అంటే కార్యనిర్వాహక వర్గమే సీఈసీ, ఈసీలను నియమిస్తుంది.
- బిల్లు చట్టంగా మారిన తర్వాత సీఈసీ, ఈసీల నియామకం కోసం కేంద్ర న్యాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో సెర్చ్ కమిటీని ఏర్పాటు ఏయాల్సి ఉంటుంది. ఇందులో ఇద్దరు కేంద్ర కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. సీఈసీ, ఈసీల నియామకం కోసం ఐదుగురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారు చేసి సెలక్షన్ కమిటీకి పంపించాలి.


గురువారం లోక్‌సభ కార్యకలాపాలు కొనసాగుతున్న దృశ్యం

- ఆ తర్వాత ప్రధానమంత్రి నేతృత్వంలో ఒక కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన ప్యానెల్ ఎన్నికల సంఘం సభ్యులను ఎంపిక చేస్తుంది.
- ఒకవేళ లోక్‌సభలో ప్రతిపక్ష నేత లేకపోతే సభలోని ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడిని సెలక్షన్ ప్యానెల్‌లో సభ్యుడిగా నియమిస్తారు.
- సెర్చ్ కమిటీ సూచించిన షార్ట్‌లిస్టులో లేని పేర్లను కూడా పరిగణనలోకి తీసుకొనే అధికారం ప్యానెల్‌కు ఉంటుంది.
- సవరించిన బిల్లు ప్రకారం.. సీఈసీ, ఈసీలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమాన హోదా లభిస్తుంది.
- సీఈసీ, ఈసీలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమానంగా వేతనం చెల్లిస్తారు.
- అధికారిక విధులు నిర్వర్తించే క్రమంలో సీఈసీ, ఈసీలకు కోర్టు కేసుల నుంచి రక్షణ కల్పిస్తూ సవరణ బిల్లులో కొన్ని అంశాలు చేర్చారు.
- సీఈసీ సిఫార్సు లేకుండా ఈసీలను పదవి నుంచి తొలగించడానికి వీల్లేదు.
- సుప్రీంకోర్టు జడ్జిని పదవి నుంచి తొలగించడానికి ఉపయోగించే ప్రక్రియనే సీఈసీ విషయంలోనూ ఉపయోగించాలి.
- సెక్రెటరీ ర్యాంకు లేదా సమాన హోదా ఉన్నవారిని మాత్రమే సీఈసీ, ఈసీలుగా నియమించాలి.
- సీఈసీ, ఈసీలపై గతంలోనే కేసులు ఉంటే.. వారు పదవుల్లో ఉన్నంతకాలం ఆయా కేసుల్లో విచారణ కొనసాగించకూడదు. గతంలో సీఈసీ రాజీవ్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించిన స్పెషల్ సెషన్స్ జడ్జిని తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పదవుల్లో ఉన్న సీఈసీ, ఈసీలపై విచారణ కొనసాగించకూడదన్న నిబంధనను బిల్లులో చేర్చారు.

పాడుబడ్డ భవనాల్లో రూ.329 కోట్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహుకు చెందిన వివిధ ప్రాంతాల్లో ఇటీవలి దాడుల్లో వందల కోట్ల నగదు లభించిన ఘటనకు సంబంధించి ఆదాయ పన్ను శాఖ అధికారులు మరి కొన్ని వాస్తవాలను వెల్లడించారు. ఆ దాడుల్లో మొత్తం రూ.351 కోట్ల నగదు వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఇందులో రూ.329 కోట్ల డబ్బు కట్టలను ఒడిశాలోని అంతగా పేరులేని సుదపాడ, తిత్లాగఢ్, ఖేత్‌రాజ్‌పూర్ వంటి పట్టణాల్లోని శిథిల భవనాల్లోని రహస్య అరల్లో దాచారన్నారు. తమ గ్రూప్ లెక్కల్లో చూపని ఆదాయాన్ని ఇలా దాచిపెట్టినట్లు ఉద్యోగులు చెప్పారని ఐటీ అధికారులు తెలిపారు.

చెక్ రిపబ్లిక్‌లో కాల్పులు.. 15 మంది మృతి

ప్రేగ్: చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రేగ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో నిందితుడు సహా 15 మంది చనిపోయారు. మరో 30 మంది వరకు గాయపడ్డారు. జన్ పలాచ్ స్క్వేర్‌కు సమీపంలోని చార్లెస్ యూనివర్సిటీ వద్ద ఓ వ్యక్తి యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఘటనలో మృతి చెందిన నిందితుడు కూడా విద్యార్థేనని పోలీసులు తెలిపారు.

ఎన్నికలకు సిద్ధంకండి

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోరాడండి ● సీడబ్ల్యూసీ సమావేశంలో అధిష్టానం పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించి, కాంగ్రెస్‌ను గెలుపు తీరాలకు చేర్చడమే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. తెలంగాణ మినహా ఇటీవలి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నప్పటికీ నైతిక స్థైర్యం వీడకుండా ముందుకుసాగాలని పిలుపునిచ్చింది. కూటమి పక్షాలను కలుపుకుంటూ, విజయ లక్ష్యంతో నేతలు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని హైకమాండ్ పెద్దలు సూచించారు. సార్వత్రిక ఎన్నికలు, కూటమి పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో గురువారం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ భేటీకి ఆంధ్రప్రదేశ్ నుంచి రఘువీరారెడ్డి, టి.సుబ్బిరామిరెడ్డి హాజరయ్యారు. తెలంగాణ నుంచి హాజరు కావాల్సిసిన ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ అసెంబ్లీ సమావేశాల కారణంగా రాలేదు. సీడబ్ల్యూసీ తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. తీర్మానంలోని అంశాలను తర్వాత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.


సీడబ్ల్యూసీ భేటీలో సోనియా గాంధీ, ఖర్గే

‘‘ పార్లమెంటు నుంచి 143 మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడాన్ని సీడబ్ల్యూసీ తీవ్రంగా ఖండించింది. బీజేపీ దాని మిత్రపక్షాలకు దీటుగా విపక్షాల ‘ఇండియా’ కూటమిని పటిష్టవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలి’’ అని సీడబ్ల్యూసీ తీర్మానించింది. ‘‘నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న కారణంగా ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరుగుతున్నాయి. ప్రధాని చెప్పే విషయాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు మధ్య చాలా అంతరం ఉంది’ అని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. ‘‘దేశంలో సామాజిక ధ్రువీకరణ తీవ్రమవుతోంది. ఎన్నికల్లో లాభం పొందేందుకు ప్రజలను రెచ్చగొడుతున్నారు’’ అని మండిపడింది. భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. ‘4 రాష్ట్రాల ఫలితాలపై ప్రాథమిక విశ్లేషణ చేసి ఓటమి కారణాలను గుర్తించాం. ఫలితాలు ప్రతికూలంగా ఉన్నా ఓట్ల శాతం సానుకూలంగా ఉంది. శ్రద్ధ పెడితే వచ్చే ఎన్నికలను మలుపు తిప్పగలమన్న ఆశ పెరిగింది’అని చెప్పారు.

అక్రమాస్తుల కేసులో తమిళ మంత్రికి జైలు

సాక్షి, చెన్నై: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో మద్రాసు హైకోర్టు తమిళనాడు ఉన్నత విద్యా శాఖ మంత్రి కె.పొన్ముడి, ఆయన భార్యకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 72 ఏళ్ల పొన్ముడి, ఆయన భార్య పి.విశాలాక్షిని నిర్దోషులుగా పేర్కొంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు ఈనెల 19న కొట్టేయడం తెల్సిందే. నాడు తీర్పును రిజర్వ్ చేసి గురువారం వెలువరించింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం పొన్ముడి, ఆయన భార్యను దోషులుగా తేల్చి చెరో మూడేళ్ల జైలు శిక్షతోపాటు, చెరో రూ.50 లక్షల జరిమానా విధించింది. ‘‘ నిందితులు విల్లుపురం ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోయేందుకు 30 రోజుల గడువు ఇస్తున్నాం. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం’’ అని జస్టిస్ జి.జయచంద్రన్ గురువారం తీర్పు చెప్పారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం రెండేళ్లకు మించి జైలు శిక్ష పడితే ఆ శాసనసభ/లోక్‌సభ సభ్యుడు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. ఈ చట్టం ప్రకారం పొన్ముడి ఎమ్మెల్యేగా అనర్హతను ఎదుర్కొన్నారు. హైకోర్టు తీర్పు వెలువడ్డాక తమిళనాడు డీఎంకే సర్కార్ పొన్ముడిని మంత్రి బాధ్యతల నుంచి తప్పించింది.



పైలట్ రహిత ప్రయాణం

మానవ రహిత డ్రోన్ల వినియోగం ప్రపంచమంతటా విస్తృతమవుతోంది. రిమోట్ కంట్రోల్ టెక్నాలజీతో వీటిని ఆపరేట్ చేస్తుంటారు. ఇదే టెక్నాలజీ ఆధారంగా పైలట్ రహిత విమానాలపై చాలా ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ దిశగా అమెరికాకు చెందిన రిలయబుల్ రోబోటిక్స్ సిస్టమ్స్ సంస్థ సత్ఫలితాలు సాధించింది. సెమీ–ఆటోమేటెడ్ ఫ్లయింగ్ సిస్టమ్‌పై ఈ సంస్థ 2019 నుంచి పరిశోధనలు సాగిస్తోంది. పైలట్ లేకుండా కార్గో విమానాన్ని విజయవంతంగా నడిపించింది. అమెరికాలో ఉత్తర కాలిఫోర్నియాలోని హోలిస్టర్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన ఈ సెస్నా కేరవాన్ విమానం దాదాపు 12 నిమిషాల పాటు గాల్లో 50 మైళ్ల మేర ప్రయాణించింది. గత నెలలో ఈ ప్రయోగం విజయవంతంగా చేపట్టామని రిలయబుల్ రోబోటిక్స్ సిస్టమ్స్ సీఈఓ రాబర్ట్ రోజ్ చెప్పారు. పైలట్ ప్రమేయం లేకుండా రిమోట్ కంట్రోలర్‌తోనే నడిపించినట్లు తెలిపారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఇలాంటి పైలట్ రహిత విమానాలతో కొన్ని సమస్యలు లేకపోలేదు. ఇవి గాల్లో తక్కువ ఎత్తులోనే ప్రయాణిస్తాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించలేవు. ఇలాంటి సమస్యలను పరిష్కరించి, మెరుగైన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడానికి కొంత సమయం పడుతుందని రాబర్ట్ రోజ్ చెప్పారు. తాము అభివృద్ధి చేసిన సాంకేతికతను వాణిజ్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి రిలయబుల్ రోబోటిక్స్ సంస్థ అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్‌తో కలిసి పని చేస్తోంది. మరో రెండేళ్లలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పైలట్ రహిత విమానాల రిమోట్ ఆపరేటర్‌కు ఒక పైలట్ ఉండే అర్హతలన్నీ ఉండాలి. అలాగే పైలట్ లైసెన్స్ కలిగి ఉండాలి. సెస్నా కంపెనీ తయారు చేసిన సరుకు రవాణా విమానాలను కేరవాన్ అని పిలుస్తున్నారు. ఇది సింగిల్–ఇంజన్ ఎయిర్‌క్రాఫ్ట్. ఫ్లైట్ ట్రైనింగ్, టూరిజం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సరుకు రవాణా కోసం వీటిని ఉపయోగిస్తుంటారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

48 ఏళ్ల తర్వాత నిర్దోషిగా..



చేయని తప్పునకు శిక్ష అనుభవించడం, నిందలు మోయడం నిజంగా బాధాకరమే. అమెరికాలోని ఒక్లహోమాకు చెందిన 70 సంవత్సరాల గ్లిన్ సైమన్స్‌కు కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ఏ నేరమూ చేయకపోయినా ఏకంగా 48 సంవత్సరాల ఒక నెల 18 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. జీవితంలో విలువైన సమయం జైలుపాలయ్యింది. న్యాయం అతడి పక్షాన ఉండడంతో ఎట్టకేలకు నిర్దోషిగా బయటపడ్డాడు. అమెరికాలో చేయని తప్పునకు అత్యధిక కాలం శిక్ష అనుభవించింది గ్లిన్ సైమన్స్ అని నేషనల్ రిజిస్ట్రీ ఆఫ్ ఎగ్జోనరేషన్స్ అధికారులు చెప్పారు. 1974 డిసెంబర్‌లో ఒక్లహోమాలోని ఓ లిక్కర్ స్టోర్‌లో హత్య జరిగింది. ఇద్దరు దుండగులు లిక్కర్ స్టోర్ క్లర్క్‌ను కాల్చి చంపి, మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. అప్పుడు గ్లిన్ సైమన్స్ వయసు 22 ఏళ్లు. సైమన్స్‌తోపాటు డాన్ రాబర్ట్స్ అనే వ్యక్తి ఈ హత్య చేశారని పోలీసులు తేల్చారు. వారిద్దరికీ న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. తాము ఈ నేరం చేయలేదని మొత్తుకున్నా అప్పట్లో ఎవరూ వినిపించుకోలేదు. పోలీసులు వారిని జైలుకు పంపించారు. డాన్ రాబర్ట్స్ 2008లో పెరోల్‌పై విడుదలయ్యాడు. కేసును మళ్లీ విచారించాలని సైమన్స్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాడు. దాంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసును మళ్లీ విచారించారు. సైమన్స్ హత్య చేయలేదని గుర్తించారు. అతడిని జైలు నుంచి విడుదల చేస్తూ ఒక్లహోమా కంట్రీ జిల్లా కోర్టు రెండు రోజుల క్రితం తీర్పు ఇచ్చింది. అంతేకాదు అతడికి 1.75 లక్షల డాలర్ల (రూ.1.45 కోట్లు) నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సైమన్స్ మంగళవారం కారాగారం నుంచి బయటకు వచ్చాడు. తాను నేరం చేయలేదు కాబట్టి శిక్షను ధైర్యంగా ఎదుర్కొన్నానని, ఎప్పటికైనా నిర్దోషిగా విడుదలవుతానన్న నమ్మకంతో ఉన్నానని సైమన్స్ చెప్పాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మరో ముగ్గురి సస్పెన్షన్

న్యూఢిల్లీ: పార్లమెంట్ నుంచి విపక్ష ఎంపీల సస్పెన్షన్ల పర్వం యథావిధిగా కొనసాగింది. భద్రతా వైఫల్యంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేయడంతో గురువారం లోక్‌సభ నుంచి ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు డీకే సురేష్, దీపక్ బైజ్, నకుల్‌నాథ్‌ను స్పీకర్ బహిష్కరించారు. ప్రసుతం సెషన్ ముగిసేదాకా వారికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ నుంచి సస్పెండైన సభ్యుల సంఖ్య 100కు చేరుకుంది. ఇప్పటిదాకా పార్లమెంట్ నుంచి మొత్తం 146 మంది సస్పెండయ్యారు. వీరిలో రాజ్యసభ సభ్యులు 46 మంది ఉన్నారు.

లోక్‌సభ నిరవధికంగా వాయిదా

లోక్‌సభ గురువారం నిరవధికంగా వాయిదా పడింది. శీతాకాల సమావేశాల్లో షెడ్యూల్ కంటే ఒక రోజు ముందే దిగువ సభ వాయిదా పడడం గమనార్హం. ఈ నెల 4న ప్రారంభమైన ఈ సెషన్‌ను షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22న ముగించాల్సి ఉంది. పార్లమెంట్ నూతన భవనంలో పూర్తిస్థాయిలో జరిగిన తొలి సెషన్ ఇదే. ఈసారి సభలో 74 శాతం ప్రొడక్టివిటీ నమోదైనట్లు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తెలిపారు. మొత్తం 18 బిల్లులను ఆమోదించినట్లు చెప్పారు. శీతాకాల సమావేశాలు ఈసారి వాడీవేడిగా జరిగాయి. లోక్‌సభలో అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇద్దరు ఆగంతకులు సభలోకి ప్రవేశించడం, రంగుల గొట్టాలు ప్రయోగించడం వంటివి దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయడం, నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడంతో రికార్డు స్థాయిలో 146 మంది ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల నుంచి సస్పెండయ్యారు. ప్రశ్నలకు లంచాలు కేసులో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై సస్పెన్షన్ వేటు పడింది.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

సైనిక వాహనాలపై దాడి ● నలుగురు జవాన్లు మృతి...

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో సాయుధ ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రెండు సైనిక వాహనాలపై మెరుపుదాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు జవాన్లు మృతిచెందారని, మరో ముగ్గురు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. సురాన్‌కోట్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 3.45 గంటలకు ఈ దాడి జరిగిందని చెప్పారు. గాలింపు చర్యల కోసం వెళ్తున్న సైనిక వాహనాలపై దత్యార్‌మోర్హ్ వద్ద ముష్కరులు దాడి చేశారని పేర్కొన్నారు. ఒక ట్రక్కు, మరో జీప్సీపై తుపాకులతో కాల్పులు జరిపారని తెలిపారు. అప్రమత్తమైన జవాన్లు వెంటనే ఎదురు కాల్పులు ప్రారంభించారని, కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వివరించారు. దాడికి పాల్పడింది తామేనని లష్కరే తోయిబా అనుబంధ పీపుల్స్ యాంటీ–ఫాసిస్ట్ ఫ్రంట్(పీఏఎఫ్ఎఫ్) ప్రకటించింది.

సీఐఎస్ఎఫ్ చేతికి పార్లమెంట్ భద్రత

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లోకి ఆగంతకుల చొరబాటుతో భద్రతా వైఫల్యం వెలుగుచూసిన నేపథ్యంలో పార్లమెంట్‌ను అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీల తరహాలో బాడీ చెకింగ్, చేత్తో పట్టుకునే డిటెక్టర్‌లతో సోదాలు, ఎక్స్‌రే మెషీన్‌తో వస్తువుల స్కానింగ్ వంటి సమగ్ర తనిఖీ వ్యవస్థను పార్లమెంట్ వద్ద ఏర్పాటుచేయనున్నారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం, 22, డిసెంబర్, 2023



భవానీ దీక్ష ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రిపై జనవరి 3వ తేదీ నుంచి జరిగే భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లను గురువారం డీసీపీ విశాల్‌గున్ని పరిశీలించారు. -8లో▸



కబడ్డీ పోటీల విజేత 'కృష్ణా'

సీఎం వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరంలో నిర్వహించిన మహిళల కబడ్డీ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. -8లో▸

అమెరికాలో వైద్య విద్యార్థిని మృతి



అమెరికాలో వైద్య విద్య అభ్యసించడానికి వెళ్లిన విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడుకు చెందిన విద్యార్థిని జహీరా కారులో గ్యాస్ లీకై దుర్మరణం చెందింది. -8లో▸

న్యూస్‌రీల్

రోలర్ స్కేటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 12 నుంచి చండీఘడ్(డౌన్ హీల్, రోలర్ స్కూటర్, రోలర్ ఫ్రీ స్టయిల్, ఇన్‌లైన్ హాకీ విభాగాలు), చెన్నై(ఆర్టిస్టిక్, స్పీడ్ విభాగాలు)లలో ప్రారంభమైన ఈ పోటీలకు జిల్లా నుంచి 26 మంది క్రీడాకారులు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 5–7, 7–9, 9–11, 14–17, 17 ప్లస్ వయసు కేటగిరీలతో పాటు సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో 13 మంది క్రీడాకారులు 14 పతకాలను కై వసం చేసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, కృష్ణాజిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ డి.దుర్గాప్రసాద్, అధ్యక్షులు డాక్టర్ జె.దుర్గాప్రసాద్, కార్యదర్శి దాసరి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వరరావు, కోశాధికారి సోంతాతియా అభినందించారు.

ఈసీ సమీక్షకు ఏర్పాట్లు పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై ఈ నెల 22వ తేదీ శుక్రవారం నుంచి రెండురోజుల పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం జరగనుంది. ఇందుకు సంబంధించి నోవోటెల్ హోటల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గురువారం నోవోటెల్ హోటల్‌లో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశానికి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ప్రతినిధి బృందం హాజరవుతుందన్నారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో జేసీ, సబ్ కలెక్టర్, డీఆర్వో ఉన్నారు.



కానూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మహిళలతో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, చిత్రంలో బొప్పన భవకుమార్



విజయవాడ 21వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



విజయవాడ 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో మొక్క నాటి నీళ్లుపోస్తున్న మల్లాది విష్ణు

జన దీవెన

నాయకుడా జీవించు వందేళ్లు.. వర్ధిల్లు వెయ్యేళ్లు

జననేతకు జన దీవెనలు వెల్లువెత్తాయి. విలువలు విశ్వసనీయతే స్ఫూర్తిగా, నవరత్నాల పథకాల సృష్టికర్తగా ప్రజా సంక్షేమం కోసం పరితపించే ప్రజా నాయకుడిని జిల్లా ప్రజలు మనసారా దీవించారు. చేతల్లో మానవీయతను, ఆలోచనల్లో అభ్యుదయాన్ని, వివేకాన్ని సృజనాత్మకతను జోడించి సువర్ణపాలన అందిస్తున్న తమ ప్రియతమ నేత పుట్టిన రోజు తమకందరికీ పండుగే అన్నట్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఊరూవాడా సంబరంలా చేసుకున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుతూ కేక్‌లు కట్ చేశారు. సేవా కార్యక్రమాలు చేపట్టి స్ఫూర్తిగా నిలిచారు. భారీ ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అనాథలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– కంకిపాడు(పెనమలూరు)



విజయవాడ 46వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

ఘనంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పేదలకు చీరలు పంపిణీ, రక్తదాన శిబిరాలు నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. పార్టీలకతీతంగా సామాన్యులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు కేక్ కట్ చేశారు.

- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వందలాది ద్విచక్రవాహనాలతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. బైక్ ర్యాలీలో వెస్ట్ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముత్యాలంపాడులో చీరల పంపిణీ, అయోధ్యనగర్‌లో మొక్కలు నాటారు. సింగ్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ రుహుల్లా పాల్గొని కేక్ కట్‌చేశారు.
- విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పటమట 12వ డివిజన్‌లో దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, ఇస్త్రీ పెట్టెలు, కుట్టు మిషన్లు అందజేయగా, 4వ డివిజన్‌లో చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమంలో సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొరివి చైతన్య కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని కేక్‌కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. లంబాడీపేటలో, 47వ డివిజన్‌లలో చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పంజాసెంటర్, గాంధీబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసీఫ్, చాంబర్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు పాల్గొన్నారు.



చోడవరంలో చిన్నారులతో కలిసి కేట్ కట్ చేస్తున్న డీసీఎంఎస్ చైర్ పర్సన్ స్నిగ్ధ

- గన్నవరం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలోని తాడిగడప నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్‌తో కలిసి కేక్ కట్ చేశారు.
- డీసీఎంఎస్ చైర్‌పర్సన్, రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 20 వేల మంది విద్యార్థులు, 1800 మంది వలంటీర్లు, ఉపాధ్యాయులు, స్కీం వర్కర్లకు స్వీట్‌బాక్సులు అందించారు. చోడవరంలో 51 కిలోల కేక్‌ను పాఠశాల విద్యార్థులతో కలిసి పడమట స్నిగ్ధ కట్ చేశారు.

జిల్లా పార్టీ కార్యాలయంలో..

ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. వికలాంగురాలికి ట్రై సైకిల్ అందజేశారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గౌస్ మొహిద్దీన్, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇది చదువుల విప్లవం

- అత్యున్నత విద్యా నైపుణ్యాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- ఎన్టీఆర్ జిల్లాలో రూ. 23 కోట్లు విలువైన 13,118 ట్యాబ్‌ల పంపిణీ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడతూర్పు): నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో కెరీర్ పరంగా ఉన్నత అవకాశాలు పొందాలంటే అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అవసరమని భావించి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం విజయవాడ, పటమటలోని జీడీఈటీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డీఈవో సీవీ రేణుక, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు.

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 1,064, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 12,054 మొత్తం దాదాపు రూ. 23 కోట్లు విలువైన 13,118 ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రూ. 15,500 విలువగల బైజూస్ కంటెంట్‌తో పాటు దాదాపు రూ. 17,500 మార్కెట్ విలువగల ట్యాబ్‌లను అందించామన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విన్న తర్వాత బైజూస్ వీడియో పాఠాలు వింటే కాన్సెప్టులపై మంచి పట్టు ఏర్పడుతుందన్నారు. లెర్న్–ప్రాక్టీస్–రివైజ్‌కు వీలు కల్పించే 3డీ విజువల్ పాఠాల ద్వారా నేర్చుకున్న అంశాలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. భవిష్యత్తులో కెరీర్ పరంగా మంచి అవకాశాలను అందుకోవాలంటే బాగా చదవాలని.. అందుకు ఈ ట్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు.



విద్యార్థికి ట్యాబ్ అందిస్తున్న అవినాష్, డీఈఓ రేణుక (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

విద్యతోనే పేదరికం అంతం..

విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ విద్యతోనే పేదరికం అంతమవుతుందని గుర్తించి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి విద్యా రంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారని.. జగనన్న గోరుముద్ద ద్వారా పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రత్యేక మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ సాంబశివరావు, ఎంఈవో విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

బాలానందం



సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

అట్టహాసంగా ముగిసిన అమరావతి బాలోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉత్సాహం ఉరకలెత్తింది.. ప్రతిభ కళ్లకు కట్టింది.. బాలానందం అంబరాన్నంటింది. అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో విజయవాడ పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభమైన 6వ అమరావతి బాలోత్సవం గురువారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా సెర్ప్ సీఈవో ఎండీ ఇంతియాజ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగేతత్వాన్ని విద్యార్థి దశ నుంచే అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్పారు. విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించిన పరీక్షలకు సిద్ధమైనట్లుగానే ఆట, పాట, నృత్యం, చిత్రలేఖనం వంటి పోటీలకు కూడా సిద్ధమవ్వాలన్నారు. అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఏటా బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మల్లికార్జునరావు, డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

మేరీమాత పుణ్యక్షేత్రంలో చంద్రబాబు ప్రార్థనలు



ఫాదర్ ఆశీస్సులు అందుకుంటున్న చంద్రబాబు, భువనేశ్వరి

గుణదల (విజయవాడ తూర్పు): టీడీపీ నేత నారా చంద్రబాబునాయుడు విజయవాడలోని గుణదల మేరీమాతను దర్శించుకున్నారు. గురువారం ఉదయం ప్రధానాలయంలోని మేరీమాత స్వరూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు ఇతర గురువులతో కలిసి చంద్రబాబు దంపతులను ఆశీర్వదించారు. అక్రమార్జన కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన చంద్రబాబు పుణ్యక్షేత్రాలు సందర్శించి దైవదర్శనాలు చేసుకుంటున్నారు. కాగా, ఇప్పటి వరకు గుణదల పుణ్యక్షేత్రంలో అడుగుపెట్టని చంద్రబాబు ఇక్కడకు వచ్చి ప్రార్థనలు చేయడం విశేషం. కేవలం దైవ దర్శనానికే తప్ప రాజకీయ కోణంలో తాను రాలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, పలువురు టీడీపీ నేతలు ఆయన వెంట ఉన్నారు.

క్లుప్తంగా

ఏఎన్ఆర్ కళాశాలలో చెస్ పోటీలు



విజేతలతో ప్రిన్సిపాల్ శివనాథ్

గుడివాడ టౌన్: ఏఎన్ఆర్ కాలేజీ ప్రాంగణంలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల చెస్ మెన్ అండ్ ఉమెన్ టోర్నీ గురువారం జరిగింది. యూనివర్సిటీ పరిధిలోని 12 కాలేజీల విద్యార్థులు ఈ పోటీల్లో తలపడ్డారు. విద్యార్థుల విభాగంలో విజయవాడ ఆంధ్ర లయోలా కాలేజీ ప్రథమం, విజయవాడ కేబీఎన్ కాలేజీ ద్వితీయం, విజయవాడ పీబీ సిద్ధార్ధ కాలేజీ తృతీయ స్థానాల్లో నిలిచాయి. విద్యార్థినుల విభాగంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజీ, మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డాక్టర్ కాలేజీ, విజయవాడ కేబీఎన్ కాలేజీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎన్ఆర్ కళాశాల ప్రెసిడెంట్ లింగం రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, సెక్రటరీ ఎస్.అప్పారావు, పీడీ వీర్ల గోపి, గ్రంథాలయాధికారి బి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా పద్మావతి బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ పద్మావతి గొల్లపూడిలోని డైరెక్టర్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పద్మావతికి డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను(ఎఫ్ఏసీ) ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే.

సర్వజన ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సలు

- ముగ్గురికి విజయవంతంగా ఆపరేషన్లు చేసిన ఆర్థోపెడిక్ డాక్టర్లు
- వైద్యులను అభినందించిన కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



కోలుకున్న పాలగాని జనార్దన్‌తో ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి శ్రీనివాసరావు, వైద్యుల బృందం



గజ్జల హర్షవర్ధన్‌తో డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యుల బృందం

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద ముగ్గురు రోగులకు ఆర్థోపెడిక్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సలతో స్వస్థత చేకూర్చారు. అరుదైన శస్త్రచికిత్సలను విజయవంతంగా చేసిన వైద్యులను కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు గురువారం అభినందించారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో పలు విభాగాల వైద్యులు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు పాలగాని జనార్దన్ తుంటి నొప్పితో బాధపడుతూ సరిగా నడవలేని పరిస్థితిలో సర్వజన ఆస్పత్రికి వచ్చాడు. అతనికి నవంబర్ 30వ తేదీన ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ డి.శ్రీనివాసరావు నేతృత్వంలో వైద్య బృందం తుంటి కీలు మార్పిడి శస్త్రచికిత్స చేసింది. అతని ఆరోగ్యం కుదుటపడటంతో డిశ్చార్జ్ చేశారు. కృత్తివెన్నుకు చెందిన 19 ఏళ్ల వడ్డిపోగు సుజీకుమార్ కిందపడి ఏసీఎల్ లిగమెంటు తెగిపోయి మోకాలు పక్కకు వెళ్లింది. అతడికి ఈ నెల ఒకటో తేదీన శ్రీనివాసరావు బృందం ఆర్థోస్కోపిక్ ఆపరేషన్ విజయవంతంగా చేసింది. గూడూరు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన 17 ఏళ్ల గజ్జల హర్షవర్ధన్ కుడిమోకాలు వంకరగా ఉండి చికిత్స కోసం ఆస్పత్రిలో చేరాడు. నవంబర్ 14వ తేదీన అతనికి వైద్యులు శస్త్రచికిత్స చేసి ఇలిజరవ్ రింగ్ బిగించి వంకర కాలును సరిచేశారు. హర్షవర్ధన్ కోలుకుని సక్రమంగా నడుస్తుండటంతో డిశ్చార్జ్ చేశారు. లక్షల రూపాయలు ఖర్చయ్యే ఈ ఆపరేషన్లను ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా చేశారు. కీళ్లు, ఎముకల వైద్యనిపుణుడు డాక్టర్ డి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆ విభాగం డాక్టర్లు టి.హరీష్, నవీన్, ఎం.శ్రీనివాస్, ఉషారాణి వారికి అరుదైన ఆపరేషన్లను విజయవంతంగా చేశారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ రాజా బాబు వైద్యుల బృందాన్ని, ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, ఆర్ఎంఓ నిరంజన్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాసరావును గురువారం అభినందించారు.

ఆర్టీసీ బస్సును దహనం చేసిన మావోయిస్టులు



దగ్ధమైన గన్నవరం డిపో బస్సు

గన్నవరం: తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు సమీపంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సును మావోయిస్టులు దహనం చేసిన ఘటన బుధవారం రాత్రి చోటు జరిగింది. గన్నవరం డిపో మేనేజర్ పి.శివాజీ కథనం మేరకు.. గన్నవరం ఆర్టీసీ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు 35 మంది ప్రయాణికులతో గన్నవరం బయలుదేరింది. రాత్రి ఏడు గంటలకు తెలంగాణ సరిహద్దు ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌లోని కొంటాకు 15 కిలోమీటర్ల సమీపంలోకి రాగానే బస్సును మావోయిస్టులు అడ్డుకున్నారు. బస్సులో ప్రయాణికులతో పాటు డ్రైవర్లు సీతారామ్, ఎం.ఎస్.బాబును కిందకు దించివేశారు. బస్సుతో పాటు మరో రెండు లారీలు, కారుపై మావోయిస్టులు పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. భయాందోళనకు గురైన డ్రైవర్లు, ప్రయాణికులు ఘటన స్థలానికి ఐదు కిలోమీటర్ల దూరంలో సీఆర్పీఎఫ్ క్యాంప్‌నకు చేరుకున్నారు. సీఆర్పీఎఫ్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో బస్సులోని బాయినెట్, డ్రైవర్ సీటు, డ్యాష్‌బోర్డ్, స్టీరింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ మాత్రమే పాక్షికంగా దగ్ధమన్యాయి. మరమ్మతుల నిమిత్తం బస్సును తిరిగి డిపోనకు తీసుకువచ్చేందుకు సిబ్బందిని పంపినట్లు డీఎం తెలిపారు.

తాతను హత్య చేసిన మనవడికి జీవిత ఖైదు

విజయవాడ స్పోర్ట్స్: ఆస్తి కోసం తాతను హత్య చేసిన మనుమడికి జీవిత ఖైదు విధిస్తూ విజయ వాడ 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ బీసెంట్ రోడ్డులో నివసించే పులి అప్పారావు (93)కు ఆదే ప్రాంతంలో నివసించే అతని మనవడు పులి దుర్గాప్రసాద్‌కు తరుచూ ఆస్తి విషయమై గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలోనే 2020 జూలై 22వ తేదీన అప్పారావును అతని ఇంట్లోనే దుర్గాప్రసాద్ హత్య చేశాడు. అదే ఇంట్లోని ఓ షాప్‌ను అద్దెకు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మర్నాడే నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ జి.కల్యాణి కోర్టులో వాదనలు వినిపించారు. పది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు దుర్గాప్రసాద్‌కు జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కోవిడ్‌తో అప్రమత్తంగా ఉండండి

- తగిన జాగ్రత్తలు పాటించండి
- ఎన్టీఆర్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): కోవిడ్ కొత్త వేరియంట్ క్రమంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కోవిడ్ సబ్ వేరియంట్ జేఎన్-1పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సైతం కొత్త కేసులను గుర్తించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. జేఎన్-1 కేసులు దేశంలో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఏర్పడుతున్న భయాలను తొలగించడానికి, వారికి ఆరోగ్య భద్రతను కల్పించడానికి, వైరస్‌ను నిర్ధారించడానికి వైద్య, ఆరోగ్య శాఖ వేగవంతమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

లక్షణాలు.. వ్యాధి తీవ్రత

- జేఎన్-1 లక్షణాలు సాధారణంగా ఇతర కోవిడ్-19 వేరియంట్‌లకు అనుగుణంగా ఉంటాయి.
- ముఖ్యంగా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, వణుకు, వాసన గుర్తించక పోవడం, ఒళ్లు నొప్పులు ఉంటాయి.
- రోగ నిరోధక వ్యవస్థను ప్రతిఘటించే శక్తి ఈ వేరియంట్‌కు ఉంటుంది.
- జేఎన్-1 సబ్-వేరియంట్‌తో సంబంధం ఉన్న తీవ్రత, విభిన్న లక్షణాలను సూచించే ఆధారాలు ప్రస్తుతం మన ప్రాంతంలో లేవు.
- విస్తృతమైన టీకా తీసుకున్న, మునుపటి ఇన్ఫెక్షన్‌తో బాధపడిన వారికి తీవ్రమైన వ్యాధి అవకాశం తక్కువగా ఉంటుంది.
- తరచుగా చేతులను శుభ్రం చేసుకోవడం, రద్దీగా ఉండే ప్రాంతాలను నివారించడం, సామూహిక కార్యక్రమాల నియంత్రణ, మాస్క్ ధరించడం వంటి సాధారణ జాగ్రత్తలు తప్పనిసరి.

చికిత్స.. టీకాలు

- ప్రస్తుతం ఉన్న కోవిడ్-19 చికిత్స ప్రొటోకాల్ పద్ధతులు జేఎన్-1ను సమర్థంగా ఎదుర్కొంటాయి.
- అభివృద్ధి చేసిన కోవిడ్-19 వ్యాక్సిన్‌లు ఇతర వేరియంట్‌లకు వ్యతిరేకంగా వాటి సమర్థతను పోలి ఈ సబ్-వేరియంట్‌కు వ్యతిరేకంగా రక్షణను పెంచే అవకాశం ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.
- జేఎన్-1 సబ్-వేరియంట్‌ను గుర్తించేందుకు అత్యంత నమ్మకమైన పద్ధతిగా ఆర్టీపీసీఆర్ పరీక్షలను కొనసాగించాలని ఆరోగ్య శాఖ సూచించింది.
- ఇది కేసుల కచ్చితమైన, సకాలంలో వ్యాధి గుర్తింపును నిర్ధారిస్తుంది.

ప్రజారోగ్య చర్యలు ఇలా..

- రాబోయే పండుగ సీజన్‌లో, శ్వాసకోశ పరిశుభ్రత నిబంధనలను కఠినంగా పాటించాల్సిన అవసరాన్ని వైద్య ఆరోగ్యశాఖ సూచించినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.
- బహిరంగ ప్రదేశం, జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించాలి.
- తరచుగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- వ్యక్తుల మధ్య భౌతిక దూరాన్ని పాటించాలి.

మహిళల కబడ్డీ విజేత కృష్ణా జిల్లా జట్టు



అతిథుల చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంటున్న కృష్ణాజిల్లా జట్టు

విజయనగరం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం ఎనిమిది జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఆతిథ్య విజయనగరం జట్టు ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకుంది. తృతీయ స్థానంలో విశాఖ, నాల్గవ స్థానంలో గుంటూరు జట్లు నిలిచాయి. విజేత జట్లకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు.

అమెరికాలో వైద్య విద్యార్థిని మృతి

కారులో గ్యాస్ లీకై ప్రమాదం



జహీరా నాజ్ (ఫైల్)

రామవరప్పాడు(గన్నవరం): అమెరికాలో వైద్య విద్య అభ్యసించడానికి వెళ్లిన తెలుగు విద్యార్థిని కారులో గ్యాస్ లీకై దుర్మరణం చెందింది. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సాయిబాబా గుడి సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో షేక్ జమీలా తన ఇద్దరు కుమార్తెలు జహీరా నాజ్ (22), రజియా (20) తో కలిసి నివసిస్తున్నారు. జమీలా భర్త జిలానీ గోల్డ్ స్మిత్. అతను పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి జమీలా కుమార్తెల బాధ్యత చూసుకుంటున్నారు. పెద్ద కుమార్తె జహీరా నాజ్ విజయవాడ మాంటిస్సోరీ కళాశాలలో ఫిజియోథెరపీ కోర్సు పూర్తి చేసింది. ఆమె సోదరి రజియా నగరంలోని లయోలా కళాశాలలో డిగ్రీ చదువుతోంది. జహీరా నాజ్ ఎంఎస్ చేయడానికి ఈ ఏడాది ఆగస్టు 25న అమెరికాలోని చికాగో వెళ్లింది. ఈ నెల 19వ తేదీన కళాశాలకు ట్యాక్సీలో వెళ్తుండగా కార్బన్‌మోనాక్సైడ్ లీకైంది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు జహీరా నాజ్ స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి అక్కడ మృతి చెందింది. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ప్రసాదంపాడులో విషాదఛాయలు

ఈ ఘటన గురించి అమెరికా పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ప్రసాదంపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లిన కుమార్తె మృతి వార్త తెలుసుకున్న తల్లి జమీలా గుండెలవిసేలా విలపించారు. ఉన్నత చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వస్తావనుకుంటే అర్థంతరంగా జీవితం ముగిసిపోయిందా అంటూ మృతురాలి సోదరి, మేనమామ సలీం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అమెరికాలో ఉన్న బంధువుల సహకారంతో అక్కడే జహీరానాజ్ అంత్యక్రియలు పూర్తిచేస్తామని మేనమామ సలీం తెలిపారు.



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జనవరి మూడు నుంచి ఏడో తేదీ వరకు జరిగే భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లను గురువారం డీసీపీ విశాల్ గున్ని పరిశీలించారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు, ఇంజినీరింగ్ అధికారులు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. భవానీలు కొండపైకి చేరుకునే క్యూలైన్ మార్గాలు, అమ్మవారి ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు, మహామండపం క్యూలైన్లు, హోమ గుండాలు, ప్రసాదం కౌంటర్లు, వినాయకుడి గుడి పరిసరాలతో పాటు స్నాన ఘాట్లను పరిశీలించారు. భవానీలకు దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలను డీసీపీకి ఆలయ ఈఓ రామారావు, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి వివరించారు. వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విజయవాడ స్పోర్ట్స్: స్థానిక స్వరాజ్య మైదానంఎదురుగా బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇబ్రహీంపట్నానికి చెందిన చింతల గోపీచంద్ (22) మృతి చెందాడు. బెంజిసర్కిల్ సమీపంలోని ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న గోపీచంద్ విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. స్వరాజ్య మైదానం ఎదురుగా అతని వాహనం ప్రమాదానికి గురవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని గాయపడ్డాడా లేక ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడం వల్ల మృతి చెందాడా అన్నది తేలలేదని పోలీసులు పేర్కొన్నారు. సూర్యారావుపేట సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

24న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

విజయవాడకల్చరల్: శ్రీ లక్ష్మీనారాయణ పరిచయ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఆదివారం బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మధిర రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే ఈ కార్యక్రమంలో శాఖా భేదాలు లేకుండా పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9989 99112 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తోపుడు బండి అందజేత



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుపేద కుటుంబానికి జీవనోపాధి నిమిత్తం వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి, వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ గాయత్రినగర్‌లో తోపుడు బండిని గురువారం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రాణిగారితోటకు చెందిన జమ్మలమూడి రవి కుటుంబానికి తోపుడు బండిని అందించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు చావా నరసింహారావు, పాట్లూరి రవి, జైహింద్ రావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి నటరాజస్వామి వారి ఆరుద్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని నటరాజస్వామి వారి ఆలయంలో 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు స్వామి వారి ఆరుద్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. 26వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీశివకామ సుందరీ సమేత నటరాజ స్వామి వారి ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు, వధూవరులుగా అలంకరణ జరుగుతుందన్నారు. సాయంత్రం అంకురార్పణ, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, బలిహరణ వంటి వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. 27వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మూలమంత్ర హవనం, బలిహరణ, ఔపాసన, మండప పూజలు, సాయంత్రం పూజా కార్యక్రమాలను జరుగుతాయన్నారు. రాత్రి 8 నుంచి 10.30 గంటల వరకు కల్యాణోత్సవం, లింగోద్భవ కాలంలో ఆరుద్రోత్సవం, 28వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, ధ్వజారోహణం, సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవ మూర్తులకు నగరోత్సవ సేవతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



పటమట(విజయవాడతూర్పు): స్థానిక 14వ డివిజన్ గోవిందరాజుల హైస్కూల్ నందు తూర్పు నియోజకవర్గానికి చెందిన 1,310 విద్యార్థులకు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 45 వేల స్మార్ట్ టీవీలు ఏర్పాటుచేసి ప్రతి తరగతి గదిలో ఆఫ్ లైన్, ఆన్ లైన్ క్లాసులతో విద్యా బోధన చేస్తున్నామని చెప్పారు. డీఈవో రేణుక, కార్పొరేటర్ చింతల సాంబయ్య, డివిజన్ ప్రెసిడెంట్ శెటికం దుర్గా ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి సన్నీ, నాయకులు మరీదు ఉమా పాల్గొన్నారు.

స్టెల్లాలో మ్యాథమేటికల్ క్యాంప్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్టెల్లా కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం జాతీయ మ్యాథమేటికల్ క్యాంప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖ ప్రారంభించారు. ఈ క్యాంప్‌ను హైదరాబాద్‌కు చెందిన సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు రజత్‌టండన్, సుకుమార్, న్యూఢిల్లీ ట్రైనర్స్‌కు చెందిన రాహుల్ చక్రవర్తి, కోల్‌కత్తా ఇన్‌కం టాక్స్ కమిషనర్ గౌరవ్‌సిన్హా సందర్శించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గణితశాస్త్రాన్ని అభ్యసించటం చాలా తేలికని, అందులో మెలకువలు నేర్చుకోవటం సులభమన్నారు. విద్యార్థులకు ఆల్‌జీబ్రా, నంబర్‌థియరీ, రీజనింగ్ స్కిల్స్, లాజికల్ థికింగ్‌పై అవగాహన కల్పించారు. కళాశాల డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ జి.ఉషాకుమారి, శిక్షణ క్యాంప్ రీజనల్ కో–ఆర్డినేటర్ సుధాదేవి పాల్గొన్నారు.

కాల్వలో పడిన వ్యక్తి మృతి

పటమట(విజయవాడతూర్పు): మద్యం సేవించి కాల్వ వద్దకు వెళ్లి కాలుజారి వ్యక్తి మృతిచెందిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామవరప్పాడులో చోటుచేసుకుంది. పటమట పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామవరప్పాడుకు చెందిన గుడాల వెంకటాచారి(54) బుధవారం రాత్రి మద్యం సేవించి రైవస్ కాల్వలో కాలుజారి పడ్డాడు. దీనిపై స్థానికుల పటమట పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంక్షేమ పథకాల రూపకర్త సీఎం జగనన్న

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- వాడవాడలా ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సంక్షేమ పథకాల రూపకర్త సీఎం జగనన్న అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ అభిమానులు కేక్ కట్ చేసి, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని వైట్ హౌస్ సెంటర్‌లో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో, కృష్ణలంక, 21వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ పుప్పాల కుమారి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అవినాష్ పాల్గొని కేక్‌ను కట్ చేసి సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో 175కు 175 సీట్లు వైఎస్సార్ సీపీ గెలుస్తుందని, టీడీపీ నేతల మైండ్ బ్లాక్ అవడం ఖాయమన్నారు. యువగళం 400 రోజులు, 4వేల కి.మీ. పాదయాత్ర అని చెప్పిన నారా లోకేష్ చేతకాక మధ్యలో ముగించేశారని విమర్శించారు. ఓటమి భయంతో ఎల్లో మీడియా, పెయిడ్ మీడియా, వాట్సాప్‌లలో తమపై అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఎవరెంత ప్రచారం చేసినా తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం తథ్యమన్నారు. తూర్పులో పవన్‌కల్యాణ్ గానీ, చంద్రబాబు గానీ పోటీ చేసినా జగన్ బొమ్మ ముందు వారు నిలబడలేరన్నారు. మరో 30 ఏళ్లు జగన్ సీఎంగా ఉంటారని, టీడీపీని ప్రజలు పాతాళంలో కలిపేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రాణిగారితోటలో కేక్ కట్ చేస్తున్న దేవినేని అవినాష్, బుచ్చిబాబు, రామిరెడ్డి



20వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

పండ్ల పంపిణీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్ ఆధ్వర్యంలో ఫకీరుగూడెంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, పార్టీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్, ఎస్‌కే సుభాని, నాగలత తదితరులు పాల్గొన్నారు. శిఖామణిసెంటర్ సమీపంలోని 7వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంపత్, నాయకులు మెరకనపల్లి కుటుంబరావు, రెంటపల్లి కొండ, పరసా క్లైవ్, కత్తుల సంపత్, శంకర్, అశోక్ పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు ఆధ్వర్యంలో జార్జిపేటలో వేడుకలు జరిగాయి. ఓదుల రత్నకుమారి, బి ప్రతాప్, అనిత పాల్గొన్నారు. నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, బొడ్డు అప్పలనాయుల ఆధ్వర్యంలో నగరం సమీపంలోని గోశాలలో గోపూజ నిర్వహించారు. గోవులకు దాణా అందించారు.

16వ డివిజన్‌లో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు మాజీ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి బహదూర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు పండ్లు పంపిణీ చేశారు.

పెన్నులు, పుస్తకాలు, పండ్ల పంపిణీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): 20వ డివిజన్, నల్లగేటు డౌన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. 22వ డివిజన్‌లోని మలేరియా హాస్పిటల్ వద్ద ఉర్దూ స్కూల్‌లో విద్యార్థుల మధ్య స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. స్కూల్ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో..

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక 6వ డివిజన్ బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫకీరుగూడెంలో కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ రెహానా నాహీద్, అలీం, విజయ్



22వ డివిజన్‌లో కార్పొరేటర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో

దివ్యాంగులకు అన్నదానం..

గుణదల(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం సమీపంలోని ప్రేమ్ దాన్ ఆశ్రమంలో 120 మందికి అన్నదానం చేశారు. నాల్గవ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి గల్లా పద్మావతి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచారు.

పటమటలో..

పటమట(విజయవాడతూర్పు): 12వ డివిజన్‌లోని అయ్యప్పనగర్‌లో డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్ బాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. 13వ డివిజన్‌లో ఇన్‌చార్జి రామాయణపు శ్రీనివాస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహించారు.

సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్

ఆటోనగర్(విజయవాడతూర్పు): సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఠాగూర్ రోడ్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఠాగూర్ రోడ్డులో మొక్క నాటుతున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



12వ డివిజన్‌లో పార్టీ నాయకులకు కేక్ తినిపిస్తున్న అవినాష్



7వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ మాధురి, నాయకులు



16వ డివిజన్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న బహదూర్



మొక్క నాటుతున్న కార్పొరేటర్ అమర్‌నాథ్, నాయకులు



13వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న రామాయణపు శ్రీనివాస్, నాయకులు

ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేవు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేవని వీఎంసీ కమిషనర్, సెంట్రల్ ఈఆర్వో(ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్స్ ఆఫీసర్) స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని బారిస్టర్ స్ట్రీట్, సూర్యారావుపేటలో ఉన్న దుర్గా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో గురువారం ఆయన ఓటర్ల జాబితా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 7న జరిగిన పొలిటికల్ పార్టీ సమావేశంలో సర్వే సరిగా జరగడం లేదని టీడీపీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన, డోర్ టు డోర్ సర్వే నిర్వహించామన్నారు. ఈ నెల 9న ప్రత్యేక బృందాలు అందించిన నివేదిక ఆధారంగా గురువారం బూత్ లెవెల్ ఆఫీసర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు, పొలిటికల్ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి స్థానిక ఓటర్లతో మాట్లాడామన్నారు. తనకు సమర్పించిన నివేదిక సరైనదేనని ఈ సందర్భంగా ఆయన తేల్చిచెప్పారు. ఏఈఆర్వో రామ్మోహన్‌రావు, టీడీపీ నాయకుడు నవనీతం సాంబశివరావు, టీమ్ స్పెషల్ ఆఫీసర్ ఇక్బాల్ హుస్సేన్, టీడీపీ ప్రతినిధులు గాజుల రవి, గద్దం రాజు, బీఎల్వోలు, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు



టీడీపీ నాయకులతో కలిసి పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జగనన్నతోనే బంగారు భవిష్యత్

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

కంకిపాడు: జగనన్నతోనే రాష్ట్ర బంగారు భవిష్యత్ ముడిపడి ఉందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 20 వేల మంది విద్యార్థులకు, 1,800 మంది వలంటీర్లు, ఉపాధ్యాయులకు రక్ష ఫౌండేషన్ ద్వారా స్వీట్లు పంపిణీ చేశారు. పెనమలూరు మండలం చోడవరం గ్రామంలో భారీ కేక్‌ను విద్యార్థులతో కట్ చేయించారు. హ్యాపీ బర్త్‌డే జగన్ మామయ్య అంటూ విద్యార్థులు సీఎం జగన్‌కు పుట్టినరోజు వేడుకలు జరిపారు. పెనమలూరు జెడ్పీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సీహెచ్ నవీన్ నవరత్నాల పోస్టర్‌లో జగన్ ఫొటో ఉండేలా డ్రాయింగ్ గీసి డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌కు అందించాడు. కార్యక్రమంలో చోడవరం సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కర్‌రావు, మాదు శివప్రసాద్, మరీదు గురుప్రసాద్, గుడ్డేటి రాజా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రాన్ని గీసి డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధకు అందజేస్తున్న విద్యార్థి నవీన్

ఎన్‌ఎస్‌ఎం పూర్వ విద్యార్థుల సమ్మేళన స్వర్ణోత్సవం

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా గురువారం పూర్వవిద్యార్థుల సమ్మేళన స్వర్ణోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల మొదటి ప్రిన్సిపాల్ మాథ్యూ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలతో ఆయనకున్న అనుబంధాన్ని, నాటి విద్యార్థులతో ఉన్న ఔత్సల్యాన్ని నెమరువేసుకున్నారు. పాఠశాల మొదటి విద్యార్థి ఎస్.జగదీష్(1974)బ్యాచ్ మాట్లాడుతూ పాఠశాల స్థాపించినప్పుడు తానే మొదటి విద్యార్థి కావటం అదృష్టంగా భావిస్తున్నానని, తాను చదివిన పాఠశాలకు 50 ఏళ్ల తర్వాత రావటం, తనతో పాటు చదువుకున్న వారిని కలుసుకోవటం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల మొదటి ప్రిన్సిపాల్ మాథ్యూను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సుపీరియర్ జనరల్ జాన్ కలార్కల్, అసిస్టెంట్ జనరల్ ప్రతాపరెడ్డి, కరస్పాండెంట్ మౌంట్‌ఫోర్ట్, ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, పూర్వ ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎం మొదటి ప్రిన్సిపాల్ మాథ్యూను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వీఎంసీలో సెమీ క్రిస్మస్ వేడుకలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్ట్రీయల్ అండ్ అల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అసోసియేషన్ హాల్ వద్ద గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ హాజరై కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. దాతల సహాయంతో పారిశుద్ధ కార్మికులకు చీరలు, కార్పొరేషన్ సిబ్బందికి నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేశారు. కొవ్వొత్తులు వెలిగించారు. వీఎంసీ మేనేజర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ శర్మ, అసోసియేషన్ ప్రెసిడెంట్ ధార రాంబాబు, సెక్రటరీ చలం తదితరులు పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుణదల(విజయవాడతూర్పు): సంక్షేమంతో పాటు మౌలికాభివృద్ధిలో సైతం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. భారతీనగర్ 5వ రోడ్డులోని కడియాల శివరామకృష్ణయ్య పార్క్ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల ఏర్పాటు దాదాపుగా పూర్తయ్యిందన్నారు. రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. 4వ డివిజన్ పరిధిలోని భారతీ నగర్ 5వ రోడ్డులో ఉన్న ఈ పార్కును 20 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. త్వరితగతిన పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, నాల్గవ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసిన అవినాష్, భవకుమార్

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లాలో కనీసం 85 శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విజయవాడ, డీఆర్ఎం బంగ్లా సమీపంలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డు వద్ద గురువారం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ ఢిల్లీరావు నేతృత్వంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కింద ఓటరు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, వాకర్స్ తదితరులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) 2011లో స్వీప్‌ను ప్రారంభించిందన్నారు. స్వీప్ చేపట్టిన అవగాహన కార్యక్రమాల ఫలితంగా ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు. 2019లో జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సగటు పోలింగ్ శాతం 85 నమోదైందన్నారు. విజయవాడ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో 66 శాతం మాత్రమే నమోదైందని, నగరంలోనూ పోలింగ్ శాతం 85 శాతానికి చేర్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు నమోదు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటు మార్పు, ఈవీఎంతో ఓటు హక్కు వినియోగించుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, కలెక్టరేట్, వీఎంసీ అధికారులు, సిబ్బంది, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తాడేపల్లి మండలం కొలనుకొండలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో మొట్టమొదటి సారి అత్యంత వైభవోపేతంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ క్షేత్రం నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా భగవంతుని నివాసమైన వైకుంఠం ద్వారాలు తెరవబడతాయని పేర్కొన్నారు. నమ్మాళ్వార్, శ్రీ వైష్ణవ సంప్రదాయంలో లక్ష్మీ దేవి నుంచి వచ్చిన గురు–శిష్య పరంపరలో ఒక గొప్ప భక్తుడు, ఈ రోజున భగవంతుని వద్దకు తిరిగి వెళ్లాడని, ఆ సంఘటనను గుర్తు చేసుకోవడానికి అన్ని విష్ణు దేవాలయాల్లో ఆ రోజున సంవత్సరానికి ఒకసారి ప్రత్యేకించి వైకుంఠ ఉత్తర ద్వారం తెరవబడుతుందని తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం, స్వామివారికి లక్ష అర్చన, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

వస్తున్నాయ్.. సత్యదేవుని కొత్త రథాలు

- టేకుతో రెండు రథాల తయారీ
- రూ.34 లక్షలతో చిన్న రథం తయారీ పూర్తి
- దాతల సహకారంతో వెండి రేకు తాపడం
- రూ.1.08 కోట్లతో చురుకుగా పెద్ద రథం నిర్మాణం
- మూడు నెలల్లో సిద్ధం



పెద్ద రథం పీఠం నిర్మాణ పనుల్లో నిమగ్నమైన శిల్పులు

అన్నవరం: రత్నగిరి వాసుడైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతిదేవి కోసం కొత్త రథాలు సిద్ధమవుతున్నాయి. రూ.1.42 కోట్ల వ్యయంతో నాణ్యమైన బస్తరు టేకుతో ఈ రెండు రథాలను అన్నవరం దేవస్థానం తయారు చేయిస్తోంది. వీటిలో రూ.34 లక్షలతో నిర్మించిన చిన్నరథం స్వామి, అమ్మవార్ల ఊరేగింపునకు సిద్ధమైంది. దీనికి వెండి రేకు తాపడం చేసేందుకు దాతల కోసం దేవస్థానం అన్వేషిస్తోంది. మరోవైపు రూ.1.08 కోట్లతో నిర్మిస్తున్న పెద్ద రథం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరో మూడు నెలల్లో ఈ రథం కూడా సిద్ధమవుతుందని చెబుతున్నారు.

చురుగ్గా పెద్ద రథం పనులు

- రూ.1.08 కోట్లతో పెద్ద రథం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- దీని ఎత్తు 33.9 అడుగులు, వెడల్పు 14 అడుగులు, పొడవు 23.5 అడుగులు.
- ఈ రథంపై వివిధ లతలు, దేవతామూర్తుల చిత్రాలు, వివిధ డిజైన్లు చెక్కుతున్నారు.
- పెద్ద రథం పీఠం నిర్మాణ పనుల్లో శిల్పులు నిమగ్నమయ్యారు. పెద్ద రథానికి సంబంధించి స్తంభాలు సైతం చెక్కుతున్నారు.

సిద్ధమైన చిన్న రథం



నిర్మాణం పూర్తి చేసుకున్న నూతన చిన్న టేకు రథం

- చిన్న రథం నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఈ రథం ఎత్తు 14 అడుగులు, వెడల్పు 6.3 అడుగులు, పొడవు 7.5 అడుగులు ఉంది. నాలుగు స్తంభాలపై శిఖరం వస్తుంది. నాలుగు చక్రాల మీద అందమైన లతలు చెక్కారు.
- రథం మీద దేవతామూర్తుల చిత్రాలతో పాటు పలు ఆకర్షణీయమైన డిజైన్లు చిత్రీకరించనున్నారు. ముందు భాగంలో రెండు గుర్రాలను అమర్చారు.
- దీనిని టేకుతో తయారు చేయడానికి రూ.34 లక్షలు అవుతుండగా.. వెండి రేకు తాపడానికి సుమారు 300 కిలోల వెండి అవసరం కానుంది. దాతల సహకారంతో వెండి తాపడం చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

రెండు రథాలున్నా..

- సత్యదేవునికి ఇప్పటికే రెండు రథాలున్నాయి. వీటిలో ఒకటి వెండి రథం కాగా.. మరొకటి వైశాఖ మాసంలో జరిగే వార్షిక కల్యాణ మహోత్సవాల్లో మూడో రోజు స్వామి, అమ్మవార్లను ఊరేగించే రావణ బ్రహ్మ వాహనం. వెండి రథం శిథిలావస్థకు చేరింది.
- కొత్త రథం తయారు చేయించాలన్న ప్రతిపాదన పదేళ్లుగా ఉన్నా వివిధ కారణాలతో అధికారులు సాహసించలేదు.
- వెండి, బంగారం పనులు చేయించేటప్పుడు పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని వెనుకంజ వేశారు.అయితే.. గత ఈవో చంద్రశేఖర్ ఆజాద్ నూతన రథం తయారీకి ఉపక్రమించారు.
- వెండి రథంతోపాటు స్వామి, అమ్మవార్లను కొండ దిగువన ఊరేగించేందుకు పెద్ద రథం కూడా తయారు చేయాలని నిర్ణయించారు.
- పాలకవర్గం ఆమోదంతో వీటి తయారీకు గత ఈవో ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆగస్ట్ నెలలో టెండర్లు పిలిచారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లకు చెందిన శ్రీమాణిక్యాంబ శిల్పకళ వుడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్ ఈ పనులను దక్కించుకున్నారు.



ప్రస్తుత వెండి రథంలో సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు

చిన్న రథం నిర్మాణం బాగుంది

చిన్న రథం నిర్మాణం పూర్తయింది. చాలా బాగుంది. ఈవో కె.రామచంద్ర మోహన్ దీనిని పరిశీలించిన అనంతరం ట్రయల్ రన్ వేస్తాం. అనంతరం దీనిని స్వామివారి సేవలో ఎప్పుడు ఉపయోగించాలో ఈవో పండితులు, నిర్ణయిస్తారు.

– ఉదయ్ కుమార్, డీఈ, అన్నవరం దేవస్థానం

అంగన్‌వాడీ టీచర్‌కు 'దిశ' రక్షణ

రంగంపేట: తూర్పు గోదావరి జిల్లా రంగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జి.దొంతమూరు గ్రామంలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్‌కు 'దిశ' యాప్ రక్షణ కల్పించింది. జి.దొంతమూరులో ఆమెను గురువారం ఓ వ్యక్తి వేధించాడు. దీంతో బాధితురాలు దిశ యాప్‌కు కాల్ చేసి సహాయం కోరారు. కేవలం 8 నిమిషాల వ్యవధిలోనే ఆ గ్రామానికి దిశ పోలీసులు చేరుకున్నారు. బాధిత అంగన్‌వాడీ టీచర్ ఇచ్చిన వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం విచారణ చేపట్టి స్థానికంగా నివాసం ఉంటున్న వెంకటకృష్ణ అనే వ్యక్తి అంగన్‌వాడీ టీచర్‌ను వేధించినట్లు గుర్తించి అరెస్టు చేశారు.

- నీటి ట్యాంకులో పడి ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందిన విషాద ఘటన తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో గురువారం జరిగింది. ఈ ఘటనలో గట్టిం వినీత (4), కమ్మిల జస్వంత్ (4) మృత్యువాత పడ్డారు. గ్రామానికి చెందిన గట్టిం శ్రీనివాస్, దేవి దంపతులు, కమ్మిల రాము, గణేశ్వరి దంపతులు పక్కపక్క ఇళ్లల్లో నివసిస్తున్నారు.

ఎస్ఐ అభ్యర్థులపై హైకోర్టు ఆగ్రహం

- అఫిడవిట్లను ఉపసంహరించుకోవాలని ఆదేశం
- తిరిగి అఫిడవిట్లు దాఖలు చేసేందుకు అనుమతి



సాక్షి, అమరావతి: బేషరతుగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్లు వేయాలన్న తమ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎస్ఐ అభ్యర్థులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అఫిడవిట్‌లో కేసు పూర్వాపరాలను ప్రస్తావించడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. తమ ఆదేశాలకు విరుద్ధంగా దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఉపసంహరించుకోవాల్సిందేనని తేల్చి చెప్పింది. లేని పక్షంలో కోర్టు ధిక్కార చర్యలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసింది. దిగొచ్చిన ఎస్ఐ అభ్యర్థుల తరఫు న్యాయవాది ప్రస్తుత అఫిడవిట్లను ఉపసంహరించుకుని, తిరిగి అఫిడవిట్లు దాఖలు చేస్తామని తెలిపారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఐ నియామక ప్రక్రియకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల్లో భాగమైన ఎత్తు, ఛాతి చుట్టు కొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా కొలిచిన అధికారులు అందులో తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొళ్ల దుర్గాప్రసాద్ మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి ఎస్ఐ నియామకాల కోసం నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన ఫలితాలను వెల్లడించవద్దంటూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు నియామక బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ నరేంద్ర ధర్మాసనం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుపై చేసిన ఆరోపణలు అవాస్తమని తేలితే రూ.లక్ష జరిమానా విధిస్తామని, అందుకు సిద్ధమైన అభ్యర్థులే ఎత్తు పరీక్షకు హాజరు కావాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పిటిషన్ దాఖలు చేసిన 24 మందిలో 19 మంది తాము పరీక్షకు హాజరవుతున్నామని, రూ.లక్ష జరిమానా చెల్లించేందుకు సిద్ధమంటూ లిఖితపూర్వకంగా కోర్టుకు వివరించారు. దీంతో హైకోర్టు స్వయంగా ఎత్తు పరీక్ష నిర్వహించింది. పోలీసుల కొలతలతో తాజా కొలతలు సరిపోవడంపై ఆ 19 మంది అభ్యర్థులపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.లక్ష జరిమానా చెల్లించాల్సిందేనంది. అంత స్థోమత తమకు లేదని, తాము పేదలే కాక నిరుద్యోగులం కూడానని వారు తెలిపారు. దీంతో ధర్మాసనం జరిమానా స్థానంలో సామాజిక సేవ శిక్ష విధిస్తామని తెలిపింది. చేసిన తప్పుకు బేషరతుగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్లు వేయాలని వారిని ఆదేశించింది. తాజాగా గురువారం ఈ అప్పీల్ విచారణకు రాగా, అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను పరిశీలించిన ధర్మాసనం వాటిపై తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసింది.

రేపటి నుంచి నంది నాటకోత్సవాలు

- 29 వరకు గుంటూరు విజ్ఞాన మందిరంలో నిర్వహణ
- విజయవంతం చేయాలి: పోసాని కృష్ణమురళి



వేదికను పరిశీలించిన పోసాని, విజయకుమార్‌రెడ్డి తదితరులు

పాత గుంటూరు: నంది నాటకోత్సవాలను శనివారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి అధికారులను కోరారు. నంది నాటకోత్సవాలు నిర్వహించనున్న విజ్ఞాన మందిరం, కళాకారులకు వసతి ఏర్పాటు చేయనున్న నాగార్జున గ్రాండ్ హోటల్‌ను గురువారం పోసాని కృష్ణమురళి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డితో కలసి పరిశీలించారు. విజ్ఞాన మందిరంలో వేదిక, సిట్టింగ్ గ్యాలరీలు, ఆవరణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విజ్ఞాన మందిర భవనంపై ఏర్పాటు చేసిన బెలూన్‌ను పరిశీలించారు. బయట ఖాళీ స్థలంలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నాగార్జున గ్రాండ్‌లో ఏసీ గదులను పరిశీలించి, కళాకారులకు బస, భోజన, ప్రయాణ వసతుల్లో ఎలాంటి రిమార్కులు లేకుండా చేపట్టాలని కోరారు. ఎఫ్‌డీసీ జనరల్ మేనేజరు శేషసాయి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విజేత' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సజ్జల

తెనాలి: సీఎం వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో 2009–19 వరకు జరిగిన పరిణామాలపై తెనాలికి చెందిన న్యాయవాది గుంటూరు కృష్ణ రూపొందించిన 'విజేత'..లక్ష్యసాధకులకు స్ఫూర్తి ప్రదాత...అనే పుస్తకాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి గురువారం ఆవిష్కరించారు. తొలి కాపీని రాష్ట్ర మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జునకు అందజేశారు. సీఎం జగన్ జన్మదినం సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. వైఎస్సార్ ఆకస్మిక మరణం తర్వాత నాటి ప్రధాన రాజకీయపార్టీలు ఏకమై వైఎస్ జగన్‌ను రాజకీయంగా అడ్డుకోవటానికి చేసిన కుట్రలు, అవమానాలు, ఓటమిపై ఎలా పోరాటం చేసి గెలిచారు అనే అంశాలను పుస్తకంలో పొందుపరిచినట్లు రచయిత కృష్ణ చెప్పారు.

ఛీ.. నీ బతుకు చెడ..!

- జనసేన పుట్టింది లోకేశ్ కోసమా!
- యువగళం ముగింపు సభ ఓ ఫ్లాప్ షో
- మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: 'ఛీ.. నీ బతుకు చెడ. జనసేన పుట్టింది లోకేశ్ కోసమా!..' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ఆయన గురువారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. లోకేశ్ పాదయాత్ర ముగింపు సభకు టీడీపీ, జనసేన చాలా ఆర్భాటం చేశాయన్నారు. ఈ కార్యక్రమానికి 6 లక్షల మందికి పైగా హాజరవుతారంటూ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. బస్సులు, రైళ్లలో కూడా ప్రజలను తరలించారని, ఎంత చేసినా జనం లేక బహిరంగ సభ తుస్సుమందని, అదో ఫ్లాప్ షో అని చెప్పారు. టీడీపీ, జనసేన కలయికలో చంద్రబాబు, పవన్ ఒకే వేదికపై ఉండి నిర్వహించిన బహిరంగ సభ అని చెప్పుకున్నారని, అసలు, వారిద్దరూ ఎప్పుడు విడిపోయారని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ 2014 ఎన్నికల్లోనే కలిసి పోటీ చేశారన్నారు. చంద్రబాబుతోనే పవన్ అంట కాగారని, చంద్రబాబు చేత పరిపాలన చేయించాడని అన్నారు. ఇద్దరూ కలిసి ఐదేళ్లు అధికారం వెలగబెట్టి ఈ రాష్ట్ర ప్రజలకు ఏమి చేయగలిగారని నిలదీశారు.

పవన్ అజ్ఞానం కనిపించింది

జగన్ పాదయాత్ర గురించి పవన్‌కు ఏమి తెలుసని ఆ యాత్రపై వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. జగన్ పాదయాత్రలో తనకు మద్దతుగా ఎదురొచ్చిన వృద్ధులను ఆప్యాయంగా పలకరించి, గుండెలకు హత్తుకొని గౌరవంగా తల మీద ముద్దు పెడితే.. దాన్ని అపహాస్యం చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేశ్ చేసింది గొప్ప పాదయాత్ర అన్న పవన్ ఎంత అజ్ఞానంలో ఉన్నాడో అందరికీ తెలిసిపోయిందని అన్నారు. చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, పవన్ కలిసి ఒకే వేదిక పైకి వచ్చారంటే, సీఎం జగన్‌ను చూసి ఎంతగా భయపడుతున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలను కోరారు. వారంతా ఏకమై ఎంత గింజుకున్నా సీఎం వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరని, 2024లో మరోసారి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని మంత్రి రాంబాబు స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

30న విశాఖలో 'ఏపీఈఆర్సీ' బహిరంగ విచారణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) విశాఖలో నూతనంగా ప్రారంభించిన క్యాంపు కార్యాలయంలో ఈనెల 30న బహిరంగ విచారణ చేపట్టనుంది. ఏపీఈపీడీసీఎల్, పలు ప్రైవేటు విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన పిటీషన్లపై ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఎస్ఎల్డీసీ, ఏపీ ట్రాన్స్కోలతో ఉదయం 11 గంటలకు విచారణ నిర్వహించనుంది. ఈ మేరకు ఏపీఈఆర్సీ తన అధికారిక వెబ్సైట్లో తాజాగా షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

దళిత నేతలపై కేసులు ఎత్తివేత హర్షణీయం

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకరావు

సాక్షి, అమరావతి: మాల, మాదిగలపై గతంలో నమోదైన కేసులను ఎత్తివేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి తన పుట్టిన రోజు కానుకగా ఇచ్చారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు మాదిగ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితుల పట్ల పెద్ద మనసు చాటుకున్న సీఎం వైఎస్ జగన్కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో కురుక్షేత్రం సభ సందర్భంగా మాదిగలపైన, గరగపర్రులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు సందర్భంగా దళిత సంఘాల నేతలపైన అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. టీడీపీ హయాంలో కాపులు, ముస్లింలతోపాటు అనేక కులాల నేతలపై దారుణంగా కేసులు పెట్టి వేధించారన్నారు. చంద్రబాబు అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తే.. సీఎం జగన్ అక్కున చేర్చుకుని అండగా నిలిచారని వివరించారు.

ఎస్సీలకు జగన్ వెన్నుపోటు అనేది అవాస్తవం

- ఏపీ సచివాలయ సంఘం అధ్యక్షుడు కాకర్ల



సాక్షి, అమరావతి: 'ఎస్సీలకు జగన్ వెన్నుపోటు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి రాసిన కథనం చాలా నీచ నికృష్టమైందని, ఇందులో వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం మీద అక్కసుతో ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టి.. ఒక వర్గం మీదకి ఇంకో వర్గాన్ని ఉసిగొల్పేలా దుర్మార్గపు రాతలు రాయడం హేయమైన చర్యని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో 2022–23 సంవత్సరానికి సంబంధించిన పోస్టుల్లో ఎస్సీ, వికలాంగుల కోటాకు సంబంధించిన ఎనిమిది వేకెన్సీలను వారికి కేటాయించకుండా జనరల్ అభ్యర్థులకు ప్రమోషన్లు ఇస్తున్నట్లు రాసిన వార్త పూర్తిగా అవాస్తవమని తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించిన ఎస్సీ, వికలాంగుల కోటాకు సంబంధించిన ఎనిమిది వేకెన్సీలను అలాగే ఉంచారని, వాటిలో ఒక్క వేకెన్సీని కూడా జనరల్ అభ్యర్థులకు కేటాయించలేదని వెల్లడించారు. డీపీసీ నిర్వహించడం ఆలస్యం అవుతున్నందున 2023, ఆగస్టు 31 తర్వాత వచ్చిన వేకెన్సీలను 2022–23 ప్యానెల్ సంవత్సరంలో మిగిలిపోయిన అభ్యర్థులకు ప్రమోషన్ ఇవ్వడానికి ముఖ్యమంత్రి అనుమతించారని, ఇది రెగ్యులర్గా జరుగుతున్న ప్రక్రియ అని తెలిపారు. పది రోజుల కిందట ఇదే రీతిన పైస్థాయిలో ముగ్గురికి ప్రమోషన్లు ఇచ్చారని, వారిలో ఒక ఎస్సీ అభ్యర్థి అడిషనల్ సెక్రటరీ ప్రమోషన్ పొందినట్టు తెలిపారు. తప్పుడు వార్త రాసినందుకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం క్షమాపణలు చెప్పి దానికి వివరణ మొదటి పేజీలో ప్రచురించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు వస్తే ఏపీకి దరిద్రమే: కేఏ పాల్

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ నేత చంద్రబాబు మరోసారి ఏపీకి సీఎం కావాలని పగటికలలు కంటున్నారని.. అదే జరిగితే రాష్ట్రానికి దరిద్రమేనని, రూ.లక్షల కోట్ల అవినీతి జరుగుతుందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. యువగళం ముగింపు సభకు డబ్బులిచ్చి మనుషుల్ని రప్పించుకున్నారని, స్వచ్ఛందంగా వంద మంది కూడా రాలేదని ఎద్దేవా చేశారు. గురువారం ఢిల్లీలోని ఆంధ్ర భవన్లో కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ జన్మదినం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నిరుద్యోగులు, రైతులు, మహిళలు.. ఇలా అందరినీ చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు బస్సులో ఫ్రీ ప్రయాణమంటూ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

సరిహద్దులో పోలీసుల అప్రమత్తం

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం భారత్ బంద్కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. చింతూరు మండలం వీరాపురం, చిడుమూరు మధ్య బుధవారం రాత్రి రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్న మల్లికార్జునరావు కారును, ఛత్తీస్గఢ్లోని ఆసిరిగూడ వద్ద గన్నవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుతోపాటు రెండు లారీలను మావోయిస్టులు దహనం చేసిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. వాహన తనిఖీలు చేస్తూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్గఢ్, ఒడిశాకు రాత్రిపూట వాహనాలను నిలిపి వేస్తున్నట్లు చింతూరు ఓఎస్డీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

అంగన్వాడీలకు అడిగినవన్నీ..

వారికి అసలైన మేలు జరిగింది సీఎం జగన్ పాలనలోనే..

సాక్షి, అమరావతి : బడుగు బలహీనవర్గాలకు మేలుచేసే అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, వాటిలో సేవలందిస్తున్న వర్కర్లు, ఆయాలపట్ల వైఎస్సార్సీపీ ప్రభుత్వం తొలి నుంచీ సానుకూల వైఖరితోనే వ్యవహరిస్తోంది. ఆ కేంద్రాలను ఆధునీకరించడంతోపాటు అంగన్వాడీలకు మెరుగైన జీతాలిచ్చింది కూడా సీఎం జగన్ ప్రభుత్వమే. చంద్రబాబు జమానాకంటే సీఎం జగన్ పాలనలోనే వీరి వేతనాలు పెరిగాయి. ఎలాగంటే.. 2014 నుంచి 2016 వరకు ఈ వర్కర్లకు కేవలం రూ.4,200 మాత్రమే గౌరవ వేతనం ఇచ్చిన చంద్రబాబు 2016లో కంటితుడుపు చర్యగా రూ.ఏడు వేలకు పెంచారు. అప్పటి నుంచి రెండేళ్ల మూడు నెలలపాటు అదే అరకొర జీతంతో సరిపెట్టారు. 2018లో తన సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా అంగన్వాడీలకు గౌరవ వేతనం పెంచుతానని ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్ ప్రకటించడంతో అప్పుడుగానీ చంద్రబాబుకు వారి జీతాలు గుర్తురాలేదు. దీంతో ఎన్నికలకు ఆర్నెల్ల ముందు హడావుడిగా వేతనాలు పెంచినట్లు మోసపూర్తింగా జీవో ఇచ్చారు కానీ, అమలు చేయలేదు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ తెలంగాణా కంటే అధికంగా ఇస్తామన్న మాట నిలబెట్టుకుంటూ వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలు చొప్పున పెంచి అందిస్తున్నారు. టీడీపీ హయాంలో అరకొర జీతాలతో అవస్థలుపడిన అంగన్వాడీలకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఇలా వేతనాలు పెంచి నాలుగున్నరేళ్లుగా ఆ మొత్తాన్ని అందిస్తోంది.

నీతిఆయోగ్ ప్రశంసలు..

గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వంలోనే అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సగటు వేతనం భారీగా పెరిగింది. అంతేకాదు.. అంగన్వాడీల నిర్వహణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ టాప్ అని నీతిఆయోగ్ ప్రశంసించింది. అంగన్వాడీ వర్కర్లకు అత్యధిక వేతనాలిస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఏపీ ఆరవ స్థానంలోను, హెల్పర్ల వేతనాల్లో నాల్గవ స్థానంలో ఉండటం విశేషం. ఒక్క మాటలో చెప్పాలంటే.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోనే అంగన్వాడీలకు అసలైన మేలు జరిగింది.

అత్యాధునికంగా అంగన్వాడీ కేంద్రాలు..

అంగన్వాడీ కేంద్రాల ఆధునీకరణకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టింది.

- ▲ నాడు–నేడు ద్వారా అత్యాధునికంగా తీర్చిదిద్దుతోంది. వీటికి అవసరమైన వస్తువులు, స్టేషనరీకి 48,770 మెయిన్ కేంద్రాలకు రూ.500 చొప్పున.., 6,837 మినీ కేంద్రాలకు రూ.250 చొప్పున మొత్తం 55,607 కేంద్రాలకు రూ.7.81కోట్లు మంజూరు చేసింది.
- ▲ సొంత భవనాల నిర్వహణ, చిన్నపాటి మరమ్మతులకు 21,206 కేంద్రాలకు (ఒక్కొక్క దానికి రూ.3వేలు చొప్పున) మొత్తం రూ.6.36 కోట్లు విడుదల చేసింది.
- ▲ అద్దె భవనాల్లో ఉన్న గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని 16,575, పట్టణాల్లోని 6,705 అంగన్వాడీ కేంద్రాలకు రూ.66.54 కోట్ల అద్దె బకాయిలు చెల్లించింది.
- ▲ అవకాశం ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తోంది.

అంగన్వాడీల మేలు కోరిన ప్రభుత్వం..

వేతనాల పెంపే కాదు.. అంగన్వాడీలు అడిగిన డిమాండ్లను సైతం సీఎం వైఎస్ జగన్ పెద్ద మనస్సుతో ఆమోదించి అమలుచేస్తున్నారు. అంగన్వాడీల మేలు కోరి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా (ఈ నెల 20న) మరికొన్ని ఉత్తర్వులు జారీచేసింది. అవేమిటంటే..

- ▲ అంగన్వాడీ సహాయకులను కార్యకర్తలుగా నియమించేందుకు వయో పరిమితిని 45 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలకు పెంచుతూ జీఓ ఎంఎస్–44 జారీచేసింది.
- ▲ సెక్టార్, యూనిట్ సమావేశాలకు హాజరయ్యేందుకు టీఏ, డీఏలు ఇవ్వాలన్న అంగన్వాడీల కోరికపై సానుకూలంగా స్పందించి మెమో నెంబర్.2303564/2023 జారీచేసింది.
- ▲ అంగన్వాడీ వర్కర్లకు నెలకు ఒకసారి, హెల్పర్లకు రెండు నెలలకు ఒకసారి టీఏ, డీఏలు చెల్లించాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.
- ▲ వీటితోపాటు అంగన్వాడీ వర్కర్లు, సహాయకుల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది.
- ▲ అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్ల సర్వీసు విరమణ తర్వాత వన్టైం బెనిఫిట్ రూ.50 వేలను రూ.1 లక్షకు పెంచింది.
- ▲ సహాయకుల సర్వీసు విరమణ తర్వాత వన్టైం బెనిఫిట్ రూ.20వేల నుంచి రూ.40 వేలకు పెంచింది. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు ప్రతి ఒక్కరికీ యూనిఫారం (ఆరు చీరలు చొప్పున) అందించేందుకు రూ.16 కోట్లను ఖర్చుచేసింది. వారి విధులు సజావుగా నిర్వహించడానికి, మంచి సేవలు అందించడానికి ఈ ప్రభుత్వం రూ.85.47 కోట్లతో 56,984 స్మార్ట్ఫోన్లు కొని, అందించింది. డేటా ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తూ అదనంగా ఏడాదికి రూ.12కోట్లు చెల్లిస్తోంది.
- ▲ ఈ ఏడాది నుంచి వర్కర్లు, హెల్పర్లకు జీవిత బీమా వర్తింపజేస్తోంది. ప్రమాద బీమాగా రూ.2 లక్షల వరకూ చెల్లిస్తోంది.
- ▲ అంగన్వాడీల ద్వారా నాణ్యమైన సరుకుల పంపిణీని పర్యవేక్షించేందుకు దాదాపు 500 మంది సూపర్వైజర్లను కూడా నియమించింది.
- ▲ గర్భవతులు, బాలింతలు, పిల్లలకు గతంలోలా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్హోం రేషన్ పద్ధతిని అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పని భారం తగ్గింది. 2023 నుంచి డ్రై రేషన్ అందిస్తోంది.
- ▲ మంచి పనితీరు కనబర్చిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 ఇస్తోంది. ఇలా ఏడాదికి సుమారు రూ.27.8 కోట్లు ప్రోత్సాహకాలుగా చెల్లిస్తోంది.



అంగన్వాడీ వర్కర్ల పోస్టుల కోసం హెల్పర్లకు వయోపరిమితి 45 నుంచి 50ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 44



GOVERNMENT OF ANDHRA PRADESH
DEPT. FOR WOMEN, CHILDREN, DIFFERENTLY ABLED & SENIOR CITIZENS

యూనిట్, సెక్టార్ మీటింగులకు వెళ్లే అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు టీఏ,డీఏ చెల్లించేలా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

అంగన్వాడీల వేతనాలు ఎప్పుడెప్పుడు ఎలా పెరిగాయంటే.. (రూపాయల్లో)

ఎవరికి	2-4-2014	1-4-2016	1-7-2018	1-7-2019
వర్కర్లు	4,200	7,000	10,500	11,500
మినీ వర్కర్లు	2,950	4,500	6,000	7,000
హెల్పర్లు	2,200	4,500	6,000	7,000

రాష్ట్ర విభజన తర్వాత తొలిసారి పదోన్నతులు..

ఇక అంగన్వాడీలకు 2013 నుంచి పదోన్నతులు ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వంలో దీన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వైఎస్సార్సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చింది. మరోవైపు.. 560 గ్రేడ్–2 సూపర్వైజర్ పోస్టులను భర్తీచేసింది. ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసే వారి వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. తొమ్మిదేళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ వయో పరిమితి పెంపు చాలా ఉపయోగపడింది. ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి రూ.1,313 కోట్లు అందించింది. ఇక నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలుచేసిన జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతుభరోసా, జగనన్న వసతి దీవెన, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను వారికి కూడా వర్తింపజేయడం గమనార్హం.

బాలింతలు, గర్భిణీలను ఇబ్బంది పెట్టకుండా సమ్మె విరమించాలి

- అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది
- సమ్మె విరమించి విధుల్లో చేరితే మరింత మేలుచేస్తాం
- రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్



సాక్షి, అమరావతి :అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల డిమాండ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని.. బాలింతలు, గర్భిణీలకు ఇక ఏమాత్రం ఇబ్బంది కల్గించకుండా వెంటనే నిరసనను విరమించి విధుల్లో చేరాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ విజ్ఞప్తిచేశారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, సంచాలకులు విజయకృష్ణన్తో కలిసి మంత్రి గురువారం మీడియాతో మాట్లాడారు. 'పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నెరవేర్చారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల డిమాండ్లను సాధ్యమైనంత వరకు పరిష్కరించారు. తెలంగాణాలో అంగన్వాడీ వర్కర్లకు రూ.10,500 వేతనం ఉంటే ఏపీలో రూ.11,500కు పెంచుతూ 2019లో సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారు. ఇక అంగన్వాడీ అక్కచెల్లెమ్మలకు మరింత మేలుచేసే విషయంలో సీఎం జగన్ పెద్ద మనసుతో ఆలోచిస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు ఉత్తర్వులను జారీచేసింది. రూ.85 కోట్లతో మొబైల్ ఫోన్లను కూడా ప్రభుత్వం సమకూర్చింది. మొబైల్ ఫోన్ల డేటా చార్జీలను ప్రభుత్వమే భరించింది. దాదాపు 500 మంది సూపర్వైజర్లను కూడా ప్రభుత్వం నియమించింది. అర్హతను బట్టి అంగన్వాడీ వర్కర్లకు, సహాయకులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నాం. అంగన్వాడీల గౌరవ వేతనం పెంచాలని నిరసన తెలపడానికి ఇది సరైన సమయం కాదు. పరిస్థితిని అర్థంచేసుకుని సమ్మె విరమించి విధుల్లో చేరితే వారికి మరింత మేలు చేసేందుకు చర్యలు చేపడతాం. ఇక అంగన్వాడీ కేంద్రాల తాళాలను ఎవరూ పగులకొట్టలేదు. బాలింతలకు, గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకే ఆయా జిల్లా కలెక్టర్లు అంగన్వాడీ కేంద్రాలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.' అని మంత్రి ఉషశ్రీ చరణ్ చెప్పారు.

సీఎం జగన్ 2009లోనే యుద్ధభేరి మోగించారు

- చంద్రబాబు, లోకేశ్, పవన్ అడుగు ఊడిన బక్కెట్లాంటి వాళ్లు
- వాళ్లు నిన్న చేసింది పిల్లి మెడలో గంట కట్టే ప్రయత్నమే
- యువగళం ముగింపు సభపై ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం



గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2009 సెప్టెంబరు 2వ తేదీనే యుద్ధభేరి మోగించారని, విజయాల పరంపర కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. యువగళం ముగింపు సభలో చంద్రబాబు, పవన్, లోకేశ్ వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. యుద్ధం ప్రకటించామని, విజయం తథ్యమంటూ లోకేశ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని అన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్లు అడుగు ఊడిన బక్కెట్లాంటి వాళ్లని చెప్పారు. బక్కెట్గాళ్లంతా నిన్న చేసింది పిల్లి మెడలో గంట కట్టే ప్రయత్నమేనని అన్నారు. 12 ఏళ్ల క్రితం యుద్ధభేరి మోగించిన సీఎం జగన్ కాంగ్రెస్ అధినేత సోనియాను కూకటివేళ్లతో పెకిలించారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేశారని తెలిపారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును భూస్థాపితం చేసి, పవన్ను పోటీ చేసిన రెండుచోట్లా గెలవకుండా చేసి సత్తా చూపిన నాయకుడు సీఎం జగన్ అని చెప్పారు. పప్పు సుద్ద లోకేశ్కు మంగళగిరిలో రాజకీయ సమాధి కట్టారన్నారు. బాబు, లోకేశ్, పవన్ ఇప్పుడు గంటలు మోగిస్తున్నా, యుద్ధభేరి మొదలెట్టినా.. జగన్ జైత్రయాత్రల పరంపరను ఆపలేరని స్పష్టంచేశారు. ఎమ్మెల్యేలకు ట్రాన్స్ఫర్లు ఉంటాయా అని చంద్రబాబు అనడం విచిత్రంగా ఉందన్నారు. 30 ఏళ్ల క్రితమే చంద్రబాబు చంద్రగిరి నుంచి కుప్పం ట్రాన్స్ఫర్ అయ్యాడని, వయస్సు పైబడినందున ఆయనా విషయం మర్చిపోయారని అన్నారు. చంద్రగిరి నుంచి కుప్పంకు 110 కిలో మీటర్లని, అక్కడికి ట్రాన్స్ఫర్ అవ్వడానికి చంద్రబాబేమైనా ఆఫీసరా అని వ్యాఖ్యానించారు. చంద్రబాబో పెద్ద నటుడని, 420 అని గతంలో ఎన్టీఆరే చెప్పారన్నారు. లోకేశ్ పుట్టింది మంగళగిరిలోనా? అయినా అక్కడ ఎందుకు పోటీ చేశాడని ప్రశ్నించారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ భీమవరం, గాజువాకలో గోళీలు ఆడుకున్నాడా? అక్కడ పోటీ చేసి చిత్తుగా ఓడిపోయాడు అని అన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ ముగ్గురూ వలస పక్షులేనని, వారు ముగ్గురూ కలిసి వచ్చినా విడివిడిగా వచ్చినా బొక్కబోర్లాపడక తప్పదని, రాబోయే ఎన్నికల్లోనూ సీఎం జగన్ మరోసారి ఘన విజయం సాధించి వీరికి చరిత్ర లేకుండా చేస్తారని తెలిపారు. వీళ్ల ముగ్గురూ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి చిటికెన వేలు కూడా కదపలేరని స్పష్టం చేశారు.

అంగన్వాడీలూ.. రాజకీయ ఉచ్చులో పడొద్దు

- 11 డిమాండ్లలో పదింటి అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- జీతాల పెంపు విషయంపై మాత్రమే మూడు నెలలు సమయం కోరాం
- కొన్ని అంశాలపై స్పష్టత కోరుతూ కేంద్రానికి లేఖ రాశాం
- గర్భవతులు, బాలింతలు, పిల్లలకు ఇబ్బందులు కలగకూడదు
- మానవతా దృక్పథంతో స్పందించి తక్షణమే విధుల్లో చేరాలి
- సీఎం జగన్ మహిళా పక్షపాతి.. అన్నింటిపై సానుకూలంగా ఉన్నారు
- మీడియాతో మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖ సిటీ : 'అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రాజకీయ పక్షాల ఉచ్చులో పడొద్దు. 11 డిమాండ్లలో పదింటిని వెంటనే అమలుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేవలం జీతం పెంపు విషయంపై మాత్రమే మూడునెలలు సమయం కోరాం. ఆ తరువాత తప్పకుండా చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం. ఈలోపు గర్భవతులు, బాలింతలు, పిల్లలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే విధుల్లో చేరాలి..' అని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అంగన్వాడీలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడి ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 15న అంగన్వాడీ నేతలతో మంత్రుల బృందం, అధికారులతో జరిగిన చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన అంశాలను వివరించారు. ఆ సమయంలో అంగన్వాడీ నాయకులు 11 డిమాండ్లతో నోటీసు ఇచ్చారని, వాటన్నింటిపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఇప్పటికే పలు అంశాలపై ఉత్తర్వులు జారీచేశామని ఆయన వెల్లడించారు. అలాగే, అంగన్వాడీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమమని, ఇందులో కొన్ని విషయాలపై స్పష్టత కోసం కేంద్రానికి కూడా లేఖ రాశామని ఆయన చెప్పారు. అక్కడి నుంచి స్పందన వచ్చిన వెంటనే అధ్యయనం చేసి అక్క, చెల్లెమ్మలు కోరిన మాదిరిగానే నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇక తెలంగాణలో కంటే అధికంగా రాష్ట్రంలో అంగన్వాడీలకు జీతం పెంచుతామని చెప్పినట్లుగానే పెంచామని బొత్స గుర్తుచేశారు.

అక్కచెల్లెమ్మలకు సానుకూలంగా నిర్ణయం..

ఇక మంత్రుల బృందం చర్చలపై అంగన్వాడీ నేతలు సంతృప్తి వ్యక్తంచేస్తారని భావించినప్పటికీ.. బయటకు వెళ్లిన తరువాత కొన్ని పార్టీ జెండాలతో నిరసనలు తెలపడంపట్ల ఆశ్చర్యం కలిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి మహిళా పక్షపాతి అని, అక్కా, చెల్లెమ్మలకు న్యాయం జరిగేలా సానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని ఆయన స్పష్టంచేశారు.

చంద్రబాబు, లోకేశ్ కలలు కంటున్నారు..

యువగళం సభపై మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి బొత్స ఘాటుగా స్పందించారు. 'వీళ్ల ప్రభుత్వం వస్తుందట.. ఏదో చేస్తారట.. నిద్రలో కలలు కనండి' అంటూ చంద్రబాబు, లోకేశ్లకు చురకలంటించారు. టీడీపీ, జనసేన పొత్తుపై కూడా మంత్రి స్పందిస్తూ.. రాజకీయ అవసరాల కోసం ఎవరు కలుస్తారో.. ఎవరు విడిపోతారో మాకు అనవసరమని.. 2014లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశాయని, వాటిలో ఎన్ని అమలుచేశారో చంద్రబాబు చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. అప్పుడెందుకు చంద్రబాబు చొక్కాను పవన్ పట్టుకోలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ ఈ దొంగల ముఠా వస్తోందని, ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇక విశాఖను రాజధానిగా చేయడం ఒక యజ్ఞంగా భావిస్తున్నామని, రాక్షసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని మంత్రి బొత్స ప్రతిపక్షాలను ఉద్దేశించి విమర్శించారు. భోగాపురం ఎయిర్పోర్టు నిర్మాణానికి టీడీపీ హయాంలో టెండర్లు ఎందుకు రద్దుచేశారని ప్రశ్నించారు.

టీడీపీలో కలిపెయ్

- బాబును నమ్మినప్పుడు జనసేన ఎందుకు?: సజ్జల



సాక్షి, అమరావతి: చంద్రబాబు నాయకత్వంపై పవన్కు అంత నమ్మకం ఉన్నప్పుడు ఇక ప్రత్యేకంగా జనసేన పార్టీ ఎందుకు? అని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి సూటిగా ప్రశ్నించారు. పవన్ తన పార్టీని టీడీపీలో కలిపేసి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని తీసుకోవాలని సూచించారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'చంద్రబాబుతో ఏ అంశంపై అవగాహన లోపంతో 2019 ఎన్నికల్లో పవన్ విడిగా పోటీ చేశారు? ఇప్పుడు దేనిపై అవగాహన కుదిరిందని పొత్తు పెట్టుకున్నారో చెప్పాలి' అని పేర్కొన్నారు. చంద్రబాబునో లేదంటే లోకేశ్నో ముఖ్యమంత్రిని చేస్తానంటే ఇప్పుడు నీ వెనుక ఉన్నవారంతా నీ వెంట నడుస్తారా? అని పవన్ను ప్రశ్నించారు. ప్రజా స్పందనే లేకుండా మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్లా సాగిన లోకేశ్ పాదయాత్ర ముగింపును విజయోత్సవ సభలా నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. సభా వేదికపై ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్, బాలకృష్ణ తదితరులందరిలోనూ సీఎం జగన్ను ఎదుర్కోలేమనే భయం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మీరిద్దరూ ఏం చేశారని ప్రజలు ఓట్లేస్తారని చంద్రబాబు, పవన్ను నిలదీశారు.

మరింత మెరుగైన ఫలితాల కోసమే..

ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు, ప్రజలకు ఇంకా మెరుగ్గా సేవలు అందించేందుకే కొన్ని చోట్ల నియోజకవర్గాల సమన్వయకర్తలను సీఎం జగన్ మారుస్తున్నారని సజ్జల వివరించారు. సీఎం జగన్ పట్ల ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఎవరైనా పక్కచూపులు చూస్తే అది వారి విజ్ఞతకే వదిలేస్తామన్నారు. సీఎం జగన్ గేట్లు ఎత్తితే టీడీపీ, జనసేన ఖాళీ అవడం ఖాయమన్నారు.

అవ్వాతాతల వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ జీఓ జారీచేశారు. పెరిగిన పెన్షన్ను జనవరి 1న పింఛన్దారులకు అందజేయనున్నట్లు ఆ జీఓలో పేర్కొన్నారు. దీంతో సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చిన ఎన్నికల హామీని నూటికి నూరు శాతం అమలుచేసి చూపించారు.

నాడు రూ.400 కోట్లు.. నేడు రూ.2వేల కోట్లు..

ఇక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకు అర్హులైన దాదాపు 23 లక్షల మంది కొత్త వారికి వైఎస్సార్ పెన్షన్ కానుకను మంజూరు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పెన్షన్ల నిమిత్తం నెలనెలా సరాసరిన రూ.400 కోట్లు వ్యయం చేస్తే ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం పెంచిన పెన్షన్తో ఏకంగా రూ.2,000 కోట్లు వ్యయం చేస్తోంది. నిజానికి.. గత చంద్రబాబు ప్రభుత్వంలో.. కొత్తగా ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకుంటే వారికి మంజూరు చేయకుండా ఎవరైనా మృతిచెందితేనే వారి స్థానంలో కొత్తవారికి మంజూరు చేసేవారు. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం మాత్రం సంతృప్త స్థాయిలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్లను మంజూరు చేస్తోంది. ఇక సామాజిక పెన్షన్ల కోసం నెలకు రూ.2,000 కోట్లు వ్యయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉదంటే అది ఒక్క వైఎస్ జగన్ ప్రభుత్వమే.

ఏజెన్సీలో హైవే

- సూర్యాపేట నుంచి రాజమండ్రి వరకు నిర్మాణం
- ఏలూరు జిల్లాలో 86.5 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు
- 40.42 కిలోమీటర్ల మేర మొదటి ప్యాకేజీ మంజూరు
- జనవరి నెలాఖరుకు పనులు ప్రారంభం

సాక్షి, ఏలూరు ప్రతినిధి: ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో నూతన జాతీయ రహదారి ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా విస్తరించి ఏజెన్సీ మీదుగా ప్రధాన రహదారుల మధ్య కనెక్టివిటీ పెంచే జాతీయ రహదారికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ నుంచి ఆంధ్రా మధ్య దూరాన్ని తగ్గించేలా హైవే ప్రణాళిక ఖరారు చేశారు. మొదటి సారిగా పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన పోలవరంలో అత్యధిక భాగం నాలుగు వరుసల రహదారి నిర్మాణం కానుండటం విశేషం. ఎన్హెచ్ 365 బీబీ రెండో ప్యాకేజీ పనులకు రూ.367.97 కోట్లు మంజూరు కావడం, భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో వచ్చే నెలాఖరు నాటికి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.



బుట్టాయగూడెం నుంచి పట్టిసీమ వరకు నిర్మించిన రహదారి

సూర్యాపేట నుంచి పట్టిసీమను కలిపేలా..

సూర్యాపేట నుంచి ఖమ్మం, చింతలపూడి నియోజకవర్గం మీదుగా దేవరపల్లి జాతీయ రహదారికి ఇప్పటికే కనెక్టివిటీ పెంచేలా గ్రీన్ఫీల్డ్ నేషనల్ హైవే పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో పాటు ఏజెన్సీ ఏరియాలో పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యత, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ఫీల్డ్ హైవేకు సమీపంలోనే జాతీయ రహదారి 365 బీబీ నిర్మాణ పనులకు ఆమోదం లభించింది. సూర్యాపేట నుంచి కూసుమంచి, ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, అశ్వారావుపేట మీదుగా ఏపీలోని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మీదుగా పోలవరం వద్ద పట్టిసీమ కలిపేలా రహదారిని డిజైన్ చేశారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ మీదుగా రాజమండ్రి వరకు మొత్తం 86.5 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసల రహదారిగా నిర్మించడానికి వీలుగా టెండర్ ఖరారు చేశారు. దీనిలో భాగంగా మొదటి విడతలో జీలుగుమిల్లి నుంచి పోలవరం వరకు 365 బీబీ నిర్మాణ పనులు మొదటి ప్యాకేజీలో భాగంగా జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం నుంచి జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, కేఆర్ పురం, ఎల్ఎన్డీ పేట మీదుగా పట్టిసీమ వరకు 40.4 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.367.97 కోట్లు మంజూరు చేశారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికే జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో 52.89 హెక్టార్ల భూమి అవసరమవుతుందని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసి గ్రామ సభ కూడా నిర్వహించారు. వచ్చే నెల రెండో వారానికి టెండర్లు పూర్తి చేసి నెలాఖరు నాటికి పనులు ప్రారంభించే అవకాశముంది.

నాణ్యమైన పంట ఉత్పత్తులకు కేరాఫ్ ఏపీ

క్యూసీఐతో కలిసి పనిచేస్తున్న తొలి రాష్ట్రం ఏపీ

- వ్యవసాయ అనుబంధరంగాల్లో నాణ్యతకు పెద్దపీట
- రానున్న రోజుల్లో అన్ని రంగాలకు క్యూసీఐ సేవలు
- ప్రస్తుతం వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఇండిగ్యాప్ సర్టిఫికేషన్
- త్వరలో డెయిరీ, మత్స్య ఉత్పత్తులకు కూడా..
- సమీప భవిష్యత్‌లో ఏపీ నుంచి ఎగుమతులు రెట్టింపవడం ఖాయం
- 130 దేశాలకు నేరుగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు
- సాక్షితో క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జాక్సే షా

సాక్షి, అమరావతి: రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషి నిజంగా ప్రశంసనీయమని క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) చైర్‌పర్సన్ జాక్సే షా చెప్పారు. గ్రామస్థాయిలో రైతులకు అండగా నిలిచేలా ఏర్పాటు చేసిన ఆర్బీకే వ్యవస్థతో పాటు నాణ్యమైన ఉత్పాదకాలు అందించాలన్న ఆలోచనతో నియోజకవర్గ స్థాయిలో



ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు ఒక విప్లవాత్మకమైన మార్పు అని తెలిపారు. విజయవాడలో మంగళవారం జరిగిన ఏపీ గున్వత్ సంకల్ప్ (నాణ్యతకు భరోసా) వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన సాక్షి ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సీఎం వైఎస్ జగన్ చొరవ అభినందనీయం

క్యూసీఐతో కలిసి పూర్తిస్థాయిలో పనిచేసేందుకు ముందుకొచ్చిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గర్వంగా చెప్పగలుగుతున్నాం. ఇప్పటివరకు నాలుగైదు రాష్ట్రాలు మాత్రమే.. అది కూడా ఎంపిక చేసిన ఒకటి రెండు రంగాల వారీగా పనిచేసేందుకు మాతో అవగాహన ఒప్పందం చేసుకునేందుకు ముందుకొచ్చాయి. కానీ ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్ని రంగాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో క్యూసీఐతో పనిచేయబోతోంది. తాము పండించిన పంట ఉత్పత్తులను అంతర్జాతీయంగా తమకు నచ్చినచోట ప్రీమియం రేటుకు విక్రయించుకునేలా రైతులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవ నిజంగా అభినందనీయం. ఆయన చొరవ నేడు కార్యరూపం దాల్చింది. నాణ్యమైన పంట ఉత్పత్తులకు సర్టిఫికేషన్ చేయాలన్న లక్ష్యంతో దేశంలోనే తొలిసారి స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీని ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ఈ అథారిటీని ఏర్పాటు చేయడంతో క్యూసీఐ తరఫున గ్యాప్ సర్టిఫికేషన్ జారీచేసే బాధ్యతను ఈ సంస్థకు అప్పగించాం. ఈ సంస్థ ద్వారా దేశంలోనే తొలిసారి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు గ్యాప్ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) సర్టిఫికేషన్ జారీ కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టాం.

అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేస్తాం

ప్రత్యేక ఉత్పత్తులను హైలెట్ చేయడం, రైతుల పరపతిని మరింత మెరుగుపర్చడంతో పాటు ఇండిగ్యాప్, గ్లోబల్ గ్యాప్ సర్టిఫికేషన్ పొందిన వారిని అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం. మత్స్య, డెయిరీ ఉత్పత్తుల్లో ఎప్పటికప్పుడు రసాయన అవశేషాలను పరీక్షించేందుకు అవసరమైన చేయూతనిస్తాం. ఇలా వివిధదశల్లో పరీక్షలు, సాంకేతిక సహకారంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించేందుకు వెసులుబాటు కలుగుతుంది. అలాగే అంతర్జాతీయ విపణిలో నచ్చిన రేటుకు అమ్ముకోవడం ద్వారా కనీసం రెట్టింపు ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతుంది. ఏపీ నుంచి ప్రస్తుతం ఎగుమతి అవుతున్న వ్యవసాయ, మత్స్య ఉత్పత్తులు ఇండిగ్యాప్, గ్లోబల్ గ్యాప్ సర్టిఫికేషన్ వల్ల సమీప భవిష్యత్‌లో రెట్టింపు అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఇలా అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందించేందుకు ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ రంగాలకే కాదు.. ఇతర రంగాల ద్వారా అందించే సేవల్లో నాణ్యతను పెంచేందుకు క్యూసీఐ ద్వారా అవసరమైన సహకారం అందిస్తాం. ముఖ్యంగా ఏపీలో ప్రభుత్వ సంస్థలు, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేస్తాం. సామర్థ్యం పెంపు, జ్ఞాన భాగస్వామ్యంపై దృష్టిపెడతాం. దీర్ఘకాలికంగా నాణ్యతపై హామీ ఇచ్చే పద్ధతులను స్వతంత్రంగా నిర్వహించేందుకు రాష్ట్ర సంస్థలను తీర్చిదిద్దుతాం. వీటితోపాటు క్యూసీఐ చేపట్టే వివిధ కార్యక్రమాల ద్వారా ఏపీలో యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావంతో ఉన్నాం.

130 దేశాలకుపైగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు

ఏపీలో రైతుల కోసం ప్రత్యేకంగా క్యూసీఐ ఇండిగ్యాప్ పోర్టల్ ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో రైతులెవరైనా సరే ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా నాణ్యమైన పంట ఉత్పత్తులను గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా తమకు నచ్చినచోట నచ్చిన ధరకు అమ్ముకోవచ్చు. ఈ సర్టిఫికేషన్ ద్వారా అంతర్జాతీయంగా 130కి పైగా దేశాల్లో తమ ఉత్పత్తులకు అమ్ముకునే వెలుసుబాటు ఉంటుంది. ఇదే స్ఫూర్తితో మిగిలిన వ్యవసాయ అనుబంధరంగాల్లో కూడా సర్టిఫికేషన్ కోసం ఏపీ ప్రభుత్వంతో క్యూసీఐ అవగాహన ఒప్పందం చేసుకుంది.

అగ్రి ల్యాబ్స్‌కు ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్

తాజాగా చేసుకున్న ఒప్పందం ద్వారా త్వరలో ఇండిగ్యాప్‌తో పాటు గ్లోబల్ గ్యాప్ సర్టిఫికేషన్ కూడా జారీచేయబోతున్నాం. అంతేకాదు.. ఏపీ ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్‌ల్యాబ్స్‌కు ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్ జారీచేసేందుకు క్యూసీఐ సహకారం అందిస్తుంది. అలాగే గ్రామస్థాయిలో రైతులకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్బీకేలకు పూర్తిస్థాయిలో ఐఎస్‌వో సర్టిఫికేషన్ వచ్చేలా సహకారం అందిస్తాం. సీజన్‌లో సకాలంలో భూసార పరీక్షల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తాం. తద్వారా ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గుతుంది. ఆర్బీకేల ద్వారా పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కోసం ప్రత్యేకంగా సోషల్ మీడియా ప్లాన్ తయారు చేస్తాం.

క్లుప్తంగా...

ఎస్‌ఐ పోస్టుకు మహిళా వలంటీర్ ఎంపిక



మార్కాపురం: ఇప్పటి వరకు వలంటీర్‌గా పనిచేసి తన పరిధిలోని కుటుంబాలకు సేవ చేసిన ఓ యువతి ఏకంగా ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైంది. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలో 6వ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా సేవలు అందిస్తున్న మేంద్రగుత్తి శివయోగీశ్వరి గురువారం ప్రకటించిన ఎస్‌ఐ పరీక్ష తుది ఫలితాల్లో ప్రతిభ చూపి ఉద్యోగానికి ఎంపికైంది. ఆమె తండ్రి పెద్ద తిరుపతయ్య గృహనిర్మాణ కార్మికుడు కాగా, తల్లి రమణమ్మ గృహిణి. శివయోగీశ్వరికి అక్క, తమ్ముడు ఉన్నారు. ఈ సందర్భంగా శివయోగీశ్వరి మాట్లాడుతూ వలంటీర్‌గా ప్రజలకు సేవలందిస్తూనే పట్టణంలోని ఒక ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుని ఎస్‌ఐగా ఎంపికయ్యానని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు తనకు సహకరించినవారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మార్కాపురం పట్టణానికే చెందిన పి.వెంకటేశ్వరరెడ్డి, వి.దశరథరామయ్య కూడా ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించారు.

99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం వరుస నోటిఫికేషన్లతో ఉద్యోగాల జాతర మొదలుపెట్టింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 99 లెక్చరర్ పోస్టుల భర్తీకి గురువారం నోటిఫికేషన్ ఇచ్చింది. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. నోటిఫికేషన్ పూర్తి వివరాలను https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. ఇక ఏపీ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది.

డాక్టర్ కుంటే కళ్యాణికి ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డు



యూపీ సీఎస్ దేవేష్ చతుర్వేది నుంచి అవార్డ్ అందుకుంటున్న కళ్యాణి బాయి

సాక్షి, అమరావతి: నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ(ఎన్ఈఎస్ఏ) అందించే ప్రతిష్టాత్మక ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డు ఏపీ జీవ వైవిధ్య మండలిలో శాస్త్రవేతగా పనిచేస్తున్న డాక్టర్ కుంటే కళ్యాణి బాయిని వరించింది. ఈ నెల 14వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్–ఎన్‌బీఆర్ఐ) ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర సీఎస్ డాక్టర్ దేవేష్ చతుర్వేది చేతుల మీదుగా కళ్యాణి బాయి అవార్డును అందుకున్నారు. ఈ క్రమంలో కళ్యాణి బాయి సాధించిన విజయాన్ని అభినందిస్తూ ఏపీ జీవ వైవిధ్య మండలి చైర్మన్ డాక్టర్ బీఎంకే రెడ్డి, మెంబర్ సెక్రటరీ ఆర్‌కే సుమన్ గురువారం ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఐదుగురికి ఈ అవార్డును అందించగా, అందులో ఒకరు తమ సంస్థకు చెందిన వారు కావడం గర్వంగా ఉందన్నారు.

యువగళం సభకు అడుగడుగునా అడ్డంకులు..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): యువగళం సభ ఫెయిల్ అవ్వాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, ఈ సభను అడ్డుకునేందుకు ఆ పార్టీ నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఆరోపించారు. గురువారం విశాఖలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్లో తిరుగుబాటు వస్తే జగన్ అడ్డుకోలేడని నిన్నటి సభ అద్దం పట్టిందన్నారు. ఉత్తరాంధ్ర చరిత్రలోనే అతిపెద్ద సభ నిన్నటిదన్నారు. సభ సక్సెస్ చేసిన టీడీపీ–జనసేన శ్రేణులకు అచ్చెన్నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు వచ్చినట్టు ప్రజలు వచ్చారని, వచ్చే సార్వత్రిక ఎన్నికలు జగన్‌కి టీడీపీ మధ్య కాదని, జగన్‌కి జనసేన మధ్య కాదని, జగన్‌కు ప్రజలకు మధ్య పోటీ అని అన్నారు. రాష్ట్రంలో త్వరలో మూడు చోట్ల ఇదే తరహాలో సభలు నిర్వహిస్తామన్నారు. మాజీ మంత్రి కళా వెంకటరావు మాట్లాడుతూ జగన్ ప్రజాస్వామ్యాన్ని కాలరాశాడని, అభివృద్ధిని పక్కనబెట్టి విధ్వంసం సృష్టించాడని ఆరోపించారు. లోకేశ్ మూడు వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేశారన్నారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ తర్వాత జరిగిన భారీ బహిరంగ సభ అని, టీడీపీ–జనసేన పొత్తు తర్వాత జరిగిన మొదటి సభ అని, ఈ సభకు విశాఖ వేదిక కావడం అదృష్టమని అన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సీఎం జగన్ ఎందుకు ఇన్ని వేల ఎకరాలు దోచేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

23, 24, 25 తేదీల్లో.. సీఎం జగన్ వైఎస్సార్ జిల్లా పర్యటన

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
క్రిస్మస్ వేడుకలకూ హాజరుకానున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23, 24, 25 తేదీల్లో వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అలాగే, క్రిస్మస్ వేడుకల్లోనూ పాల్గొంటారు. ముఖ్యమంత్రి మూడ్రోజుల పర్యటన షెడ్యూల్ ఇలా..

- 23వ తేదీ ఉ.9.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి కడప చేరుకుంటారు. అక్కడి నుంచి గోపవరం చేరుకుని సెంచురీ ప్లైపరిశ్రమలోని ఎండీఎఫ్, హెచ్‌పీఎల్ ప్లాంట్లను ప్రారంభించి చైర్మన్, సిబ్బందితో మాట్లాడతారు.
- ఆ తర్వాత కడప రిమ్స్ వద్ద డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. దీంతో పాటు డాక్టర్ వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌ను ప్రారంభించిన అనంతరం అదే రిమ్స్ ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ క్యాన్సర్ కేర్ బ్లాక్‌ను ప్రారంభిస్తారు.
- అనంతరం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభిస్తారు.
- అలాగే, వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఫ్లడ్‌లైట్లను ప్రారంభిస్తారు.
- ఆ తర్వాత ఆధునీకరించిన కలెక్టరేట్ భవనాన్ని, నవీకరించిన అంబేద్కర్ సర్కిల్, వై.జంక్షన్, కోటిరెడ్డి సర్కిల్, సెవెన్ రోడ్స్ సర్కిల్ ప్రారంభిస్తారు.
- అంతేకాక.. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన అనంతరం ఇడుపులపాయ చేరుకుని వైఎస్సార్ ఎస్టేట్‌లోని గెస్ట్‌హౌస్‌లో రాత్రికి బసచేస్తారు.
- ఇక 24న ఇడుపులపాయ గెస్ట్‌హౌస్ నుంచి బయల్దేరి వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పిస్తారు. ఆ తర్వాత ఇడుపులపాయ ప్రేయర్ హాల్‌లో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం.. మధ్యాహ్నం సింహాద్రిపురం చేరుకుని పలు ప్రారంభోత్సవాలు చేస్తారు. అక్కడ నుంచి ఇడుపులపాయ చేరుకుని ఎకో పార్కులో పులివెందుల మండల ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. రాత్రికి అక్కడి గెస్ట్‌హౌస్‌లో బసచేస్తారు.
- 25వ తేదీ ఉదయం ఇడుపులపాయ గెస్ట్‌హౌస్ నుంచి బయల్దేరి పులివెందుల చేరుకుంటారు, అక్కడ సీఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొంటారు, మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు.

మూడేళ్లలో రూ.87,877 కోట్లు

- పెరుగుతున్న రాష్ట్ర ప్రజల సంపద
- డిపాజిట్లతో బ్యాంకులు కళకళ
- ఉమ్మడి జిల్లాల్లో విశాఖ.. నూతన జిల్లాల్లో ఎన్టీఆర్ టాప్
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల సంపద పెరుగుతోంది. సంపాదనను బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తున్నట్లు ఇటీవల జరిగిన 224వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడించింది. గత మూడేళ్లలో రూ.87,877 కోట్ల మేర బ్యాంకుల్లో డిపాజిట్లు పెరిగాయి. 2021 మార్చి నాటికి బ్యాంకుల్లో రూ.3.85 లక్షల కోట్లు డిపాజిట్లు ఉండగా ఈ ఏడాది జూన్ నాటికి రూ.4.73 లక్షల కోట్లకు పెరిగాయి.

పెరిగిన జీవన ప్రమాణాలు..

వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేదలు, మధ్య తరగతి వర్గాల జీవనోపాధి అవకాశాలు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రజలు తమ కష్టార్జితాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో మదుపు చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతోపాటు జగనన్న పాల వెల్లువ ద్వారా ఆదాయ మార్గాలను చూపిస్తూ జీవన ప్రమాణాలను పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళలు సాధికారతతో తమ కాళ్లపై నిలబడేలా వివిధ వ్యాపార మార్గాలను రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. ఈ కార్యక్రమాలతో 2021 మార్చి నుంచి ఏటా బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుతూ వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో విశాఖలో అత్యధికంగా డిపాజిట్లు ఉండగా నూతన జిల్లాల్లో అత్యధిక డిపాజిట్లు ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా డిపాజిట్లున్నాయి.

రాష్ట్ర బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుదల ఇలా

సంవత్సరం	డిపాజిట్లు రూ.కోట్లలో
31-03-2021	3,85,929
31-03-2022	4,14,594
31-3-2023	4,56,961
30-06-2023	4,73,806

ఘనంగా గ్రామ, వార్డు సచివాలయ దినోత్సవం

సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సచివాలయాల ఉద్యోగులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, వలంటీర్లు సీఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడంతో పాటు కేక్‌లు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గుంటూరులోని గ్రామ సచివాలయ ఉద్యోగుల శిక్షణ కేంద్రంలో జరిగిన వేడుకలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకార్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే నోటిఫికేషన్ ద్వారా ఏకంగా 1.34 లక్షల మందిని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులుగా నియమించి.. వారి కుటుంబాలకు భరోసా కల్పించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఈ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదన్నారు. సీఎం జగన్ మనసులో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇది ఆయన మానస పుత్రిక అని చెప్పారు. త్వరలోనే సీఎం జగన్‌ను ఆహ్వానించి గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో గుంటూరులో కృతజ్ఞత సభ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. కాగా, గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీలో సీఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

విజయవాడలో 6 ప్రాజెక్టులు




సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ ప్రాజెక్టులో భాగంగా విజయవాడ సిటీలో ఆరు ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని.. ఒక నీటి పంపిణీ ప్రాజెక్టు, ఒక సీవరేజ్/సెప్టేజ్ రంగానికి చెందిన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు గురువారం ప్రశ్నోత్తరాల్లో సమాధానమిస్తూ.. రూ.84.66 కోట్ల విలువైన నీటి పంపిణీ ప్రాజెక్టు పనులు జూన్ 2020లోనే ప్రారంభించినట్టు తెలిపారు. అయితే ఈ పనులు కరోనా వల్ల ఆలస్యమయ్యాయని, వచ్చే ఏడాది మే నాటికి పూర్తవుతాయన్నారు. రూ.39.36 కోట్ల విలువైన సీవరేజ్/సెప్టేజ్ ప్రాజెక్టు వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తవుతుందన్నారు.

కడప, కర్నూలు నుంచి 1,08,748 మంది ప్రయాణం



కడప, కర్నూలు విమానాశ్రయాల నుంచి 2023లో 1,08,748 మంది ప్రయాణించారని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఆర్‌సీఎస్–ఉడాన్ 5.0, 5.1 కింద ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌స్ట్రిప్/హెలిప్యాడ్ అభివృద్ధికి ప్రదేశాలు గుర్తించలేదన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 72.22 శాతం టాప్ వాటర్



ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబర్ 17 నాటికి 72.22 శాతం మందికి కుళాయి కనెక్షన్లు అందుబాటులోకి వచ్చాయని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఆగస్టు 15 2019 నాటికి 32.18 శాతం కుళాయి కనెక్షన్లు ఉన్నాయన్నారు.

సైబర్ దాడుల నియంత్రణకు చర్యలు



విమానాశ్రయాల్లో సైబర్ దాడులను నియంత్రించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌లు ఉపయోగించి డాటా బేస్డ్ సెక్యూరిటీని ఏర్పాటు చేశామని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సైబర్‌దాడులు, సైబర్ టెర్రరిజం ఎదుర్కోవడానికి కొన్ని మార్గదర్శకాలు రూపొందించిందన్నారు.

బీచ్ రోడ్డు అభివృద్ధికి డీపీఆర్ రెడీ



రిషికొండ, భీమిలి మీదుగా భోగాపురం వద్ద ఎన్‌హెచ్–16తో వైజాగ్ పోర్టు కంటైనర్ టెర్మినల్ కలిపే బీచ్ రోడ్ అభివృద్ధికి డీపీఆర్ తయారైందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు గోరంట్ల మాధవ్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. జాతీయ రహదారి, ప్రాధాన్యాలు, నిధుల లభ్యత ఆధారంగా ప్రాజెక్టు చేపడతామన్నారు.


నకిలీ వార్తల కట్టడికి చర్యలేమిటో స్పష్టం చేయాలి

నకిలీ వార్తల వ్యాప్తిని అరికట్టడానికి, ఆయా నకిలీ వార్తల హానికరమైన పర్యవసానాల నుంచి ప్రజల్ని రక్షించేందుకు ప్రభుత్వం తీసుకునే కచ్చితమైన చర్యలేమిటో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ కోరారు. ఫేక్ న్యూస్ కేసులు 214 శాతం పెరిగినట్లు 2020లో నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలో పేర్కొందని.. ఇది సామాజిక స్థిరత్వానికి తీవ్రమైన ముప్పు అని మాధవ్ తెలిపారు. గురువారం లోక్‌సభలో ప్రెస్, రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించిన ఆయన పలు తెలుగు మీడియా సంస్థలు కూడా అవకతవకలు, వక్రీకరణ, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొన్నారు. నకిలీ వార్తలు భయాందోళన కలిగించడంతోపాటు సమాజంలో విభజనకు దారితీస్తాయన్నారు. పెయిడ్ న్యూస్ పర్యవేక్షణకు నైతిక జర్నలిజానికి భరోసా ఇవ్వడానికి స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాలు మరింత జవాబుదారీతనంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాజ్యసభ

వర్ష సూచనల కోసం గూగుల్‌తో ఒప్పందం

వైఎస్సార్ సీపీపీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో నిర్దిష్ట ప్రాంతంలో వర్షం పడే అవకాశాన్ని ముందుగానే తెలుసుకునేందుకు వీలుగా గూగుల్ ఆసియా సంస్థతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒప్పందం చేసుకుందని ఎర్త్ సైన్స్ శాఖ మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ విషయం తెలిపారు. తుపాన్లు సంభవించే సూచనలను మాత్రం యధావిధిగా ఐఎండీయే ఇస్తుందన్నారు. సముద్ర జలాల్లో ఏర్పడే ప్రతికూల పరిస్థితులపై ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇ–కాయిస్), ఐఎండీ సంయుక్తంగా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటాయన్నారు. ఈ హెచ్చరికలకు అనుగుణంగా సముద్రంలో సుదూర ప్రాంతాల్లో ఎలాంటి సమాచార వ్యవస్థ అందుబాటులో లేని మత్స్యకారులకు నావిక్ మెసేజింగ్ సర్వీస్ ద్వారా అలర్ట్‌లు పంపిస్తామని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'కు ఆర్థిక సాయం అడగలేదు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోతున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం కోరలేదని కేంద్ర క్రీడలు, యువజన శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఆడుదాం ఆంధ్రా ఈవెంట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం 15 ఏళ్లు పైబడిన యువత కోసం అన్ని గ్రామాలు, వార్డు సచివాలయల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు.

శ్రీసిటీలో ఆస్పత్రికి సూత్రప్రాయ అనుమతి



నెల్లూరు జిల్లా శ్రీసిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఈఎస్‌ఐ సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన భూమి ఇంకా గుర్తించలేదని అందుకే నిర్మాణం ఆలస్యం అయిందని వైఎస్సార్ సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పర్యావరణ ఉత్పత్తుల నాణ్యతకు ఎకో మార్క్




పర్యావరణ ప్రమాణాలకు అనుకూలంగా భారతీయ ఉత్పత్తుల నాణ్యత దృష్టిలో ఉంచుకుని గృహ, ఇతర వినియోగ ఉత్పత్తుల అక్రిడిటేషన్‌కు లేబులింగ్ అందించడానికి ఎకో మార్క్‌ను తీసుకొచ్చినట్టు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి అశ్వినికుమార్ చౌబే తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రాజ్యాంగానికి లోబడి పనిచేస్తాం



భూమి, అడవులకు సంబంధించి రాజ్యాంగానికి లోబడి పనిచేస్తామని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. భూమి అంశాన్ని రాష్ట్రాల పరిధిలోనిదని స్పష్టం చేశారు. భూమి, అటవీ ప్రాంతం రెండూ కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఉమ్మడి చట్టం చేయాలన్న వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

చట్టాల మార్పులపై విమర్శలు సరికాదు



చట్టాల సవరణల సందర్భంగా వస్తున్న విమర్శలు సరికావని వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి అన్నారు. రాజ్యసభలో కేంద్రం ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ (రెండో) సంహిత, భారతీయ నాగరిక సురక్ష (రెండో) సంహిత, భారతీయ సాక్ష్య (రెండో) బిల్లులపై చర్చలో భాగంగా ఆయన బిల్లులకు మద్దతు ఇస్తూ మాట్లాడారు. చట్టాలు మార్పు సమయంలో పాత చట్టాలు కట్ అండ్ పేస్ట్‌లా ఉన్నాయనడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానన్నారు. పాత చట్టాలను భర్తీ చేసే సమయంలో కొన్ని నిబంధనలు కాలక్రమేణా అర్థం చేసుకుంటున్నారని తెలిపారు.

రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలపై సీఈసీ కసరత్తు

- విజయవాడలో రెండు రోజుల పాటు కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష
- సమావేశానికి ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా ఏడుగురు అధికారులు



సాక్షి, అమరావతి: వచ్చే సంవత్సరం రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగే సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన ఉన్నతాధికారులు రెండు రోజులు పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు సహా మొత్తం ఏడుగురు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు విజయవాడలోని నోవాటెల్ హోటల్లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు సమీక్షిస్తారు. తదనంతరం 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్రంలోని అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులతో ఈసీఐ బృందం చర్చించనుంది. ఎస్ఎస్ఆర్–2024 కార్యకలాపాలు, ఎన్నికల నిర్వహణ ప్రణాళిక తదితరాలపై జిల్లా కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇందుకోసం చేసిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుతో కలసి పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.

■ తెలంగాణ

తెలంగాణలో కొత్తగా ఆరు కరోనా పాజిటివ్ కేసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా ఆరు కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తాజాగా నమోదైన కేసులు కలిపి ప్రస్తుతం 19 మంది కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య విభాగం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. చికిత్స పొందుతూ గురువారం ఒకరు కోలుకున్నట్లు వివరించింది. కోవిడ్–19 ప్రారంభం నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,44,519 మంది కరోనా బారిన పడగా... వీరిలో 8,40,389 మంది రికవరీ అయ్యారు. 4,111 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రంలో కోవిడ్ రికవరీ రేటు 99.51 శాతం ఉండగా... మరణాల రేటు 0.49 శాతంగా ఉంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 925 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇందులో 54 నమూనాలకు సంబంధించి ఫలితాలు వెలువడాల్సి ఉంది.

తెలంగాణ 'విద్యుత్' అప్పులు రూ.78,553 కోట్లు!

విద్యుత్ రంగ శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ రంగం ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ సర్కారు గురువారం అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టింది. తెలంగాణ ఆవిర్భవించే నాటికి రాష్ట్ర విద్యుత్ సంస్థల అప్పులు రూ.20,856.12 కోట్ల మేర ఉండగా.. 2022–23 నాటికి రూ.78,553.92 కోట్లకు పెరిగాయని అందులో పేర్కొంది. తెలంగాణ ఏర్పడినప్పుడు విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన మొత్తం అప్పులు, బకాయిలు (లయబిలిటీస్) కలిపి రూ.37,081.64 కోట్లుకాగా.. 2022–23 నాటికి రూ.1,37,571.4 కోట్లకు చేరాయని వివరించింది. అంటే ఏకంగా రూ.1,00,489 కోట్లకుపైగా పెరిగినట్టు పేర్కొంది. విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన బకాయిల్లో.. విద్యుదుత్పత్తి కోసం జెన్‌కో కొనుగోలు చేసిన బొగ్గు వ్యయం, డిస్కంలు కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించి ఇంకా చెల్లించాల్సిన బిల్లుల వంటివి ఉంటాయి. అయితే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని విడుదల చేసి మాట్లాడినప్పుడు.. పలు అంశాలను విడివిడిగా వివరించారు. విద్యుత్‌శాఖ మొత్తం అప్పులు రూ.81,516 కోట్లు అని పేర్కొన్నారు. ఇక ప్రభుత్వంలోని వివిధ శాఖలు/విభాగాలు విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు రూ.28,842.72 కోట్లు. ఇందులో కేంద్ర ప్రభుత్వ శాఖలు బకాయిపడిన సొమ్ము రూ.720 కోట్లు.

కేసీఆర్‌పై ఈపీని కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై 2019లో దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2018లో గజ్వేల్ నుంచి పోటీ చేసిన కేసీఆర్ 1,25,444 ఓట్లతో విజయం సాధించారు. అయితే ఆయన తన ఎన్నికల అఫిడవిట్లో అనేక వాస్తవాలను దాచారని, కేసుల వివరాలన్నీ పొందుపర్చలేదని, అందువల్ల ఆయన ఎన్నిక రద్దు చేయాలని కోరుతూ సిద్దిపేట జిల్లా మామిడ్యాలకు చెందిన టి.శ్రీనివాస్ 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలకు లోబడి కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయలేదని, ఆయనపై మొత్తం 64 కేసులుంటే, 2 కేసుల గురించే అఫిడవిట్‌లో ప్రస్తావించారని ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. 2018లో జరిగిన ఎన్నికల కాల పరిమితి ముగిసినందున, ఇప్పుడు ఈ పిటిషన్‌లో విచారణ అవసరం లేదంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

బిగ్‌బాస్ ఫైనల్ గొడవలో 12 మంది అరెస్ట్

బంజారాహిల్స్(హైదరాబాద్): బిగ్‌బాస్ సీజన్–7 విజేతగా పల్లవి ప్రశాంత్‌ను ప్రకటించకపోతే అన్నపూర్ణ స్టూడియోను బాంబులతో లేపేస్తామని, విధ్వంసం సృష్టిస్తామంటూ యూట్యూబ్ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన 12 మందిని రిమాండ్‌కు, మరో నలుగురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీ రాత్రి బిగ్‌బాస్ ఫైనల్స్ జరుగుతున్న సమయంలో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అమర్‌దీప్, ప్రశాంత్ అభిమానులు అన్నపూర్ణ స్టూడియో వద్దకు చేరుకున్నారు. అంతకుముందే అక్కడున్న యూట్యూబ్ చానళ్లకు అభిమానులు రెచ్చగొట్టే విధంగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ప్రశాంత్‌ను విజేతగా ప్రకటించకపోతే బీభత్సం సృష్టిస్తామంటూ వ్యాఖ్యలు చేయడంతో, వివిధ ప్రాంతాల నుంచి మరింత మంది అభిమానులు అక్కడకు చేరుకున్నారు. తాము ఓటు వేసిన ప్రశాంత్ తమను కలవకుండానే పోయిన విషయాన్ని గుర్తించిన అభిమానులు తోపులాటకు దిగారు. అమర్‌దీప్ అభిమానులతో గొడవకు దిగారు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగి తోపులాటతో హంగామా చేశారు. కొందరు యువకులు రెచ్చిపోయి రాళ్లతో అటుగా వెళుతున్న బస్సు అద్దాలను పగులగొట్టారు. అక్కడున్న కార్లను కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని యూట్యూబ్ చానళ్లతో మాట్లాడిన వారిని రెండు రోజుల పాటు గాలించి పట్టుకున్నారు. భూపతి బాలకృష్ణ, జి.మోహన్‌కుమార్, భూపతి రాఘవేందర్, డి.రంజిత్‌కుమార్, మొలవాల గణేష్, ధర్మపురి రోహిత్, సరళ రాఘవ, పి.సురేందర్, రాపంతు నవీన్, ఏ.సంతోష్, ధర్మపురి ఏసురత్నం, ఇడువల్ల మహేష్‌లపై కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని 17వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

భారీగా పెరిగిన ఉద్యోగులు

- 2018–19తో పోలిస్తే 2022–23లో 35 శాతం పెరిగిన ఈపీఎఫ్ ఖాతాలు
- 2018–19లో 44.85 లక్షల పీఎఫ్ ఖాతాలు
- 2022–23లో 60.73 లక్షలకు పెరుగుదల
- జాతీయ స్థాయిలో 30.38 శాతం పెరిగిన ఖాతాలు
- సీఎం జగన్ చర్యలతో రాష్ట్రంలో యువతకు భారీగా ఉద్యోగాలు
- ఒక్క సచివాలయ వ్యవస్థ ద్వారానే 1.25 లక్షల ఉద్యోగాలు
- వైద్య శాఖలో 53 వేలకు పైగా పోస్టుల భర్తీ
- పరిశ్రమలకు ప్రోత్సాహం ద్వారా ప్రైవేటు రంగంలోనూ పెద్ద ఎత్తున ఉపాధి
- రాష్ట్రంలో వేగంగా తగ్గుతున్న నిరుద్యోగిత



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలతో రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఏటా పెరుగుతున్న కొత్త ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ఖాతాలే ఇందుకు నిదర్శనం. 2018–19తో పోలిస్తే 2022–23లో రాష్ట్రంలో ఈపీఎఫ్ ఖాతాలు 35 శాతం మేర పెరిగినట్టు ఇటీవల రాజ్యసభలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ వెల్లడించింది. టీడీపీ ప్రభుత్వం ఉండగా 2018–19లో రాష్ట్రంలో 44,85,974 పీఎఫ్ ఖాతాలు ఉండేవి. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత యువతకు ఉద్యోగావకాశాలు పెరిగాయి. ఓ పక్క ప్రభుత్వ ఉద్యోగాలు, మరోపక్క ప్రైవేటు రంగంలోనూ ఉపాధి పెరిగేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. దీంతో 2020–21లో రాష్ట్రంలో పీఎఫ్ ఖాతాల సంఖ్య 52.39 లక్షలకు పెరిగింది. అంతే సుమారు 5.5 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరారు. 2021–22లో వీటి సంఖ్య 56.34 లక్షలకు పెరిగాయి. 2022–23లో 60.73 లక్షలకు చేరుకున్నాయి. జాతీయ స్థాయిలో 2018–19లో 22.91 కోట్లుగా ఉన్న పీఎఫ్ ఖాతాలు 2022–23 నాటికి 29.88 కోట్లకు చేరుకున్నాయి. జాతీయ స్థాయిలో ఐదేళ్లలో 30.38 శాతం ఖాతాలు పెరిగాయి. ఈ లెక్కన జాతీయ స్థాయి కన్నా రాష్ట్రంలోనే పీఎఫ్ ఖాతాల పెరుగుదల ఎక్కువ. తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్లలో 31 శాతం, కర్ణాటకలో 32 శాతం, తమిళనాడు, పుదుచ్చేరిలో 27 శాతం మేర ఖాతాలు పెరిగాయి. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఓ వైపు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు భర్తీ చేస్తూనే, మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. అధికారం చేపట్టిన వెంటనే గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, భారీ సంఖ్యలో యువతకు ఉద్యోగాలిచ్చారు. ఒక్క సచివాలయ వ్యవస్థ ద్వారానే ఏకంగా 1,25,110 మంది యువతకు శాశ్వత ఉద్యోగాలిచ్చారు. మరోపక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా జీరో వేకెన్సీ పాలసీని తీసుకొచ్చారు. ఇలా వైద్య శాఖలో 53 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టారు. మిగిలిన ప్రభుత్వ శాఖల్లోనూ శాశ్వత, కాంట్రాక్టు పద్ధతుల్లో నియామకాలు చేపట్టి నిరుద్యోగులకు అండగా నిలిచారు. పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం ద్వారా ప్రైవేటు రంగంలోనూ రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించింది. ఈ చర్యల ఫలితంగా రాష్ట్రంలో నిరుద్యోగిత తగ్గుముఖం పట్టింది. ఈ విషయం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదికల్లోనూ వెల్లడైంది. 2018–19లో రాష్ట్రంలో ప్రతి వెయ్యి మందికి గ్రామాల్లో 45 మంది, పట్టణాల్లో 73 మంది నిరుద్యోగులు ఉండగా 2022–23లో గ్రామాల్లో 33, పట్టణాల్లో 65కు నిరుద్యోగిత తగ్గినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

క్యాంపు కార్యాలయాల వ్యాజ్యాలు త్రిసభ్య ధర్మాసనానికి

- ధర్మాసనం విచారణ చేపట్టే వరకు మధ్యంతర ఉత్తర్వులు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు వెల్లడి
- మధ్యంతర ఉత్తర్వులను తీవ్రంగా వ్యతిరేకించిన ప్రభుత్వ న్యాయవాదులు

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తూ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 2283ని సవాలు చేస్తూ రాజధాని రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనానికి నివేదిస్తానని సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ప్రకటించారు. ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం పరిగణనలోకి తీసుకునేంత వరకు క్యాంపు కార్యాలయాల ఏర్పాటు విషయంలో తదుపరి చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు జారీ చేస్తానని మౌఖికంగా తెలిపారు. ఈ ఉత్తర్వులు స్వల్ప కాలమే అమల్లో ఉంటాయన్నారు. ఇరుపక్షాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని మరింత స్పష్టతతో ఉత్తర్వులు జారీ చేస్తానని తెలిపారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ స్పందిస్తూ.. కార్యాలయాల కేటాయింపు ప్రక్రియే పూర్తి కాలేదని, వాటి ఏర్పాటు విషయంలో చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఈ వ్యాజ్యాల్లో అత్యవసరంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఆర్ 5 జోన్ విషయంలో కూడా అప్పటి సింగిల్ జడ్జి అత్యవసర ఉత్తర్వుల జారీకి నిరాకరించారని, ఆ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనానికే నివేదించారని తెలిపారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాలపై త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టే వరకు క్యాంపు కార్యాలయాల విషయంలో స్టేటస్ కో ఉత్తర్వులు ఇస్తానన్నారు. త్రిసభ్య ధర్మాసనానికి పంపాలని నిర్ణయించినప్పుడు స్టేటస్ కో ఉత్తర్వుల అవసరం లేదని ఎస్‌జీపీ సుమన్ అన్నారు. అలాంటి ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా త్రిసభ్య ధర్మాసనానికి మార్గదర్శకం చేసినట్లు అవుతుందన్నారు. రేపే తాము ప్రధాన న్యాయమూర్తి ముందు ఈ వ్యాజ్యాల గురించి ప్రస్తావించి త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతామని, ఈ విషయంలో పిటిషనర్లకు సహకరిస్తామని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసమే..

మరో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వేలూరు మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. కార్యాలయాలను తరలించడం లేదని, పాలనా సౌలభ్యం, ఉత్తరాంధ్ర అభివృద్ధిని సమీక్షించేందుకే క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్తావన ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పిటిషనర్లు అవాస్తవాలతో కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని వివరించారు. రాజధాని వ్యవహారం, ఇతర అనుబంధ అంశాలు సుప్రీంకోర్టు, త్రిసభ్య ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అందువల్ల ఈ వ్యాజ్యాలను పూర్తిగా త్రిసభ్య ధర్మాసనానికే వదిలేయాలని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'ట్రావెల్ ఫర్ లైఫ్'

- ఐదు కేటగిరీల్లో పోటీలు
- 'టూరిజం ఫర్ టుమారో' కేస్ స్టడీల ఆహ్వానం
- జనవరి 15 వరకు గడువు
- ఆంధ్రప్రదేశ్ పర్యాటకంలోనూ అద్భుత ప్రగతి



సాక్షి, అమరావతి : భారతదేశంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా పర్యాటక విధానాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే «ట్రావెల్ ఫర్ లైఫ్‌» పేరిట కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తోంది. దేశంలో పర్యావరణహిత, అంతర్జాతీయ స్థాయి టూరిజం ప్రమాణాల అభివృద్ధిలో భాగంగా జీ–20 ప్రెసిడెన్సీ రోడ్‌మ్యాప్ అమలుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఐదు కేటగిరీల్లో 'టూరిజం ఫర్ టుమారో కేస్ స్టడీ'లను పోటీలకు ఆహ్వానిస్తోంది. పర్యాటక రంగంలో ఆహ్లాదాన్ని అందించడంతో పాటు పర్యావరణ సుస్థిరత, జీవ వైవిధ్యం పెంపు–రక్షణ, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోంది. స్థానిక సంఘాలు, ప్రభుత్వాలు, వ్యాపారులు, ఎన్జీవోలు, ఇతర స్టేక్‌హోల్డర్లను భాగస్వాములను చేయనుంది. అందుకే 'ట్రావెల్ ఫర్ లైఫ్' కింద గ్రీన్ టూరిజం, డిజిటలైజేషన్, స్కిల్స్, పర్యాటక ఎంఎస్‌ఎంఈ, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ వంటి ఐదు కీలక ప్రాధాన్యతలను ఎంపిక చేసింది. వీటిని పర్యాటక రంగంలో అమలు చేస్తున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ, ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాల నుంచి కేస్ స్టడీల పోటీలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం అమలవుతున్న లక్ష్యాల ప్రక్రియ, ఫలితాలు, వీడియో/ఫొటోలతో కూడిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉంటుంది. నామినేషన్లకు జనవరి 15వ తేదీ వరకు అవకాశం కల్పించింది.

ఏపీ పర్యాటకంలో సుస్థిరాభివృద్ధి వెలుగులు..

ప్రపంచ వ్యాప్తంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పర్యాటక రంగాన్ని ప్రత్యేక వాహకంగా ఉపయోగిస్తున్నారు. అందుకే 'సెంట్రల్ నోడల్ ఏజెన్సీ ఫర్ సస్టైయినబుల్ టూరిజం' దేశంలో సుస్థిరాభివృద్ధి ఆధారిత ప్రాజెక్టులను గుర్తించి మద్దతిస్తోంది. వినూత్న, ప్రభావవంతమైన కార్యక్రమాలను విశ్లేషించి, ప్రదర్శించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించనుంది. కాగా, ఆంధ్రప్రదేశ్ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో కీలక పురోగతిని కనబరుస్తోంది. సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం, పేదరిక నిర్మూలనలో విప్లవాత్మక మార్పులు చర్యలు చేపట్టింది. ఇక పర్యాటక రంగంలోనూ ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా అడుగులేస్తోంది. ఇప్పటికే ప్రపంచ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం టీటీడీలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించింది. పునరుత్పాదక శక్తిని సమర్థంగా వినియోగించుకునేలా పవన విద్యుత్‌ను ప్రవేశపెట్టింది. జీవ వైవిధ్యాన్ని కాపాడటంతో పాటుగా ప్రజలకు అటవీ జంతువుల రక్షణపై అవగాహన కల్పిస్తూ ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. తద్వారా స్థానిక గిరిజనులు, చెంచుల ప్రత్యేక శిక్షణనిస్తూ పర్యాటకుల రూపంలో జీవనోపాధిని పెంపొందిస్తోంది. చారిత్రక, వారసత్వ సంపదకు నిలయమైన మ్యూజియాల్లో అగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, కియోస్కులు, డిజిటల్ యాప్స్ సాయంతో సందర్శకులకు సులభంగా, అర్థమయ్యేలా సమాచారాన్ని అందిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ 'పర్యాటక పోలీస్ స్టేషన్లు' నెలకొల్పింది. ఇంధన శాఖ పరిధిలో అనేక రెన్యువబుల్ ఎనర్జీ, వ్యవసాయ పర్యాటకంగా మారుతున్న సేంద్రియ సాగు విధానాలు, ఆన్‌లైన్ విక్రయాల్లో ఏటికొప్పాక, కొండపల్లి కళాకృతులు, చేనేత, కలంకారి, సంస్కృతి, వారసత్వ వేదికల పునర్నిర్మాణం.. ఇలాంటి పర్యావరణ, సామాజికహిత కార్యక్రమాలతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు బాటలు వేస్తోంది. ఇవన్నీ 'టూరిజం ఫర్ టుమారో కేస్ స్టడీ'లను ఏమాత్రం తీసిపోని విధానాలు కావడం విశేషం.

మృత్యుంజయేశ్వర స్వామి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



ఆలయంలో జస్టిస్ ఎస్వీ భట్టీ

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండల కేంద్రంలోని బజారు వీధిలో వెలసిన శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్టీ (ఎస్వీ భట్టీ) గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయార్చకులు రాజశేఖర దీక్షితులు బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికింది. స్వామివారికి న్యాయమూర్తి, వారి కుటుంబీకులు ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ఆవరణంలో వెలసిన శ్రీ షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, పార్వతీదేవికి పూజలు చేశారు. ఆయనకు ఆలయాధికారులు స్వామివారి శేష వస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు.

■ తిరుమల కిటకిట..



వైకుంఠద్వార దర్శనం కోసం ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద గురువారం రాత్రికే భక్తులు బారులు తీరారు. తిరుపతి అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్స్, జీవకోన, విష్ణునివాసం, శ్రీనివాసం, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం ప్రాంతాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

తిరుపతి (అలిపిరి)

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వెలుపల జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈవో రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మరో 1.20 లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి

20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములకూ యాజమాన్య హక్కులు కల్పించే నిబంధన వీటికీ వర్తింపు

- పూర్తిస్థాయి విచారణ నిర్వహించి వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని నిర్ణయం
- జీఓ నెం. 596 జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించిన సర్కారు
- కొత్తగా ఉమ్మడి ఎల్‌పీఎంలు సృష్టించవద్దని ఆదేశాలు

సాక్షి, అమరావతి : భూములపై ఉన్న ఆంక్షలను తొలగించే క్రమంలో వైఎస్ జగన్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 2.06 లక్షల ఎకరాల చుక్కల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లుగానే మరో 1.12 లక్షల ఎకరాల అసైన్డ్ చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించనుంది. గతంలో తొలగించినవన్నీ పట్టా భూములు కావడంతో వాటిపై చుక్కల భూముల చట్టం ప్రకారం ఆంక్షలు తొలగించారు. కొత్తగా ఆంక్షలు తొలగించనున్న 1.12 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములు. వీటిని పేదలకిచ్చి 20ఏళ్లు పూర్తికావడంతో మారిన అసైన్డ్ భూముల చట్టం ప్రకారం ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తీసివేయనున్నారు. ఇందుకోసం జీఓ నెంబర్ 596ని ప్రభుత్వం జారీచేసింది. ఇందులో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంపై రెవెన్యూ యంత్రాంగానికి పూర్తి స్పష్టత ఇవ్వడంతోపాటు అసైన్డ్ చుక్కల భూములపైనా స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డుల సవరణ

వాస్తవానికి.. అసైన్డ్ భూములైన వీటిని ఆర్ఎస్ఆర్‌లో కొన్ని దశాబ్దాల క్రితం చుక్కల భూములుగా నమోదు చేశారు. ఇప్పుడా భూములను వీఆర్ఓ లాగిన్‌కు పంపి వాటిని ప్రభుత్వం ఏ సంవత్సరం రైతులకు కేటాయించిందో ఎంటర్ చేయించాలని జీఓలో పేర్కొన్నారు. ఆ తర్వాత తహశీల్దార్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ వాటిని పరిశీలిస్తారు. ఈ భూములకు అసైన్డ్ భూముల సవరణ చట్టం 35 ఆఫ్ 2023 ప్రకారం యాజమాన్య హక్కులు కల్పించేందుకు అర్హమైనవిగా గుర్తించేందుకు సీసీఎల్ఏ ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డులను సవరిస్తారు. అప్పుడు అవన్నీ యాజమాన్య హక్కుల కల్పనకు వీలుగా మారతాయి. అనంతరం.. ఆ రికార్డులను తహశీల్దార్లకు పంపి ఎలక్ట్రానిక్ సంతకాలు తీసుకుని హక్కులు కల్పించాలని జీఓలో పేర్కొన్నారు. ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి తొలగించిన 2.06 లక్షల ఎకరాల చుక్కల పట్టా భూములు ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూములుగా కనబడేలా చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.

ఈనాం భూములపైనా..

అలాగే, నిషేధిత జాబితా నుండి తొలగించిన గ్రామ సర్వీస్ ఇనామ్ భూములు కూడా వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో పూర్తి పట్టా భూములుగా కనపడేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వాటిని 22ఏ జాబితా నుంచి తొలగించినట్లు ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డును సవరిస్తారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎక్కడా ఉమ్మడి ఎల్‌పీఎంలు (ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లు) సృష్టించకూడదని ఈ జీఓలో స్పష్టం చేశారు. ఎక్కడైనా రైతులు, సంఘాలు ఉమ్మడి ఎల్‌పీఎంల కోసం అభ్యర్థిస్తే తహశీల్దార్లు వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి వాటి ఆమోదం కోసం ఆర్డీఓలకు పంపాలి. ఉమ్మడి ఎల్‌పీఎంలను విభజించాలని అభ్యర్థనలు వస్తే నిబంధనల ప్రకారం ఆ పని పూర్తిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అలాగే, తనఖాలో ఉన్న భూములు యాజమాన్య హక్కుల కల్పనకు అర్హత కలిగి ఉంటే కేవలం తనఖాలో పెట్టారనే కారణంతో వాటిని తిరస్కరించకూడదు. యాజమాన్య హక్కులు కల్పించిన వెంటనే వాటిని 22ఏ జాబితా నుంచి తొలగించాలి. ఇక గతంలో జారీచేసిన తాత్కాలిక పట్టా భూములు యాక్ట్–35 ఆఫ్ 2023 (అసైన్డ్ భూముల సవరణ చట్టం) ప్రకారం యాజమాన్య హక్కుల కల్పనకు అర్హమైనవైతే, అవి రెగ్యులర్‌గా జారీ అయిన డీకేటీ పట్టాలు కాకపోయినా నిబంధనల ప్రకారం వాటికి హక్కులు కల్పించాలని నిర్ణయించారు.

మూడు రోజుల్లోనే విత్తనం

సకాలంలో స్పందించిన ప్రభుత్వం • ఆర్బీకేల్లో అందుబాటులో విత్తనం • సీజన్‌ను కాపాడుకోగలిగామని రైతుల్లో ఆనందం

సాక్షి, అమరావతి: వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ పంట సాగు చేయలేని అన్నదాతలు ముందస్తు రబీకి వెళ్లాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ విత్తనాలతో పంటలు వేసుకున్నారు. ఇంతలో మిచాంగ్ తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలు ఒకింత ఆందోళనకు గురి చేశాయి. అసలే ఖరీఫ్ సాగు లేక.. ముందస్తు రబీలో విత్తుకున్న పంటలు ముంపునకు గురికావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి ప్రభుత్వ నిర్ణయం వారికి ఎంతగానో సాంత్వన చేకూర్చింది. భారీ వర్షాలు తెరిపిచ్చిన తరువాత మూడు రోజుల్లో కావాల్సిన విత్తనాన్ని ఆర్బీకేల ద్వారా సరఫరా చేయడంతో క్షణం ఆలస్యం చేయకుండా రెండోసారి విత్తుకోగలిగారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా అదును దాటిపోయి సీజన్ నష్టపోవాల్సి వచ్చేది. అలాంటిది సకాలంలో విత్తనాన్ని అందుబాటులో ఉంచడం అన్నదాతలకు కొండంత ఊరటనిచ్చింది.

సీజన్‌లో రెండుసార్లు 80 శాతం సబ్సిడీపై..

ఖరీఫ్ సీజన్‌లో 25 శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సీజన్‌లో 5.73 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధం చేయగా, 7.32 లక్షల మంది రైతులకు 5.14 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాన్ని 25 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పడిన బెట్ట పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద 80 శాతం సబ్సిడీపై 30 వేల క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేశారు. ముందస్తు రబీ కోసం సిద్ధమైన రైతుల కోసం 40 శాతం సబ్సిడీపై ఆర్బీకేల్లో 3.78 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధం చేయగా, 2.50 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. ఇలా ఖరీఫ్‌లో తొలుత 25 శాతం, రెండోసారి 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసిన ప్రభుత్వం ముందస్తు రబీ కోసం సిద్ధమైన వేళ 40 శాతం సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేసింది. రబీ సాగు లక్ష్యం 55.96 లక్షల ఎకరాలు కాగా, తుపాన్ ప్రభావానికి గురయ్యే సమయానికి సుమారు 11.12 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఈ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలతో కొన్ని జిల్లాల్లో నారుమళ్లు, మరికొన్ని చోట్ల నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

16 జిల్లాల్లో 85,645 క్వింటాళ్ల విత్తనం

తుపాను ప్రభావిత జిల్లాల్లో రైతులు ఏ విత్తనం కోరుకుంటే ఆ విత్తనం 80 శాతం సబ్సిడీపై అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆఘమేఘాల మీద అప్రమత్తమైన వ్యవసాయ శాఖ అధికారులు 86,645 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని, వీటిని 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు రూ.65 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను సిద్ధం చేసి కేవలం మూడు రోజుల్లో ఆర్బీకేల్లో సిద్ధం చేశారు.

ఆర్బీకేల ద్వారా 35,651 క్వింటాళ్ల విత్తనం

ఇప్పటి వరకు వరి, శనగ, వేరుశనగ, అపరాలు, పచ్చిరొట్ట, నువ్వులు, ఉలవ పంటలకు సంబంధించి 35,651 విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేశారు. ఇప్పటికే తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విత్తన పంపిణీ పూర్తి కాగా.. మిగిలిన జిల్లాల్లో చురుగ్గా సాగుతోంది. ఇప్పటివరకు 17,311 క్వింటాళ్ల వరి, 15,080 క్వింటాళ్ల శనగ, 2,446 క్వింటాళ్ల వేరుశనగ, 1,850 క్వింటాళ్ల మినుము 632 క్వింటాళ్ల పెసలు, 10 క్వింటాళ్ల నువ్వులు, రెండు క్వింటాళ్ల రాగుల విత్తనాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. ఇక జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా నెల్లూరులో 11,032 క్వింటాళ్లు, పల్నాడులో 8 వేల క్వింటాళ్లు, తిరుపతిలో 5,702 క్వింటాళ్లు, బాపట్లలో 3 వేల క్వింటాళ్లు, గుంటూరులో 2,500 క్వింటాళ్లు, కృష్ణాలో 1,950 క్వింటాళ్లు, ఏలూరు జిల్లాలో 1,318 క్వింటాళ్ల చొప్పున, ఇతర జిల్లాల్లో మరో 2,149 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు.

అదును దాటకుండా విత్తుకోగలిగా..



తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతింది. వర్షాలు తగ్గిన మూడో రోజుకే మా ఆర్బీకేలో 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉంచారు. నేను సబ్సిడీపై కిలో రూ.22.50లకు పెసలు, రూ.27.50కి మినుములు తీసుకున్నా. రెండోసారి విత్తుకున్నా. ప్రస్తుతం పంట ఏపుగా ఎదుగుతోంది. దెబ్బతిన్న పంటకు పంట నష్టపరిహారం కూడా రాశారు. గతంలో ఎప్పుడూ ఇంత వేగంగా ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవు. సకాలంలో విత్తనాలు ఇవ్వడంతో అదును దాటిపోకుండా విత్తుకోగలిగాను. చాలా సంతోషంగా ఉంది.

– జి.సాంబశివరావు, మల్కాపురం, ఏలూరు జిల్లా

చాలా ఆనందంగా ఉంది



రబీలో నాలుగు ఎకరాల్లో మినుము పంట వేశా. 10 రోజుల్లోనే తుపాన్ దెబ్బకు పూర్తిగా ముంపునకు గురైంది. ఎందుకూ పనికిరాకుండా పోయింది. కేవలం రెండ్రోజుల్లోనే విత్తనాలు ఆర్బీకేలో సిద్ధం చేశారు. నేను 80 శాతం సబ్సిడీపై విత్తనాలు తీసుకుని మళ్లీ పంటను వేసుకున్నా. చాలా ఆనందంగా ఉంది.

– నాగదేసి జోజి, మంతెన, కృష్ణా జిల్లా

సమృద్ధిగా విత్తన నిల్వలు



సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మిచాంగ్ తుపాను ప్రభావిత జిల్లాల్లో 80 శాతం సబ్సిడీపై విత్తన సరఫరా చేస్తున్నాం. 86,645 క్వింటాళ్ల విత్తనం కోసం ఇండెంట్ రాగా, ఇప్పటికే 35,651 క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధం చేశాం. 30 వేల క్వింటాళ్ల విత్తనం వరకు రైతులు తీసుకున్నారు. మిగిలిన విత్తనాన్ని కూడా సిద్ధం చేస్తున్నాం. రైతులకు ఏ విత్తనం కావాలన్నా సిద్ధంగా ఉంది. ఆర్బీకేలో వివరాలు నమోదు చేస్తే చాలు 24 గంటల్లో అందిస్తాం..

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోని పోలీసులకు స్పెషల్ అలవెన్స్

సాక్షి, అమరావతి: రాష్ట్ర పోలీస్ శాఖలోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్, యాంటీ నక్సలైట్ స్క్వాడ్స్(ఏఎన్ఎస్)లో పనిచేసే పోలీసులకు స్పెషల్ అలవెన్స్‌లకు అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, ఆర్ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, కుక్‌లకు బేసిక్ మీద 15 శాతం చొప్పున ఏఎన్ఎస్ అలవెన్స్ మంజూరు చేశారు. ఈ ఉత్తర్వులు వచ్చే జనవరి నుంచి అమలులోకి రానున్నాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విధులకు డిప్లాయ్ చేసిన రోజు నుంచి అలవెన్స్‌లు చెల్లింపులు చేపడతారు.

జనవరిలో 30వేల టిడ్కో గృహాల పంపిణీ

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి నాటికి మూడో విడత లబ్ధిదారులకు 30వేల టిడ్కో ఇళ్లను అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యం మేరకు టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలపై గురువారం టిడ్కో ఎండీ శ్రీధర్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విశాఖపట్నం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు, గుంటూరు, చిత్తూరు, కర్నూలు, విశాఖపట్నం నగరాలతోపాటు అనకాపల్లి పట్టణంలో టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్‌లో పురోగతి సాధించాలన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలతో సంప్రదించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మెప్మా, మున్సిపల్ అధికారులు, బ్యాంకులతో సంప్రదించి లబ్ధిదారులకు రుణసదుపాయం కల్పించాలన్నారు. ఇప్పటికే విజయనగరం, ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కర్నూలు, విశాఖపట్నం జిల్లాల్లో 85వేల గృహాలను లబ్ధిదారులకు అందించామని వివరించారు. ఆయా గృహ సముదాయాల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్



టిడ్కో ఎండీ శ్రీధర్‌తో కలిసి సమీక్షా సమావేశంలో పాల్గొన్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

అసోసియేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతిపై చర్చించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ గోపాల కృష్ణమూర్తి, టిడ్కో డైరెక్టర్‌లు నాగేశ్వరమ్మ, మరియన్న, నవరత్నాలు నోడల్ ఆఫీసర్ విజయకుమార్, జనరల్ మేనేజర్ జి.హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

సంక్రాంతి సీజన్‌లో ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి 29 వరకు ప్రతి సోమవారం పూర్ణ–తిరుపతి (07609), జనవరి 2 నుంచి 30 వరకు ప్రతి మంగళవారం తిరుపతి–పూర్ణ (07610), జనవరి 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం హైదరాబాద్–నర్సాపూర్ (07631), జనవరి 7 నుంచి 28 వరకు ప్రతి ఆదివారం నర్సాపూర్–హైదరాబాద్ (07632), ఈనెల 7 నుంచి 28 వరకు ప్రతి ఆదివారం తిరుపతి–సికింద్రాబాద్ (07481), జనవరి 8 నుంచి 29 వరకు ప్రతి సోమవారం సికింద్రాబాద్–తిరుపతి (07482), జనవరి 1 నుంచి 31 వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో కాకినాడ పోర్టు–లింగంపల్లి (07445), జనవరి 2 నుంచి ఫిబ్రవరి 1 వరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో లింగంపల్లి–కాకినాడ టౌన్ (07446) రైళ్లను నడపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 22-12-2023



ఫ్యాషన్

సిగలో నక్షత్రాలు



విరిసిన పువ్వులే కాదు... మెరిసే నక్షత్రాలు...
ఎగిరే సీతాకోక చిలుకలు...
తలకట్టులో చేరి సందడి చేస్తే...
ఏ వేడుకైనా ప్రత్యేకంగా నిలిచిపోవాల్సిందే.



కేశాలంకరణలో జ్యువెలరీ ఎప్పుడూ స్పెషల్ అట్రాక్షన్‌గానే నిలుస్తుంది. దీనికి తగినట్టు డిజైనర్లు బంగారు, డైమండ్ జ్యువెలరీతో పోటీపడుతూ ఇతర లోహాలతోనూ తయారు చేస్తున్నారు. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తున్నారు.

హెయిర్ ఫాయిలింగ్

గ్లిట్టర్ మెరుపులు కేశాలంకరణకు ఉపయోగించేవారు గతంలో. ఇప్పుడు సిల్వర్, గోల్డ్ ఫాయిల్ పేపర్స్‌తో కేశాలంకరణలో మెరుపులు తీసుకువస్తున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్ పార్టీలకు యువత ఫాయిలింగ్ మెరుపును కొత్తగా జోడిస్తున్నాయి.

కొప్పు కొప్పుకో తీరు

గోల్డెన్ కలర్ ఫ్లవర్స్, బటర్ ఫ్లైస్, మూన్ అండ్ స్టార్స్.. వంటివి వివిధ రకాల పరిమాణాల్లో ఉండే పిన్స్ వంటివి రూ.100 నుంచి అందుబాటులో ఉన్నాయి. డిజైన్, సెట్స్‌ను బట్టి వేల రూపాయల వరకు ఈ బాబీ పిన్స్ ధర పలుకుతున్నాయి.

నవరత్నాల వెలుగులు

బంగారు ఆభరణాలలో నవరత్నాల హంగులను చూస్తుంటాం. ఇప్పుడు ఈ అందం తలకెక్కి కొత్తగా మెరుస్తోంది. క్రిస్టల్స్, స్వరోస్కి, ఇతర స్టోన్స్ ఉన్న పిన్స్ నైట్ టైమ్ వేడుకల్లో తలలో అందంగా మెరిసిపోతున్నాయి.

పండగ కళ

క్రిస్మస్ ట్రీ థీమ్ ఏంటి?

క్రిస్మస్ కాంతులు సమీపించాయి.
బెంగళూరులో 100 అడుగుల నిటారుగా
ఇండియాలోనే ఎత్తయిన క్రిస్మస్ ట్రీ వెలిసింది.
క్రిస్మస్ వచ్చిందంటే ఇంటింటా స్త్రీలు, పిల్లలు
క్రిస్మస్ ట్రీని అలంకరించేందుకు ఉత్సాహపడతారు.
క్రిస్మస్ ట్రీని అనేక థీమ్‌లతోఅలంకరించవచ్చు.
క్రిస్మస్ ట్రీ కథనూ ఈ సారి
అనువైన థీమ్‌లను తెలుసుకుందాం.



క్రిస్మస్ అంటే ప్రపంచమంతా నక్షత్రాలు పూసే వేళ. కేకులు సువాసనలు వెదజల్లే వేళ. కానుకలు రిబ్బన్ ముక్కల్లో అందంగా ప్యాక్ అయ్యే వేళ, శాంటా కోసం పిల్లలు ఎదురు చూసే వేళ, ప్రతి ఇంట్లో క్రిస్మస్ చెట్టు చిగురించే వేళ.

ఏసుక్రీస్తు జన్మదినాన జగతి అంతా రంగులను హత్తుకుంటుంది. కురిసే మంచును కేరింతలతో కోస్తుంది. చర్చ్ గంటలు గణగణ మోగుతాయి. స్తోత్రగీతాలు హోరెత్తుతాయి. కొవ్వొత్తులు రెపరెపలాడతాయి. ప్రేమ, త్యాగం, కరుణ... మనిషిని కాపాడేవి ఇవే కదా. ఇలాంటి పర్వదినంలో అలంకరణ ఎలా మిస్ అవుతాము?

క్రిస్మస్ ట్రీ

క్రిస్మస్ వేళ ప్రతి ఇంటిపై క్రిస్మస్ స్టార్ వెలుగుతుంది. అలాగే క్రిస్మస్ చెట్టు కూడా కొలువుదీరుతుంది. జన సంస్కృతి నుంచి మెల్లగా పండుగలోకి వచ్చిన చిహ్నం ఇది. శీతల దేశాలలో శీతాకాలం కడు దుర్భరంగా ఉంటుంది. జీవేచ్ఛ అడుగంటుతుంది. అందుకని అప్పటి ప్రజలు పచ్చటి పైన్ లేదా ఫర్ చెట్టు కొమ్మలను తెచ్చి ఇంటి బయట వాటిని అలంకరించేవారు. ఇది పాజిటివ్ వైబ్రేషన్స్‌ను తెస్తుందని భావించేవారు. క్రీస్తు జన్మదినం కూడా శీతాకాలంలో వస్తుంది కాబట్టి ఈ అలంకరణ మెల్లగా ఒక దేశం నుంచి మరో దేశానికి పాకి క్రిస్మస్‌తో జత కలిసింది. క్రిస్మస్ ట్రీని సతత హరిత జీవనానికీ, జీవితేచ్ఛకూ చిహ్నంగా భావిస్తారు. పచ్చగా వర్ధిల్లమనే కామన క్రిస్మస్ ట్రీ. క్రిస్మస్ పండగనాడు ఒక చర్చిలో ఏసు ప్రభువు విగ్రహం ఎదుట అందరూ ఖరీదైన కానుకలు పెడుతుంటే ఒక పేద బాలుడు ఒక పచ్చటి మొక్కను పెట్టాడట. ఆ మొక్క వెంటనే బంగారు కాంతులీనిందట. అప్పటి నుంచి నిరాడంబరమైన ఆరాధనకు గుర్తుగా క్రిస్మస్ ట్రీ వచ్చిందని ఒక కథ.





ముఖ్యమైన రంగులు నాలుగు

క్రిస్మస్ ట్రీ అలంకరణలో నాలుగు రంగులు కనపడతాయి. తెలుపు రంగు– ఇది స్వచ్ఛతకు గుర్తు. కురిసే మంచుకు కూడా. అందుకే క్రిస్మస్ ట్రీలో పత్తిని తెల్లదనానికి ఉపయోగిస్తారు. ఎరుపు రంగు– ఇది క్రీస్తు రక్తానికి, త్యాగానికి చిహ్నం. శాంటా కూడా ఈ రంగు దుస్తులనే ధరిస్తాడు. ఆకుపచ్చ రంగు– ఇది క్రీస్తు సజీవతను గుర్తు చేస్తుంది. బంగారు రంగు– ఇది సంపదకు, మానవాళికి బహుమతిగా దక్కిన ఏసు మార్గానికి గుర్తు. ఒకప్పుడు ఫర్, పైన్ చెట్ల కొమ్మలను తెచ్చే క్రిస్మస్ ట్రీని తయారు చేసేవారు. ఆ తర్వాత చైనా నుంచి కృత్రిమ చెట్లు వచ్చాయి. కేవలం క్రిస్మస్ ట్రీల కోసమే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలలో 25 రకాల పైన్, ఫర్ చెట్లను సాగు చేస్తున్నారు. ఇవి ఆరడుగుల ఎత్తు పెరగడానికి ఎనిమిది నుంచి పన్నెండేళ్లు పడతాయి.

ఎన్నో థీమ్‌లు

సంప్రదాయ క్రిస్మస్ చెట్టును అలంకరించడంలో కొత్తదనం కోసం రకరకాల థీమ్‌లు కూడా వచ్చాయి. మన వీలును బట్టి ఆ థీమ్‌ను ఎంచుకోవచ్చు. ఇంటికి వచ్చిన వారిని ఆశ్చర్యపరచవచ్చు.

★ **అండర్ ద సీ:** అంటే గవ్వలు, జలకన్యలో, సొరచేపలు, తాబేళ్లు... ఇలాంటి రకరకాల బొమ్మలతో అలంకరించవచ్చు ★ **రెయిన్ బో:** అంటే ఇంద్రధనుస్సులోని ఏడు రంగులు ఒక్కో దొంతరగా కిందనుంచి పై వరకూ వచ్చేలా ఆయా రంగు కాగితాలను, రిబ్బన్‌లను, లేదా క్రిస్మస్ బాల్స్ లేదా బెల్స్‌ను కట్టొచ్చు ★ **ట్రావెల్:** విహారం థీమ్‌తో మీనియేచర్ బ్యాగులు, వాహనాలు, ఏరోప్లేన్‌లు, టికెట్లు, మైలు రాళ్ల బొమ్మలు.. ఇవి ఉపయోగించాలి ★ **జలపాతం:** క్రిస్మస్ ట్రీ నుంచి జలపాతాలు జారుతున్నట్టు బ్లూ రిబ్బను పాయలు పాయలుగా వేలాడగట్టాలి ★ **బెలూన్:** ఇది ఈజీ థీమ్. కొమ్మ కొమ్మకు మంచి మంచి బెలూన్లు రకరకాల సైజులవి కట్టడమే. ★ **చాక్లెట్లు:** పిల్లలను ఆకర్షించేలా క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేయాలంటే క్యాండీలు, చాకెట్లు, పిప్పరమెంట్లు, జెమ్స్ ప్యాకెట్లు... కొమ్మ కొమ్మలో దూర్చడమే. ★ **ఎర్ర పూలు:** మన దగ్గర దొరికే ఎర్రరంగు పూలు గులాబీలు కావచ్చు, చామంతులు కావచ్చు, మందారాలు కావచ్చు... వీటితో క్రిస్మస్ ట్రీని అలంకరిస్తే ఆ లుక్కే వేరు.

ఇవి కొన్ని సూచనలు. వీటిని అందుకొని మీ సొంత థీమ్‌తో ఈ క్రిస్మస్‌ను కళకళలాడించండి.
హ్యాపీ క్రిస్మస్.

● ముగ్గు ముచ్చట







ఆర్. రెడ్డి లక్ష్మి
హిందూపురం
21 చుక్కలు, 11 వచ్చేవరకు, సందు చుక్క



గడగోజు స్రవంతి
ఈదులూరు
నల్లగొండ జిల్లా
17 చుక్కలు, 8 వచ్చేవరకు, మధ్య చుక్క





బి.నారాయణమ్మ
మహబూబ్‌నగర్
24 చుక్కలు, 4 వరుసలు, 4 వచ్చేవరకు, సరిచుక్క

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

ఇంటిప్స్

- శుభ్రంగా కడిగి తుడిచిన నిమ్మకాయలకు కొద్దిగా నూనె రాసి టిష్యూ పేపర్ వేసిన బాక్స్‌లో పెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- గ్లాసు నీళ్లలో కొద్దిగా వెనిగర్ వేసి టూత్‌బ్రష్‌లను నానబెట్టాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే టూత్‌బ్రష్‌లు శుభ్రపడతాయి.
- సగ్గుబియ్యం చక్కగా నానిన తరువాత నీటిని వడగట్టి ఎయిర్ టైట్ కంటైనర్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ఇవి నాలుగైదు రోజులపాటు తాజాగా ఉంటాయి. అప్పటికప్పుడు సగ్గుబియ్యం నానపెట్టుకోకుండా ఇలా నిల్వచేసిన సగ్గుబియ్యాన్ని తీసుకుని వెంటనే కిచిడి, పాయసం, ఇడ్లీ, దోశల్లోకి వాడుకోవచ్చు.

వంటిల్లు

తీపి రుచుల క్రిస్మస్

క్రిస్మస్ అనగానే నోరూరించే కేకులు, స్వీట్లే గుర్తు వస్తాయి ఎవరికైనా...
అందుకే మీ మనసుతోపాటు నాలుక కూడా ఆ దేవుని ప్రేమంత తియ్యగా...
ఆయన ఆశీర్వాదం అంత హాయిగా రుచులతో నిండాలని...
మీ సమస్యలకు ఆ కరుణామయుడు ఇచ్చే సమాధానం అంత కమ్మగా కేకులు ఉండాలని కోరుకుంటూ మీ కోసం కొన్ని కొత్త కేకులు, స్వీట్ల తయారీ విధానాన్ని అందిస్తోంది మన వంటిల్లు.

అలహాబాదీ కేక్



కావలసినవి: మైదా – రెండు కప్పులు; పేఠా స్వీట్ – రెండు కప్పులు; గుడ్లు – ఆరు; వెనీలా ఎసెన్స్–టీస్పూను; గరం మసాలా–రెండు టీస్పూన్లు; బటర్ – రెండు కప్పులు; పంచదార – పావు కప్పు, వంటసోడా – ఒకటిన్నర టీస్పూన్లు; షాజీరా – చిటికెడు; మర్మలైడ్ జెల్లి – అరకప్పు; మిక్స్ క్యాండైడ్ ఫ్రూట్స్ – ఒకటిన్నర కప్పులు; రమ్ – రెండు కప్పులు; నెయ్యి – టీస్పూను; పంచదార (క్యారమలైజేషన్ కోసం)–ముప్పావు కప్పు; వేడినీళ్లు– అరకప్పు.

తయారీ: ● మిక్స్ క్యాండైడ్ ఫ్రూట్స్‌ను రమ్‌లో వేసి ఒకరోజంతా నానబెట్టుకోవాలి ● మరుసటిరోజు పంచదారను బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి. రంగు మారిన వెంటనే స్టవ్ ఆపేసి అరకప్పు వేడినీళ్లు పోసి కలపాలి. మరోసారి ఈ గిన్నెను మంటమీద పెట్టి పంచదార కరిగిన తరువాత దించేయాలి ● పెద్దగిన్నెలో పావుకప్పు పంచదార, బటర్ వేసి నురగ వచ్చేంత వరకు బీట్ చేయాలి ● నురగ వచ్చిన తరువాత గుడ్లసొన వేయాలి. ఒక్కో గుడ్డు సొన వేస్తూ బీట్ చేయాలి ● గుడ్లసొన చక్కగా కలిసిన తరువాత వెనీలా ఎసెన్స్, గరం మసాలా, వంట సోడా, మర్మాలేడ్ జెల్లి, షాజీరా, నానబెట్టుకున్న మిక్స్ క్యాండైడ్ ఫ్రూట్స్ వేసి బీట్ చేయాలి ● బ్యాటర్‌లో ఉండలు లేకుండా మృదువుగా మారేంత వరకు బీట్ చేసుకోవాలి ● బేకింగ్ ట్రేకు నెయ్యి రాసి, కేక్ బ్యాటర్‌ను వేయాలి ● బేకింగ్ ట్రేను అవెన్ పెట్టి 180 డిగ్రీల వద్ద అరవై నిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన అలహాబాదీ క్రిస్మస్ కేక్ రెడీ.

డెజర్ట్ బాస్కెట్



కావలసినవి: మైదా – ఒకటిన్నర కప్పులు; బటర్ – పావు కప్పు; పంచదార పొడి – రెండు టీస్పూన్లు; పాలు – అరకప్పు; ఉప్పు – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

కోకోనట్ ఫిల్లింగ్: పచ్చికొబ్బరి తురుము – ఒకటిన్నర కప్పులు; పంచదార – కప్పు; రోజ్ ఎసెన్స్ – పావు టీస్పూను; నచ్చిన ఫుడ్ కలర్స్ – నాలుగైదు చుక్కలు.

తయారీ: ● మైదాలో పంచదార పొడి, బటర్, ఉప్పు, పాలు వేసి ముద్దలా కలిపి అరగంట నానబెట్టుకోవాలి ● నానిన పిండిని చపాతీల్లా వత్తుకోవాలి. చపాతీని మౌల్డ్స్‌లో పెట్టి చిన్న సైజు కప్పు ఆకారంలో వత్తుకోవాలి ● బాస్కెట్స్ అన్నీ రెడీ అయిన తరువాత నూనెలో డీప్ ఫ్రై చేసి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో కప్పు పంచదార, అరకప్పు నీళ్లుపోసి మరిగించాలి ● పంచదార కరిగిన తరువాత పచ్చికొబ్బరి తురుము, రోజ్ ఎసెన్స్ వేసి మీడియం మంట మీద తిప్పుతూ, నీరంతా ఇగిరిపోయిన తరువాత దించేయాలి ● ఈ మిశ్రమాన్ని మూడు భాగాలుగా వేరు చేయాలి. ఒక్కో భాగంలో ఒక్కో ఫుడ్‌కలర్‌ను వేసి కలపాలి ● ఫ్రై చేసిన ఒక్కో బాస్కెట్‌లో ఒక్కో కలర్ కొబ్బరి మిశ్రమం వేసి సర్వ్ చేయాలి.

మార్ష్ మల్లోస్



కావలసినవి: పంచదార – రెండున్నర కప్పులు; పింక్ ఫుడ్‌కలర్ – ఐదుచుక్కలు; వెనీలా ఎసెన్స్ –టీస్పూను; ఉప్పు – చిటికెడు; కార్న్‌ఫ్లోర్ కలిపిన ఐసింగ్ పంచదార – మూడు టేబుల్ స్పూన్లు; జిలాటిన్ – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – టీస్పూను.

తయారీ: ● పంచదారలో అరకప్పు నీళ్లుపోసి తీగ పాకం వచ్చిన తరువాత దించేసి చల్లారనివ్వాలి ● అరకప్పు నీటిలో జిలాటిన్ వేసి నిమిషంపాటు వేడిచేసి కరిగించాలి ● చల్లారిన పాకాన్ని బీటర్‌తో బాగా కలపాలి ● ఇప్పుడే కొద్దికొద్దిగా కరిగిన జిలాటిన్ మిశ్రమం కూడా వేసి కలపాలి ● పాకం, జిలాటిన్ చక్కగా కలిసిపోయిన తరువాత వెనీలా ఎసెన్స్, ఫుడ్ కలర్ కూడా వేసి మరో మూడు నిమిషాలు కలుపుకోవాలి ● ప్లేటుకు నెయ్యి రాసి.. బీట్ చేసుకున్న మిశ్రమాన్ని పోసి గంటపాటు డీప్ ఫ్రిజ్‌లో పెట్టాలి ● గంట తరువాత గట్టిపడిన మిశ్రమం పైన ఐసింగ్ పంచదార చల్లి నచ్చిన ఆకారంలో ముక్కలుగా కట్ చేసుకుంటే మార్ష్‌మాలోస్ రెడీ.

మార్జిపాన్



కావలసినవి: బాదం పప్పు పొడి – ఒకటిన్నర కప్పులు; పంచదార పొడి – రెండు కప్పులు; బాదం ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; రోజ్ వాటర్ – టీస్పూను; ఫుడ్ కలర్స్ – నచ్చినవి ఏవైనా తీసుకోవచ్చు.

తయారీ: ● బాదం పప్పు పొడి, పంచదార పొడిని జల్లెడ పట్టుకుని పక్కన పెట్టుకోవాలి ● గిన్నెలో బాదం పప్పు పొడి, పంచదార పొడి వేసి కలపాలి ● ఇవి రెండు చక్కగా కలిసిపోయాక రోజ్ వాటర్, బాదం ఎసెన్స్ వేసి ముద్దలా మారేంత వరకు కలుపుకోవాలి. పిండి జారుగా ఉంటే కొద్దిగా బాదంపప్పు పొడి వేసి కలపాలి ● ఇలా రెడీ అయిన పిండి ముద్దను నాలుగు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగానికి ఫుడ్ కలర్ వేసి కలిపి పది నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● పదినిమిషాల తరువాత ఒక్కోకలర్ పిండి ముద్దను మౌల్డ్స్‌లో వేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే మార్జిపాన్ రెడీ.

కుల్కూస్



కావలసినవి: మైదా – కేజీ; పంచదార పొడి – అర కేజీ; సూజీ రవ్వ – పావుకేజీ; గుడ్లు – మూడు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – అరటీస్పూను; వెనీలా ఎసెన్స్ – టీస్పూను; ఫుడ్ కలర్స్ – మూడు రకాలు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, సూజీ రవ్వ, పంచదార పొడి, గుడ్ల సొనవేసి కలపాలి ● ఇప్పుడు ఉప్పు, వెనీలా ఎసెన్స్ వేసి కలపాలి. చివరిగా కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలుపుకొని మూడు గంటలు నానపెట్టుకోవాలి ● నానిన పిండిముద్దను రంగుల సంఖ్యను బట్టి మూడు నాలుగు ముద్దలుగా చేయాలి ● ఒక్కోముద్దకు ఒక్కో ఫుడ్ కలర్‌ను కొద్దిగా వేసి కలుపుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పిండి ముద్ద నుంచి కొద్దిగా పిండి తీసుకుని గవ్వల చెక్క మీద గవ్వల ఆకారంలో వత్తుకోవాలి ● అన్నీ రెడీ అయిన తరువాత డీప్ ఫ్రై చేసుకుంటే రుచికరమైన కుల్కూస్ రెడీ. వేడి వేడి కుల్కూస్ పైన పంచదార పొడి చల్లుకుని సర్వ్ చేసుకోవాలి.

(ఎవరైతే సత్కార్యాలు చేశారో) అలాంటి వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే శాశ్వత స్వర్గవనాలు ఉంటాయి. అందు వారు బంగారు కంకణాలను, ఆకుపచ్చని బంగారు జలతారు గల పట్టువస్త్రాలను ధరించి, ఎత్తైన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 22 డిసెంబర్ 2023

అయోమయంలో 'ఇండియా'

పాలకపక్షాన్ని అధికారం నుంచి దించటమే ఏకైక లక్ష్యంగా ఏర్పడిన ఇండియా కూటమి ఇప్పటికీ అయోమయాన్ని వదుల్చుకోలేకపోతున్నదని మంగళవారం జరిగిన సమావేశం రుజువుచేసింది. తాము ఎవరికి ప్రత్యామ్నాయమో, దేనిలో ప్రత్యామ్నాయమో కూటమి భాగస్వామ్య పక్షాలకు ఈనాటికీ అర్థం కాలేదని ఆ సమావేశం తీరుతెన్నులు తేటతెల్లం చేస్తున్నాయి. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాట్లాడుతుండగా ఆయన హిందీ అర్థంకాక ఇబ్బందిపడుతున్న డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు విషయంలో నితీశ్ స్పందించిన వైనం దిగ్భ్రాంతికరం. 'మీ ప్రసంగాన్ని ఆయనకు అర్థమయ్యేలా అనువాదం చేయొచ్చా?' అని అడిగిన ఆర్‌జేడీ సభ్యుడు మనోజ్ ఝాపై నితీశ్ నిప్పులు కక్కారు. పనిలో పనిగా 'హిందీ మన జాతీయ భాష. అందరి భాష. అందుకే మన దేశాన్ని హిందూస్థాన్‌గా పిలుచుకుంటాం. అది అందరికీ తెలియాల్సిందే. మీరేమీ అనువాదం చేయకండి' అన్నారట. నితీశ్ రాజకీయాల్లో కాకలు తీరిన నాయకుడు. జయప్రకాశ్ నారాయణ్ ఆధ్వర్యంలో బిహార్‌లో అవినీతికీ, అధికధరలకూ వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంలో ఎదిగి రాజకీయరంగ ప్రవేశం చేసిన వ్యక్తి. పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్నవారు. అలాంటి నాయకుడు హిందీ మన జాతీయ భాష అనుకోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశానికి ఉమ్మడి భాష అవసరమనీ, దాన్ని అందరూ నేర్చుకోవాలనీ ఉత్తరాది నాయకులు పార్టీలకు అతీతంగా చెబుతూవుంటారు. మాతృభాష కాక మరికొన్ని భాషలు నేర్చుకోవాలని చెప్పటంలో తప్పేమీ లేదు. అలా నేర్చుకోవటం వల్ల దేశంలో ఏమూలకైనా వెళ్లి జీవనం సాగించటం సులభమవుతుంది. దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు కూడా ఇది సమానంగా వర్తిస్తుంది. సివిల్స్‌లో విజేతలై దక్షిణాది రాష్ట్రాల క్యాడర్‌కు వచ్చేవారు స్థానిక భాషలు స్వల్పకాలంలోనే నేర్చుకుని అక్కడి ప్రజల మన్ననలు పొందుతున్నారు. హిందీ భాషా ప్రాంతాలనుంచీ, వేరే రాష్ట్రాలనుంచీ వస్తున్న హీరోయిన్‌లు చాలా తొందరలోనే తెలుగు భాష అర్థం చేసుకుని మాట్లాడుతున్న వైనం అందరికీ తెలుసు. కానీ హిందీ 'ఉమ్మడి భాష'గా వుండాలనీ, అది మాత్రమే దేశాన్ని ఏకం చేయగలదనీ మన నేతలు సుద్దులు చెప్పటం వింత గొలుపుతుంది. భాషాద్వేషంలాగే భాషాదురభిమానం కూడా ప్రమాదకరమేనని ఈ నేతలు గుర్తించటం లేదు.

మనకు జాతీయ భాషంటూ ఏమీ లేదు. రాజ్యాంగంలోని 343 అధికరణ ప్రకారం కేంద్ర స్థాయిలో హిందీ, ఇంగ్లిష్ అధికార భాషలు. రాష్ట్రాల్లో ఆయా ప్రాంతీయ భాషలు అధికార భాషలుగా వుంటున్నాయి. 1960 ప్రాంతంలో హిందీని బలవంతంగా రుద్దటాన్ని వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో, మరీ ముఖ్యంగా తమిళనాడులో భారీయెత్తున ఉద్యమాలు జరిగాయి. ఆ తర్వాతే 1963లో అధికార భాషల చట్టం వచ్చింది. హిందీ అధికార భాషగా లేని రాష్ట్రాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లిష్‌లో జరపాలని నిర్దేశిస్తూ 1967లో ఆ చట్టానికి సవరణ కూడా చేశారు. ఇంకా వెనక్కు వెళ్తే స్వాతంత్ర్యోద్యమ కాలంలో సైతం హిందీ భాష పెత్తనంపై తిరగబడిన దాఖలాలున్నాయి. హిందీని ఉమ్మడి భాషగా గుర్తించాలని నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించాలని పురుషోత్తందాస్ టాండన్ నేతృత్వంలో కొందరు ఉత్తరాది నాయకులు జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో ప్రయత్నించినప్పుడు నాటి ఆంధ్రప్రాంత ప్రముఖ నేత స్వర్గీయ ఎన్‌జీ రంగా గట్టిగా వ్యతిరేకించి అడ్డుకున్నారు. కేంద్రంలో పాలకపక్షంగా యూపీఏ వున్నా, ఎన్‌డీఏ వున్నా హిందీ వినియోగాన్ని పెంచటానికి శ్రమిస్తుండటం తరచు కనబడుతూనే వుంటుంది. 2008లో అప్పటి యూపీఏ సర్కారు కేంద్ర ప్రభుత్వ నియామకాల కోసం జరిపే పోటీ పరీక్షల్లో హిందీ ప్రశ్నపత్రం తప్పనిసరి చేయాలని ప్రతిపాదించినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ ప్రతిపాదన వల్ల హిందీ భాషా ప్రాంతవాసులే లబ్ధిపొందుతారనీ, దక్షిణాది వారికి అన్యాయం జరుగుతుందనీ ఆయన ఎలుగెత్తారు. తాను కాంగ్రెస్ నాయకుడే అయినా, యూపీఏకు తమ పార్టీయే నేతృత్వం వహిస్తున్నా హిందీ భాషను రుద్దాలన్న ప్రయత్నాన్ని ఆయన సాగనివ్వలేదు. ఈ చరిత్రంతా తెలుసుకోకుండా నితీశ్ ఆగ్రహించటం కూటమికి గానీ, వ్యక్తిగతంగా ఆయనకు గానీ ప్రతిష్ఠ తీసుకురాదు.

అసలు తాము ఇండియా కూటమిగా ఎందుకు ఏర్పడ్డారో, దేశంలో ఎలాంటి ప్రజాస్వామిక వాతావరణం ఏర్పర్చటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారో భాగస్వామ్య పక్షాల నేతలకు అవగాహన వుందా? ఉంటే నితీశ్ వంటి నాయకుడి నుంచి ఇలాంటి స్పందన రాదు. ఏ భాష అయినా పౌరులు ఎంతో ఇష్టంతో, ప్రేమతో నేర్చుకోవాలి. సినిమాలు, టీవీ చానెళ్ల వల్ల ఈరోజుల్లో హిందీతో సహా ఏ భాష నేర్చుకోవటమైనా ఎంతో సులభమవుతోంది. కూటమి ఏర్పడి అయిదు నెలలవుతోంది. తాజా సమావేశం నాలుగవది. సెప్టెంబర్ 14న ఢిల్లీలో సమావేశమైనప్పుడు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకం ప్రక్రియపై 'త్వరలో' చర్చించాలని తీర్మానించారు. అది కాస్తయినా ముందుకు కదల్లేదు. ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఖరారు చేద్దామన్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సూచన సమావేశంలో వీగిపోయింది. నితీశ్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ దీనిపై మండిపడగా, కాంగ్రెస్ అధినేతలు సోనియా, రాహుల్ కిక్కురుమనలేదు. దేశానికి భారత్‌గా నామకరణం చేయాలన్న ఎన్‌డీఏ ప్రతిపాదనకు నితీశ్ వంత పాడటం కూడా చాలామందికి నచ్చలేదంటున్నారు. ఇలా ఏ అంశంలోనూ ఏకాభిప్రాయానికి రాలేక, చరిత్రపై అసలే అవగాహన లేక ఇండియా కూటమి సాధించేదేమిటి?

ఇంతకన్నా మంచి మార్గాలు లేవా?

విశ్లేషణ



చక్షు రాయ్

పార్లమెంటు శీతాకాల సమావేశాలకు అంతరాయం కలిగించినందుకు గాను లోక్‌సభ, రాజ్యసభల్లో 141 మంది ప్రతిపక్ష సభ్యులు సస్పెండ్ అయ్యారు. పార్లమెంటులో ప్రతిష్టంభన కొత్తేమీ కాదు. ఈ అంతరాయాలు మన పార్లమెంటరీ వ్యవస్థలో అనేక సంవత్సరాలుగా ఉన్న విధానపరమైన స్తబ్ధత కారణంగా ఏర్పడుతున్నాయి. ఎంపీలను శిక్షించడం ద్వారా పరిష్కరించగల క్రమశిక్షణా సమస్యగానే దీన్ని చూస్తున్నారు. మన పార్లమెంటరీ వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీలకు పార్లమెంటులో తగిన స్థానం లేదు. నిర్దిష్ట సమస్యలను లేవనెత్తాలని వారు డిమాండ్ చేయవచ్చు. అయితే వాటిని అంగీకరించాలా వద్దా అన్నది ప్రభుత్వంపై ఆధారపడి ఉంది. ప్రతిపక్షం కూడా ఉభయ సభల్లో చర్చకు ఎజెండాను సిద్ధం చేసేలా విధానాల్లో మార్పు రావటం అవసరం.

పార్లమెంటరీ వ్యవస్థ పనిచేయకపోవడానికి ప్రధాన కారణం, వివాదాస్పద అంశాలపై చర్చించడానికి విధానపరమైన యంత్రాంగాలు లేకపోవడమే. ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రస్తుత ప్రతిష్టంభన ఫలితంగా ఇది కనివిని ఎరుగని పరిస్థితికి దారితీసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు అంతరాయం కలిగించినందుకు గాను లోక్‌సభ, రాజ్యసభల్లో 141 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు.

పార్లమెంటులో భద్రతా లోపంపై హోంమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. పార్లమెంటు భద్రత అనేది సున్నితమైన అంశమనేది ప్రభుత్వ వైఖరి. ఇది లోక్‌సభ సెక్రటేరియట్ పరిధిలోకి వస్తుంది. స్పీకర్ ఓం బిర్లా ఆదేశాలను ప్రభుత్వం అనుసరిస్తుంది. దీనిపై ఉన్నతస్థాయి కమిటీ విచారిస్తోందని సభకు స్పీకర్ తెలియజేశారు. అఖిలపక్ష సమావేశంలో వచ్చిన కొన్ని సూచనలను అమలు చేశారు.

పార్లమెంటులో ప్రతిష్టంభన కొత్తేమీ కాదు. మన పార్లమెంటులో రాజకీయ పార్టీ/కూటమి పాత్రతో సంబంధం లేకుండా, చాలా సంవత్సరాలుగా ఒక సుపరిచిత కథనం వినిపిస్తోంది. ప్రతిపక్షాలు ఒక ముఖ్యమైన అంశంపై చర్చకు డిమాండ్ చేస్తున్నాయి కానీ ప్రభుత్వం తప్పించుకుంటోంది. నిజానికి ఈ రోజు మనం చూస్తున్న అంతరాయాలు, క్రమశిక్షణా ప్రతిస్పందనలు... మన పార్లమెంటరీ వ్యవస్థలో అనేక సంవత్సరాలుగా ఉన్న విధానపరమైన స్తబ్ధత కారణంగా ఏర్పడుతున్నాయి.

ఎంపీలు మన పార్లమెంటరీ కార్యక్రమాలకు అంతరాయం కలిగించడం 1960వ దశకంలో మొదలైంది. తాము ముఖ్యమైనవిగా భావించిన అంశాలను ప్రముఖంగా ప్రస్తావించడానికి సభాపతి తమకు తగిన అవకాశం ఇవ్వడం లేదని భావించిన కొందరు ఎంపీలు ఈ పనిలోకి దిగారు. మూడవ లోక్‌సభ (1962–67) సభ్యులు రామ్ సేవక్ యాదవ్, మనీరామ్ బాగ్రీ వంటి ఎంపీలు పార్లమెంటరీ నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పీకర్ పదేపదే హెచ్చరించేవారు. వివిధ సందర్భాల్లో పదేపదే అంతరాయం కలిగించడంతో సభ నుండి వారిని ఏడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. లోక్‌సభ తన కార్యకలాపాల నుండి మినహాయించిన మొదటి పార్లమెంటేరియన్‌లు వారే కావచ్చు. మూడవ లోక్‌సభ తన పదవీకాలం ముగిసే సమయానికి, ఏకంగా ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేసింది. మన పార్లమెంటరీ చర్చలలో అంతరాయాలు ఆనవాయితీగా మారబోతున్నాయని ఇది సూచించింది. అప్పటి నుండి, ఎంపీలు పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఘటనలు, దాని కోసం క్రమశిక్షణకు గురైన సందర్భాలు చాలా ఉన్నాయి.

కానీ కాలక్రమేణా, పార్లమెంటరీ అంతరాయాలు నెమ్మదిగా రాజకీయ సాధనంగా మారాయి. ఈ మారుతున్న ధోరణి గురించి



పలువురు సభాపతులు నొక్కి చెప్పారు. 'చాలా సందర్భాలలో, సభా కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. అవి యాదృచ్ఛికంగా జరగలేదు. ఉద్దేశపూర్వకంగా అరుస్తూ, సభ వెల్‌లోకి ప్రవేశించడం ద్వారా కార్యకలాపాలను నిలిపివేయడం, పార్లమెంటు పనిచేయడానికి అనుమతించకూడదనే ఉద్దేశమే ఇక్కడ కనబడుతోంది' అన్నారు 14వ లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ.

కానీ మన పార్లమెంటరీ వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీలకు పార్లమెంటులో తగిన స్థానం లేదు. నిర్దిష్ట సమస్యలను లేవనెత్తాలని వారు సూచించవచ్చు, డిమాండ్ చేయవచ్చు. అయితే వాటిని అంగీకరించాలా వద్దా అన్నది ప్రభుత్వంపై ఆధారపడి ఉంది. పైగా సమస్యంతా అందులోనే ఉంది. ప్రతిపక్ష ఎంపీలు సభలో మాట్లాడలేకపోతే, అది నిరంతరం అంతరాయాలకు దారి తీస్తుంది. ఇప్పటివరకు, సంస్థాగత ప్రతిస్పందన ఏమిటంటే, అంతరాయం కలిగించే ఎంపీలను శిక్షించడమే. కానీ ఇటీవలి సంఘటనలు చూపించినట్లుగా, ఈ విధానం పనిచేయనిదిగా మారింది.

పైగా, అంతరాయానికి చెందిన స్వభావం క్రమంగా పరిణామం చెందినప్పటికీ, పార్లమెంట్ సంస్థాగత ప్రతిస్పందన సరళంగానే ఉంటూ వచ్చింది. ఏమాత్రం మారలేదు. ఎంపీలను శిక్షించడం ద్వారా పరిష్కరించగల క్రమశిక్షణా సమస్యగానే ఇది ఇప్పటికీ అంతరాయాలను చూస్తుంది. సమస్యలో కొంత భాగం పార్లమెంటును మనం చూసే విధానంలో కూడా ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు మన జాతీయ శాసన సభను ప్రభుత్వ వ్యవహారాల కోసం ఉద్దేశించిన ఒక సంస్థగా రూపొందించారు. రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటును సమావేశపరిచే అధికారాన్ని ప్రభుత్వానికి ఇచ్చారు. పార్లమెంటరీ ప్రక్రియ నియమాలు ఈ ఆలోచనా విధానాన్ని బలపరిచాయి. ఈ నియమాలు స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ మూసపై ఆధారపడి ఉన్నాయి. వలస ప్రభుత్వ వ్యవహారాలకు ప్రాధాన్యత ఉండేలా చూడటం వారి ఉద్దేశం. ఈ భావనకు అదనంగా, వెస్ట్‌మినిస్టర్ పార్లమెంటరీ సూత్రం ప్రకారం, పార్లమెంటును సజావుగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత.

దేశంలో అత్యున్నతమైన శాసన నిర్మాణం, జవాబుదారీతనం ఉన్న ప్రాతినిధ్య సంస్థను చూసే లోపభూయిష్ఠ మార్గం ఇది. ఇది పార్లమెంట్ ఎజెండాను నిర్ణయించే అధికారాన్ని, దానిలో ఏయే అంశాలు చర్చకు వస్తాయో నియంత్రించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తుంది. నిజానికి చట్టసభలు అనేవి సహకార స్థలాలు. ఇక్కడ ఖజానా(ప్రభుత్వం), ప్రతిపక్షాలు రెండూ కలిసి దేశానికి మంచి ఫలితం కోసం పని చేయాలి. ఎన్నికైన ప్రభుత్వ పాత్ర ఏమిటంటే శాసన, ఆర్థికపరమైన ప్రాధాన్యతలను నిర్ణయించడం. ప్రతిపక్షాల బాధ్యత ఆ ఆలోచనలను వ్యతిరేకించడం లేదా ప్రత్యామ్నాయాలను సూచించడం, అంతరాలను ఎత్తి చూపడం ద్వారా వాటిని బలోపేతం చేయడం. ఈ విధానం ఇప్పుడు ఆచరణ సాధ్యం కానిదిగా మారింది. సభను నడపటం సభాపతికి సాధ్యం కాదని 2005లో స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ వ్యాఖ్యానించారు. 'సభ్యుల సమూహం సభలను నడపనివ్వకుండా మొండిగా వ్యవహరిస్తే, దానిని నియంత్రించడం చాలా కష్టం.'

పార్లమెంటు సమర్థవంతంగా పనిచేయాలంటే ఎంపీలను శిక్షించడం సరిపోదు. ప్రతిపక్షం కూడా ఉభయ సభల్లో చర్చకు ఎజెండాను సిద్ధం చేసేలా విధానాల్లో మార్పు రావటం అవసరం. ప్రస్తుతం, ముఖ్యమైన శాసనపరమైన, విధానపరమైన అంశాలను చర్చించడానికి ప్రైవేట్ సభ్యులకు మాత్రమే ప్రతి శుక్రవారం రెండున్నర గంటల సమయం లభిస్తుంది. అయితే, పార్లమెంటులో నిర్దిష్ట చర్చ జరగాలని ఎంపీల బృందం కోరే యంత్రాంగం లేదు. చర్చను బలవంతం చేయడానికి వారికి అందుబాటులో ఉన్న ఏకైక మార్గం, అవిశ్వాస తీర్మానమే. బహుశా, పార్లమెంటు సమావేశాల క్యాలెండర్‌లో ప్రతిపక్షాల కోసం నిర్దిష్ట రోజులను చేర్చడం గురించి ఆలోచించాల్సిన సమయం ఇది. హౌస్ ఆఫ్ కామన్స్ లాగా, ప్రతిపక్షాలు ముఖ్యమైనవిగా భావించే సమస్యలపై చర్చించడానికి ఈ రోజులను కేటాయించవచ్చు.

పార్లమెంటులో ఇటీవలి అంతరాయాలు, చాలామంది ఎంపీల సామూహిక సస్పెన్షన్ మన జాతీయ శాసనసభకు మేల్కొలుపు పిలుపు అనే చెప్పాలి. అత్యున్నత చర్చా వేదికగా పార్లమెంటు ఖ్యాతి ప్రమాదంలో ఉందని ఈ సంఘటనలు నొక్కి చెబుతాయి. చర్చను పెంపొందించడానికి పార్లమెంటు మెరుగైన పరిష్కారాలను కనుగొనవలసి ఉంటుంది. లేదంటే దానిపై ప్రజల విశ్వాసం నెమ్మదిగా క్షీణించే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్‌లో పనిచేస్తున్నారు.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వన్ చైనా



గత పది రోజులుగా చైనాలో ఉన్నా. కొన్ని కంపెనీలను సందర్శించాం. మేము ఉత్తరాది నుంచి దక్షిణాదికి ప్రయాణించాం; ఒక్కో నగరంలో ఒక రోజు ఉంటూ. వెళ్లేకొద్దీ వారి ఆహార అలవాట్లు మారుతాయి. కానీ ఆతిథ్యం, కష్టపడే తీరు, క్రమశిక్షణ మాత్రం దేశమంతా ఒకేలా ఉన్నాయి.

– రాహుల్ రాజ్, వ్యాపారవేత్త

నాన్నతో అమ్మ



నా అందమైన అమ్మ నర్గీస్ తాపాల్ ఫతాహ్ వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ప్రేమ, సమక్షంలో ప్రశాంతంగా పోయింది. నియమబద్ధంగా, వివేకంగా జీవితం గడిపిన మా అమ్మ, డార్లింగ్ డాడ్ తారెక్ ఫతాహ్ (యాక్టివిస్ట్; 2023 ఏప్రిల్ 24న మరణించారు)ను తిరిగి కలుసుకుంది.

– నటాషా ఫతాహ్, జర్నలిస్ట్

మరో సవాలు



రాజ్యసభలో టెలికామ్ చట్టం ఆమోదం పొందితే, దాన్ని నా లా సహచరులతో కలిసి సుప్రీంకోర్టులో సవాలు చేస్తాను. ఇది పెగసస్‌ను చట్టబద్ధం చేయడమే. మోదీ ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికలు అయ్యేవరకైనా వేచివుండాలని సూచిస్తున్నా.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

దేశం ఉండొద్దా?



యూదులకంటూ ఒక సొంత దేశం ఉండే హక్కు ఉండటమే జియోనిజం. అయితే నేను నూరు శాతం జియోనిస్టునే. ఎవరైనా జియోనిస్టు కాకుండా ఎలా ఉంటారు? ముస్లింలు, క్రైస్తవులకు కలిపి నూటికి పైగా దేశాలున్నాయి. యూదులకు కనీసం ఒక్క దేశం అయినా ఎందుకుండొద్దు?

– లుయీ అహ్మద్, యాక్టివిస్ట్

అదే గర్వం




అవును, నేను గర్వపు హిందువునే. ఒక గర్వపు క్రైస్తవుడిని పెళ్లాడిన గర్వపు హిందువును. అన్ని పండుగలూ గర్వంగా జరుపుకొంటాం. అన్ని మతాలూ, సంస్కృతులనూ గర్వంగా ఆదరిస్తాం.

– సెలీనా జైట్లీ, నటి

అపర చాణక్యుడు

స్థిత ప్రజ్ఞుడు, సంస్కరణ శీలి, న్యాయ శాస్త్రజ్ఞుడు, బహు భాషా కోవిదుడు, సాహిత్య సుగంధాలను వెదజల్లిన వాడు, మన తెలుగు బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు అపరచాణక్యుడిగా పేరుపొందారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పినప్పుడు ప్రధానమంత్రిత్వ పగ్గాలు చేపట్టి ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దిన ధీశాలి. 1921 జూన్ 28న జన్మించారు. 1938లో నిజాం రాష్ట్ర వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని, స్వరాష్ట్రంలో చదువుకు దూరమయ్యారు. మహారాష్ట్రలోని పూణేలో బీఎస్సీ పూర్తిచేసి నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ పట్టా పొందారు.



పీవీ నరసింహారావు

1948లో 'కాకతీయ' పత్రికను స్థాపించి తొలితరం పత్రికా రచయితగా ప్రసిద్ధికెక్కారు. 'జయ' అనే పేరుతో అనేక రచనలు చేశారు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'వేయి పడగలు' నవలను హిందీలోకి 'సహస్రఫణ్' పేరుతో అనువదించారు. ఈ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ఆయన స్వీయ చరిత్ర 'ఇన్‌సైడర్'(లోపలి మనిషి) విశేష ప్రాచుర్యం పొందింది.

పీవీ రాజకీయ ప్రస్థానం ఓటమితో ప్రారంభమైంది. 1952 ఎన్నికల్లో ఓడిపోయారు. 1957 నుండి 1972 వరకు నాలుగుసార్లు మంథని శాసనసభ నియోజకవర్గం నుండి విజయకేతనం ఎగురవేశారు. 1962లో రాష్ట్ర జైళ్లు, ప్రజా సంబంధాలు, విద్యాశాఖ, ఆరోగ్యశాఖల మంత్రిగా పనిచేశారు. ఆయా శాఖల్లో పలు సంస్కరణలు చేపట్టి అందరి మెప్పు పొందారు. మూడవసారి శాసనసభకు గెలిచినప్పుడు ముఖ్యమంత్రి పదవి అలంకరించారు. ఈ సమయములోనే భూ సంస్కరణలు అమలుపరిచేందుకు చర్యలు చేపట్టారు.

1977లో కేంద్ర రాజకీయాలలో ప్రవేశించారు. హనుమకొండ నుండి లోక్ సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇందిరా గాంధీకి అత్యంత విశ్వసనీయుడిగా ఉంటూ హోం శాఖ, విదేశాంగ శాఖల మంత్రిగా పనిచేశారు. 1984లో హనుమకొండ నుండి ఓటమిపాలైనా, మహారాష్ట్రలోని రామ్ టెక్ నియోజకవర్గం నుండి విజయం సాధించారు. రాజీవ్ గాంధీ మంత్రివర్గంలో మానవ వనరుల శాఖ, హోం శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1991లో జరిగిన ఎన్నికల తరువాత దేశ రాజకీయాలలో ఒక అనిశ్చితి ఏర్పడినప్పుడు తన రాజకీయ చతురతతో మిత్రపక్షాల మద్దతు కూడగట్టి ప్రధానమంత్రిగా మైనార్టీ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపారు. సంక్షోభ సమయంలో సరళీకరణ విధానాలను అవలంబించి దేశ ఆర్థిక వ్యవస్థను ఒడ్డుకు చేర్చిన అసమాన్యుడు. దేశ విదేశ నాయకుల మెప్పుపొందిన పీవీ 2004 డిసెంబర్ 23న గుండె పోటుతో ఈ లోకం విడిచారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన సేవలు మనకు సదా స్మరణీయాలు.

– జాధవ్ పుండలిక్ రావు పాటిల్
ట్రస్మా గౌరవ అధ్యక్షుడు, భైంసా డివిజన్

రుణాలపై తప్పుడు ప్రచారం రాష్ట్రానికి చేటు!

అభిప్రాయం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

'నేటి ప్రపంచానికి ఫేక్ న్యూస్ అతి పెద్ద బెడదగా మారింది. తప్పుడు వార్తా ప్రచారకర్తల ముఖ్యోద్దేశ్యం మన ఆలోచనలు కలుషితం చేసి మనం తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా చేయడం...' అంటారు సీఎన్ఎన్ న్యూస్ ప్రెజెంటర్ క్రిస్టియానె అమన్‌పౌర్. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక వర్గం మీడియా తప్పుడు ప్రచారాన్నే తమ ప్రధాన అస్త్రంగా చేసుకుని ప్రజలు వాస్తవాలను గుర్తించకుండా వారి ఆలోచనా శక్తిని నాశనం చేసే ప్రయత్నాన్ని ఉద్యమ రూపంలో చేస్తోంది. 'వారు హిట్లర్ విధానాన్నే అనుసరిస్తారు... అబద్ధం ఎంత పెద్దదైనా దాన్ని పదేపదే ప్రచారం చేసి ప్రజలు నిజమనుకునే విధంగా చేస్తారు' అని జాన్ ఎఫ్. కెనడీ అన్నట్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆ వర్గం మీడియా అబద్ధాలను నిర్భయంగా పదే పదే ప్రచారం చేస్తోంది. దానికి తాజా ఉదాహరణ ఆంధ్రప్రదేశ్ అప్పులపై రాసిన రాతలు. రాష్ట్రానికి అప్పులు కేవలం రూ. 4.45 లక్షల కోట్లేనని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో పలుమార్లు ప్రకటించింది. కాని, ఆ వర్గం మీడియా, ఆ మీడియాకు పరోక్ష యజమానులుగా ఉన్న ఆయా రాజకీయ నాయకులు మాత్రం ఈ అప్పులు రూ. 11 లక్షల కోట్లుగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను పెడత్రోవ పట్టిస్తున్నారు.

2021 జనవరి 3న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికలో 2020 నవంబర్ నాటికి ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పులు రూ. 3.73 లక్షల కోట్లు మాత్రమే నని పేర్కొంది. బిజినెస్ లైన్ పత్రిక 2022 మార్చి 13న ప్రచురించిన కథనం ప్రకారం ఏపీ మొత్తం అప్పులు రూ. 3.89 లక్షల కోట్లు. 2023 ఆగస్టు 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీకి రూ. 4, 42, 442 కోట్ల రుణాలు మాత్రమే ఉన్నాయని ప్రకటించారు. 2023 ఫిబ్రవరి 7న, టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధాన మిస్తూ రాష్ట్ర మొత్తం రుణాలు రూ. 4.42 లక్షల కోట్లని ధృవీకరించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర కూడా 2023 నవంబర్ 3న ఇదే గణాంకాన్ని చెబుతూ, 2014–19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రుణాల పెరుగుదల శాతం 19.55 ఉంటే అది 2019- 23 మధ్య 15.46 శాతం మాత్ర మేనని చెప్పారు.

జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విచ్చలవిడిగా రుణాలు చేస్తోందని కానీ, వాటిని దుర్వినియోగం చేస్తోందని కానీ ఇప్పటి వరకూ ఏ కేంద్ర ప్రభుత్వ సంస్థ చెప్పలేదు. కాని, ఒక వర్గం మీడియాతో పాటు ప్రధాన



ప్రతి పక్షాలు గోరంతను కొండంతగా చేస్తూ, రాష్ట్రం రుణాల ఊబిలో కూరుకుపోయిందని నానా యాగీ చేస్తున్నాయి. అయితే ఈ తప్పుడు ప్రచారంలో ఆయా పార్టీలు, పత్రికలు పొంతన లేని లెక్కలు చెబుతుండడం విశేషం. 2023, ఫిబ్రవరి 14 నాటి ఈనాడు కథనం ప్రకారం ఆర్బీఐ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం రూ. 4.65 లక్షల కోట్లు రుణాలు చేసిందట. అయితే డిసెంబర్ 19 నాటి కథనం ప్రకారం ఈ రుణాలను ఆ పత్రిక రూ. 3.76 లక్షల కోట్లకు తగ్గించింది. అయితే అనధికారికంగా మరో ఆరు లక్షల కోట్ల రూపాయల మేరకు రుణాలు రాష్ట్ర ప్రభుత్వం చేసిందనేది ఆ పత్రిక అభియోగం. ఈ పత్రిక లాగే ప్రతిపక్ష నేతలు కూడా పొంతన లేని గణాంకాలు ఇస్తూ ప్రజలను తప్పుత్రోవ పట్టించే పనిలో నిమగ్నమయ్యారు.

మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఈ ఏడాది మార్చి 27న ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర అప్పుల మొత్తాన్నీ తన చిత్తానుసారం రూ. 12.50 లక్షల కోట్లకు పెంచేశారు. అయితే దీనికి భిన్నంగా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఎన్. విజయ్ కుమార్ గత నవంబర్ ఆరో తేదీన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ ఏపీ అప్పులను రూ. 7.35 లక్షల కోట్లుగా తేల్చారు. దీనిలో రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతితో చేసిన రుణాలు రూ. 2.17 లక్షల కోట్లని చెప్పారు.

ఆ తర్వాత రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రహసనం ప్రారంభమైంది. మొదట ఆమె 2023 జులై 19న మాట్లాడుతూ ఏపీ నాలుగేళ్ళుగా రూ. 7.14 లక్షల కోట్ల రుణాలు చేసిందన్నారు. అయితే అనూహ్యంగా 2023 అక్టోబర్ 25 నాటికి ఈ రుణాలను ఆమె రూ. 11 లక్షల కోట్లకు పెంచేశారు. ప్రతిపక్షాలూ, వారి పత్రికల అభియోగం ఏమిటంటే... ఆర్‌బీఐ అనుమతితో తీసుకున్న రుణాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి తెలుస్తాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల తనఖా రుణాలు, కార్పొరేషన్ల పేరిట చేసే పబ్లిక్ ఎకౌంట్ రుణాల వివరాలు కేంద్రానికి తెలియవనీ, వాటితో పాటు కాంట్రాక్టర్ల బిల్లులు, ఇతర బకాయిలు కూడా పరిగణనలోకి తీసుకుంటే ఆ అప్పులు పది లక్షల కోట్ల రూపాయలు దాటిపోతాయనే లెక్కలు వారు పదేపదే చెబుతున్నారు. ఎక్కడా లేని విధంగా చెల్లించాల్సిన బకాయిలు కూడా రుణాల ఖాతాలో వీరు మాత్రమే వేస్తున్నారు. మరో వైపు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేషన్లపై చేసే రుణాలతో పాటు అన్ని రుణాలనూ పరిగణనలోకి తీసుకునే రుణ జాబితాను ఖరారు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయినా పురందేశ్వరి లాంటి నాయకులు తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్లు తమ లెక్కలే సరైనవని వాదిస్తూ కేంద్రం కూడా తమ లాగే అబద్ధాలు చెప్పాలని కోరుకుంటున్నారు. అక్టోబర్ 24న పురందేశ్వరి స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞాపన చేసినప్పటికీ, ఆమె స్పందించలేదు. రుణాలపై వారి లెక్కలు తప్పయినా వారు పట్టు విడవని విక్రమార్కుల్లా అబద్ధపు ప్రచారం చేస్తూనే ఉన్నారు.

భారత రాజ్యాంగంలోని 293(3) అధికరణం ప్రకారం దేశంలోని ఏ రాష్ట్రం తన ఇష్టానుసారం అప్పులు చేయడానికి వీలు లేదు. రాష్ట్రాలు ఒక్క రూపాయి అప్పు చేయాలన్నా కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు అన్ని రాష్ట్రాలూ కార్పొరేషన్ల పేరిట అప్పులు తీసుకుంటుండడంతో కేంద్రం ఈ అంశాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి సమీక్షకు నివేదించగా ఆయన ఆ రుణాలను ప్రభుత్వ రుణాలుగా భావించాలని నివేదిక ఇచ్చారు.

నిజానికి ఆంధ్రప్రదేశ్ రుణాలను 'ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్' (ఎఫ్.ఆర్.ఎం.బి.) పరిమితులకు లోబడే చేస్తోంది. అనేక రాష్ట్రాలతో పోల్చితే అప్పుల శాతం కూడా బాగా తక్కువగా ఉంది. ఉదాహరణకు పంజాబ్ రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో రుణాల శాతం 53.3 శాతం కాగా, రాజస్థాన్‌లో 39.8 శాతం, బిహార్‌లో 38.7 శాతం, కేరళలో 37.2 శాతం, మధ్యప్రదేశ్‌లో 33.8 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 34. 2 శాతం ఉండగా అది ఏపీలో 32 శాతం మాత్రమే. జాతీయ స్థాయి జీడీపీలో రుణాలు 65 శాతంగా ఉన్నాయి. అయితే ఒక వర్గం మీడియా మాత్రం రాష్ట్ర జీఎస్‌డీపీలో రుణాలు 77 శాతంగా ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాయి.

వీరి అబద్ధపు ప్రచారం కారణంగా రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోంది. స్వార్థ ప్రయోజనాల కోసం వీరు ప్రజల మదిలో తప్పుడు సమాచారాన్ని నింపుతున్నారు. తటస్థులుగా ఉండే వారిని గుర్తించి వారిని తప్పుత్రోవ పట్టించడానికి తమ పత్రికలను కూడా ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సమాచార కాలుష్యం పట్ల ఆంధ్ర ప్రజలు అప్రమత్తంగా లేకపోతే అందుకు సమాజం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

వ్యాసకర్త ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు
మొబైల్: 95052 92299

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.దశమి ఉ.9.38 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** అశ్వని రా.11.07 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.18 నుండి 8.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.42 నుండి 9.26 వరకు తదుపరి ప.12.21 నుండి 1.05 వరకు, **అమృతఘడియలు:** సా.4.15 నుండి 5.46 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.30, **సూర్యాస్తమయం:** 5.27.

యువర్స్



చైతన్య పథం



చేనేత్రం

● ఆర్ట్ అండ్ కల్చర్

సమాజంలో పుట్టిన కళ ఆ సమాజానికి దూరంగా ఏకాంతవాసంలో ఉండదు. సమాజాన్ని ప్రతిబింబించే అద్దం అవుతుంది. పాత చరిత్రకు కొత్త వెలుగు ఇస్తుంది.

కేరళలోని కొచ్చికి చెందిన రీమా కలింగల్ డ్యాన్సర్, కొరియోగ్రాఫర్, మమంగం డ్యాన్స్ స్టూడియో ఫౌండర్. 'నేతే' నృత్యరూపకం ద్వారా చేనేతకు దేశవ్యాప్తంగా ప్రచారం కల్పిస్తుంది. 'చేనేత కళలో మ్యూజిక్‌తో పాటు మూమెంట్ ఉంటుంది' అంటున్న రీమ వీవింగ్ ప్రాసెస్‌లోని ప్రతి దశకు నృత్యరూపకల్పన చేసింది.

'ఒక డ్యాన్సర్‌గా నేను రోజువారి జీవితానికి సంబంధించిన సాధారణ దృశ్యాలలోని అసాధారణ సౌందర్యాన్ని చూడడానికి ఇష్టపడతాను. నేతకళాకారుల పనిలోనూ నాకు ఎంతో సౌందర్యం కనిపిస్తుంది. నేతే నృత్యరూపకాన్ని చూసే ప్రేక్షకులకు చేనేత గొప్పతనం అర్థమవుతుంది' అంటుంది రీమ. 2018లో కేరళ వరదల సమయంలో సహాయకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న రీమ దృష్టి 'చెందమంగళం'పై పడింది. ఇది చేనేత గ్రామం. నేతప్రక్రియలో ఆర్గానిక్ రిథమ్, కొరియోగ్రఫీని గ్రహించిన రీమా కలింగల్ 'నేతే' పేరుతో నృత్యరూపకాన్ని డిజైన్ చేసింది.

● గ్రీన్ ఇన్నోవేషన్

కొత్త విషయాలు తెలుసుకుంటే ఏమొస్తుంది? కొత్తగా ఆలోచిస్తాం. కొత్తగా ఆలోచిస్తే ఏమొస్తుంది? కొత్తదారులు కనిపిస్తాయి. కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. చైతన్య దూబే కొత్తదారులలో ప్రయాణిస్తున్నాడు. సంప్రదాయ థర్మోకోల్‌కు భిన్నంగా బయోడిగ్రేడబుల్ థర్మోకోల్ తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు.

వేడుకలు, స్కూల్ ప్రాజెక్ట్‌లు, ప్యాకింగ్ అవసరాలు... మొదలైన వాటి కోసం థర్మోకోల్‌ను ఉపయోగిస్తుంటాం. స్టోర్‌రూమ్‌లలో వాడేసిన థర్మోకోల్‌లు కుప్పలుగా పడి ఉంటాయి. మన అవసరం మేరకు తప్ప వాటి గురించి అంతగా ఆలోచించం. పర్యావరణంపై వాటి ప్రభావం ఉంటుందా? థర్మోకోల్ నాన్–బయోడిగ్రేడబుల్.

థర్మోకోల్‌కు సూర్యరశ్మి తగిలి హానికరమైన వాయు కాలుష్య కారకాలు ఉత్పత్తి అవుతాయి, థర్మోకోల్ కాల్చడం వల్ల విషపూరిత రసాయన సమ్మేళనాలు విడుదల అవుతాయి. దీని ప్రభావంతో కంటి, ఊపిరితిత్తులకు సంబంధించి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి విషయాలు తెలుసుకున్న చైతన్య ప్రత్యామ్నాయాన్ని గురించి ఆలోచించాడు. విజయం సాధించాడు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పుట్టి పెరిగిన చైతన్య బెంగళూరులో ఇంజనీరింగ్ చేశాడు. ఎంబీఏ చేసిన తరువాత బెంగళూరులోని ఏదైనా కంపెనీలో ఉద్యోగం చేయాలనుకున్నాడు. అయితే చిన్న బిజినెస్ కోర్స్ ఒకటి చేయడంతో అతడి ఆలోచనల్లో మార్పు వచ్చింది.

బయోడిగ్రేడబుల్ థర్మోకోల్



ఉద్యోగం కాదు బిజినెస్ చేయాలి అనుకున్నాడు. ఆ కోర్స్ తన గమనాన్నే మార్చింది. కెరీర్‌కు సంబంధించి ఎన్నో అవకాశాలను పరిచయం చేసింది. పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి పెరిగింది.

ఔషధ పుట్టగొడుగుల పెంపకం మొదలుపెట్టాడు. రకరకాల పుట్టగొడుగుల గురించి తెలుసుకునే క్రమంలో పుట్టగొడుగుల నుంచి లెదర్ తయారు చేసే కాన్సెప్ట్ చైతన్యను ఆకట్టుకుంది. 'ఇలాంటిదే కొత్తగా ఏదైనా చేయవచ్చా' అని ఆలోచించి పరిశోధనలు మొదలుపెట్టాడు. పరిశోధనలో భాగంగా ఐఐటీ–కాన్పూర్ వెళ్లి ప్రొఫెసర్‌లతో మాట్లాడాడు. పుట్టగొడుగులను ఉపయోగించి పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను తయారుచేయాలనే ఆలోచనలో భాగంగా రూపొందించిందే సరికొత్త థర్మోకోల్.

పుట్టగొడుగులతో పాటు సహజమైన పదార్థాలతో బయోడిగ్రేడబుల్ థర్మోకోల్‌ను తయారుచేశాడు. ఇది 60 నుంచి 90 రోజుల్లో కుళ్లిపోవడం మొదలవుతుంది. దీన్ని మొక్కలకు సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు.

ఈ థర్మోకోల్ తయారీకి అయిదు నుంచి ఏడు రోజులు పడుతుంది. 'మీ అవసరాలకు ఉపయోగించుకున్న తరువాత క్రష్ చేయండి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పని చేస్తుంది' అంటున్నాడు చైతన్య.

ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం గురించి తెలుసుకోవడం, దాని గురించి లోతుగా ఆలోచించడం అంటే చైతన్యకు ఇష్టం. 29 సంవత్సరాల చైతన్య దూబే బయోటెక్ కంపెనీ 'కినోకో బయోటెక్' ప్రారంభించి ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాడు.

బయోడిగ్రేడబుల్ థర్మోకోల్ దగ్గరే ఆగిపోలేదు చైతన్య దూబే. పుట్టగొడుగుల ద్వారా విగ్రహాల తయారీకి ఉపయోగపడే పదార్థం గురించి పరిశోధనలు చేస్తున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపి)కి ప్రత్యామ్నాయాన్ని కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాడు.

● అవును... ఇది నిజమే!



- యూరోపియన్ యూనియన్–ఫండెడ్ ప్రాజెక్ట్ 'ఒడెరఫా' రకరకాల సెంట్‌ల చరిత్రకు సంబంధించిన ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాను క్రియేట్ చేసింది. యూరోపియన్ సంస్కృతిలో సెంట్‌లు, రోగ నిరోధక సెంటులు...మొదలైన వాటికి సంబంధించిన సమాచారం ఉంటుంది. 16వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం ప్రారంభం వరకు చారిత్రక గ్రంథాలు, చిత్రాల నుంచి వాసనలను గుర్తించడానికి, విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించారు.
- 'గాడ్‌ఫాదర్' సినిమాలో మార్లోన్ బ్రాండో చేతిలో పిల్లి కనిపిస్తుంది. అయితే ఇది స్క్రిప్ట్‌లో రాసుకున్నదేమీ కాదు. డైరెక్టర్‌కు స్టూడియోలో ఒక పిల్లి కనిపించింది. దాన్ని తీసుకొని మార్లోన్ చేతిలో పెట్టి సీన్ తీశాడు. 'గాడ్‌ఫాదర్' సినిమాలోని ఫేమస్ డైలాగులలో 'లీవ్ ది గన్, టేక్ ది కనోలి' ఒకటి. అయితే స్క్రిప్ట్‌లో మాత్రం 'లీవ్ ది గన్' అని మాత్రమే ఉండేది. ఆ తరువాత 'టేక్ ది కనోలి' చేర్చారు.

● టెక్.. టాక్



నూబియ రెడ్ మ్యాజిక్ 9 ప్రో

డిస్‌ప్లే: 6.80 అంగుళాలు
రిజల్యూషన్: 1116 x 2480 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బరువు: 229 గ్రా.
మెమొరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ: 6500 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14



హువావే మేట్‌ప్యాడ్ ప్రో 13.2

సైజ్: 13.2 అంగుళాలు ; రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
రిజల్యూషన్: 2,880 x 1,920 పిక్సెల్స్
బ్యాటరీ: 10,100 ఎంఏహెచ్ ; మెమొరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్
బరువు: 580గ్రా. ; వోఎస్: హార్మనీ వోఎస్

మిడ్‌జర్నీ ఆల్ఫా వెర్షన్



పాపులర్ ఏఐ ఇమేజ్ జనరేటర్ 'మిడ్‌జర్నీ' తమ వెబ్‌సైట్‌కు సంబంధించి 'ఆల్ఫా' వెర్షన్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్ కొద్ది మందికి మాత్రమే(మిడ్‌జర్నీలో పదివేలకు పైగా ఇమేజ్‌లను జనరేట్ చేసిన వారికి) అందుబాటులో ఉంది. రాబోయే నెలల్లో మరింత మందికి అందుబాటులో తేనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఆల్ఫా మోడల్ ఎలా పనిచేస్తుందో చూపించే వీడియోను 'మిడ్‌జర్నీ' యూజర్ నిక్ సెయింట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. 'ఒక ఇమేజ్‌ను రీమిక్స్ చేయడానికి లేదా యాస్పెక్ట్ రేషియో మార్చడానికి సరైన కోడ్స్, ఇన్‌పుట్స్ తెలుసుకోవడం అవసరం. ఆల్ఫా వెర్షన్‌లో మాత్రం యూజర్ ఫ్రెండ్లీ స్లైడర్‌లు ఉపయోగపడతాయి. ఇమేజ్ యుఆర్‌ఎల్‌ను గ్రాబ్ చేయడానికి బదులు క్లిక్ చేస్తే సరిపోతుంది' అని రాశాడు నిక్.

గూగుల్ క్రోమ్ స్పీడప్ చేయడానికి...



పాపులర్ ఇంటర్నెట్ బ్రౌజర్ 'గూగుల్ క్రోమ్'ను వేగవంతం చేయడానికి 'హార్డ్‌వేర్ ఎక్సలరేషన్' ఫీచర్ ఉపయోగపడుతుంది. దీని కోసం...

1. క్రోమ్ లాంచ్ చేసి స్క్రీన్ టాప్‌రైట్‌లో కనిపించే త్రీ–డాట్ బటన్ క్లిక్ చేయాలి.
2. 'సెట్టింగ్స్'ను క్లిక్ చేసి లెఫ్ట్ ప్యానెల్‌లోని 'సిస్టమ్' ట్యాబ్‌లోకి వెళ్లాలి. 3. 'యూజ్ హార్డ్‌వేర్ ఎక్సలరేషన్ వెన్ అవైలబుల్' ఆప్షన్ కనిపిస్తుంది. దీన్ని ఆన్ చేసి క్రోమ్‌ను రీలాంచ్ చేయాలి.



వాట్సాప్ చాట్స్ లాక్ చేయడానికి...

1) యాప్ ఓపెన్ చేసి లాక్ చేయాలనుకున్న కాన్వర్జేషన్‌ను లాంగ్–ప్రెస్ చేయాలి. 2) స్క్రీన్ టాప్ రైట్‌లో కనిపించే త్రీ–డాట్ మెనూను ప్రెస్ చేయాలి
3) లాక్ చాట్–ట్యాప్
4) 'కంటిన్యూ' బటన్‌ను క్లిక్ చేయాలి
5) లాక్‌డ్ చాట్స్‌ను క్విక్‌గా అన్‌లాక్ చేయడానికి యూజర్‌లు 'సీక్రెట్ కోడ్'ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

డు సమ్‌థింగ్ ఆఫ్ యువర్ వోన్ బ్యాట్

ఎవరు చెప్పకుండానే, ఎవరి సలహా తీసుకోకుండానే ఒక పని చేసే సందర్భంలో ఉపయోగించే మాట...డు సమ్‌థింగ్ ఆఫ్ యువర్ వోన్ బ్యాట్.

ఉదా: ఐ డిడ్‌నాట్ టెల్ ది గార్డెనర్ టు కట్ డౌన్ ది ట్రీ. హీ డిడ్ ఇట్ ఆఫ్ హిజ్ వోన్ బ్యాట్.

★★★

అండర్ ది వెదర్

'నాకు ఒంట్లో బాగలేదు' అని చెప్పే సందర్భంలో వాడే మాట అండర్ ది వెదర్.

ఉదా: ఐయామ్ ఫీలింగ్ ఏ బిట్ అండర్ ది వెదర్. ఐ థింక్ ఐయామ్ గెటింగ్ ఏ కోల్డ్



సినిమా

అణచగనే పుడతాడు రాజే ఒకడు..


● ప్రభాస్

'విజయ్.. యస్ టీచర్... నేను నేర్పించిన పాట గుర్తుంది కదా.. పాడు...' అనే డైలాగ్స్‌తో మొదలై... 'ప్రతి గాథలో రాక్షసుడే హింసలు పెడతాడు. అణచగనే పుడతాడు రాజే ఒకడు.. శత్రువునే కడతేర్చే పనిలో మన రాజు.. హింసలనే మరిగాడు.. మంచిని మరిచే...' అంటూ సాగుతుంది 'సలార్' సినిమాలోని 'ప్రతి గాథలో..' పాట. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రెండు భాగాలుగా విడుదల కానున్న 'సలార్' తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' చిత్రంలోని పాట ఇది. శ్రుతీహాసన్ నాయికగా నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ఈశ్వరీ రావు, జగపతిబాబు, టీనూ ఆనంద్ కీలక పాత్రలు పోషించారు. విజయ్ కిరగందూర్ నిర్మించిన 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'ప్రతి గాథలో..' పాట లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. తెలుగు వెర్షన్‌కు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, బాల గాయనీ గాయకులు ఈ పాటను పాడారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.


● రాజ్ తరుణ్, నాగార్జున, 'అల్లరి' నరేశ్

సెట్స్‌లో నా సామిరంగ

నా సామిరంగ... డ్యాన్స్ అంటూ సెట్స్‌లో రెచ్చిపోతున్నారు నాగార్జున, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ, నాగార్జున హీరోగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'నా సామిరంగ'. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ సెట్‌లో నాగార్జున, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్‌లతో పాటు 300మంది డ్యాన్సర్స్ పాల్గొంటుండగా, టైటిల్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. చిత్ర సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు.

బర్త్ డే స్పెషల్


● జీవా, మమ్ముట్టి

'ఆనందో బ్రహ్మ', 'యాత్ర' చిత్రాల ఫేమ్ మహీ వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యాత్ర 2'. ఈ చిత్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వి సెల్యులాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' 2024 ఫిబ్రవరి 8న విడుదల కానుంది. కాగా గురువారం (డిసెంబర్ 21) వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజుని పురస్కరించుకుని వైఎస్ జగన్ పాత్రలో నటిస్తున్న జీవా లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మహీ వి. రాఘవ్ మాట్లాడుతూ ''వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన 'యాత్ర' సినిమా ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని 'యాత్ర 2'లో చూపిస్తున్నాం. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ''యాత్ర'ని 2019 ఫిబ్రవరి 8న విడుదల చేశాం. ఇప్పుడు 'యాత్ర 2'ని కూడా అదే తేదీన (2024 ఫిబ్రవరి 8) ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

స్టూడెంట్

'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి విజయవంతమైన చిత్రం తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, నజ్రియా ఫాహద్, విజయ్ వర్మ కీలక పాత్రలు పోషించనున్నారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమా 1970 నేపథ్యంలో ఉంటుందని, సూర్య క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, అందులో ఒకటి స్టూడెంట్ రోల్ అని కోలీవుడ్ సమాచారం. ఫిబ్రవరిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుందట. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనున్న ఈ చిత్రం 2025లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


● సూర్య


● త్రిప్తి దిమ్రి

డేట్ ఫిక్స్


● సందీప్ కిషన్

హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రంలో వర్షా బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. చివరి దశకు చేరుకున్న ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయనున్నట్లు గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ''ఊరు పేరు భైరవకోన'లో సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర.

నవరసాల రాఘవ రెడ్డి


● శివ కంఠమనేని, రాశి

శివ కంఠమనేని హీరోగా, రాశి, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాఘవ రెడ్డి'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్ రావ్, జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా జనవరి 4న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు, నిర్మాత మురళీ మోహన్ విడుదల చేశారు. సంజీవ్ మేగోటి మాట్లాడుతూ– ''యాక్షన్, డ్రామా, థ్రిల్లర్ అంశాలతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు. ''మధురపూడి గ్రామం అనే నేను' చిత్రంలో నా పాత్ర రగ్డ్‌గా ఉంటుంది. 'రాఘవ రెడ్డి'లో సిన్సియర్, స్ట్రిక్ట్ ప్రొఫెసర్‌గా నటించాను. చక్కటి విందు భోజనంలా నవరసాలున్న సినిమా ఇది'' అన్నారు శివ కంఠమనేని. ''మా బ్యానర్ నుంచి వస్తోన్న మూడో సినిమా ఇది. మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వెంకటేశ్వరరావు. ఈ ట్రైలర్ విడుదల వేడుకలో నటి అన్నపూర్ణ, దర్శకుడు నీలకంఠ, సంగీతదర్శకుడు సుధాకర్ మారియో, ఎడిటర్ ఆవుల వెంకటేశ్, వరా ముళ్లపూడి, నటుడు అజయ్ ఘోష్ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: సంజీవ్ మేగోటి– సుధాకర్ మారియో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఘంటా శ్రీనివాసరావు.

నిద్రలేని రాత్రులు గడుపుతున్నా!

'యానిమల్' సినిమాతో ఒక్కసారిగా ట్రెండింగ్ స్టార్ అయ్యారు బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రీ. సోషల్ మీడియాలో ఆమెకు విపరీతమైన ఫాలోయర్స్ పెరిగిపోయారు. ఈ సడన్ స్టార్‌డమ్ గురించి త్రిప్తి దిమ్రీ స్పందిస్తూ– ''ప్రేక్షకులు, అభిమానుల నుంచి నాకు లభిస్తున్న ప్రేమ ఆనందాన్నిస్తోంది. ఈ అనుభూతి ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. చెప్పాలంటే నా మొబైల్ ఫోన్ మెసేజ్‌లతో మోగుతూనే ఉంది. చివరికి ఈ మెసేజ్‌ల వల్ల నేను నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తోంది. అన్ని వస్తున్నాయి. అవి చదువుతూ రాత్రి సమయాన్ని గడిపేస్తున్నాను. కానీ ఇది బాగుంది. ఇక రణ్‌బీర్ కపూర్ అమేజింగ్ యాక్టర్. చాలా సపోర్టివ్. రష్మికా మందన్నా కూడా చాలా కో–ఆపరేటివ్'' అని చెప్పుకొచ్చారు. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా, త్రిప్తి దిమ్రీ, బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్' సినిమా ఈ నెల 1న విడుదలైన విషయం తెలిసిందే. సూపర్ హిట్ టాక్‌తో ఈ చిత్రం దూసుకెళుతోంది.

హిట్ అయితే పెద్ద సినిమానే

– సుమన్



● ప్రీతమ్, వేణుగోపాల చారి, సుమన్

''ప్రేక్షకుల సహకారంతో 40 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. చిన్న, పెద్ద సినిమాలనేవి ఉండవు. హిట్ అయితే పెద్ద సినిమా.. ఫట్ అయితే చిన్న సినిమా. 'విక్టర్ ది నెక్స్ గాడ్' సినిమాలో 200 మంది నటీనటులకు చాన్స్ ఉండటం హ్యాపీ. నూతన సాంకేతిక నిపుణులకు కూడా అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను'' అని సుమన్ అన్నారు. నూతన నటీనటులతో ప్రీతమ్ దర్శకత్వం వహించనున్న చిత్రం 'విక్టర్ ది నెక్స్ గాడ్'. అమేజింగ్ గ్లోబల్ మూవీ మేకర్స్‌పై రూపొందనున్న ఈ సినిమా టైటిల్ లోగో లాంచ్ వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ టైటిల్ లోగోని రిలీజ్ చేశారు. ప్రీతమ్ మాట్లాడుతూ– ''ఇదొక సందేశాత్మక చిత్రం. 4 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రానుంది. ఏడు దేశాల్లో చిత్రీకరణ జరపనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జాకీ–రవి, సంగీతం: రమేష్ ముక్కెర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీఏ వర్మ.

సాక్షి బిజినెస్

శుక్రవారం
22-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	359	70,865
నిఫ్టీ ▲	105	21,255

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,863	▲	86
డోజోన్స్	37,194	▲	112
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,695	▼	21
డాక్స్	16,687	▼	46
షాంఘై	2,919	▲	17
నికాయ్	33,140	▼	535

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,335	▲	33
బంగారం (99.5 స్వచ్ఛత)	62,086	▲	34
వెండి (కేజీ)	74,550	▲	808

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ కరెన్సీ	81.45	85.13
£	బ్రిటన్ పౌండ్	భారతీయ కరెన్సీ	103.07	107.94
€	యూరో	భారతీయ కరెన్సీ	89.22	93.60
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ కరెన్సీ	46.00	71.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ కరెన్సీ	55.86	58.66
S$	సింగపూర్ డాలర్	భారతీయ కరెన్సీ	60.33	65.01
SAR	సౌదీ రియాల్	భారతీయ కరెన్సీ	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ కరెన్సీ	21.78	23.57
¥	చైనా యువాన్	భారతీయ కరెన్సీ	10.53	12.60

ఎల్ఐసీకి ప్రభుత్వ మినహాయింపు

పబ్లిక్‌కు 25 శాతం వాటాపై పదేళ్ల వరకూ గడువు

న్యూఢిల్లీ: పబ్లిక్‌కు కనీస వాటా విషయంలో ప్రభుత్వం మినహాయింపునిచ్చినట్లు బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎల్ఐసీ వెల్లడించింది. దీంతో పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా(ఎంపీఎస్) కల్పించే అంశంలో పదేళ్ల గడువు లభించినట్లు తెలియజేసింది. 2022 మే నెలలో ఐపీవో ద్వారా ప్రభుత్వం ఎల్ఐసీలో 3.5 శాతం వాటా(22.13 కోట్ల షేర్లు)ను విక్రయించింది. దీంతో ప్రస్తుతం ప్రభుత్వ వాటా 96.5 శాతంగా కొనసాగుతోంది. నిజానికి ఐపీవో తదుపరి నిర్ధారిత గడువులోగా లిస్టెడ్ కంపెనీలు పబ్లిక్‌కు 25 శాతం వాటాను కల్పించవలసి ఉంది. అయితే ఆర్థిక వ్యవహారాల శాఖ ఒకేసారి పదేళ్లవరకూ మినహాయింపునిచ్చినట్లు ఎల్ఐసీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. వెరసి 2032 మే వరకూ పబ్లిక్‌కు 25 శాతం వాటా కల్పించే అంశంలో వెసులుబాటు లభించినట్లు తెలియజేసింది. కాగా.. ఈ ఏడాది(2023) మొదట్లో ప్రభుత్వం బ్యాంకులుసహా లిస్టెడ్ పీఎస్‌యూలు పబ్లిక్‌కు కనీస వాటా కల్పించే విషయంలో నిబంధనల్లో సవరణలు చేపట్టింది. తద్వారా ప్రైవేటైజేషన్ తదుపరి ప్రభుత్వ రంగ సంస్థలు ఎంపీఎస్‌ను అమలు చేయవలసిన అవసరాన్ని తప్పించింది. తొలుత పీఎస్‌యూలకు మాత్రమే ఇందుకు వీలుండగా.. ప్రభుత్వ వాటా విక్రయం తదుపరి సైతం వర్తించేలా ఈ ఏడాది జనవరిలో నోటిఫై చేసింది. దీంతో ప్రభుత్వ రంగ కంపెనీలలో వాటా కొనుగోలుకి ఇన్వెస్టర్లు ఆసక్తి చూపేందుకు వీలు చిక్కింది. 2021 జూలైలోనే ప్రభుత్వం అన్ని పీఎస్‌యూలకూ ఎంపీఎస్ వర్తించేలా నోటిఫికేషన్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే.



ఈ వార్తల నేపథ్యంలో ఎల్ఐసీ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 765 వద్ద ముగిసింది.

జొమాటో చేతికి షిప్‌రాకెట్!

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ లిస్టెడ్ కంపెనీ జొమాటో లిమిటెడ్.. ఈకామర్స్ షిప్పింగ్ స్టార్టప్ షిప్‌రాకెట్‌ను సొంతం చేసుకోనుంది. ఇందుకు ఆఫర్‌ను ప్రకటించినట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం జొమాటో 2 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 16,000 కోట్లు) విలువలో షిప్‌రాకెట్‌కు ఆఫర్‌ను ఇచ్చింది. అయితే తుది నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది. ఈ అంశాలపై ఇటు జొమాటో, అటు షిప్‌రాకెట్ ప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం! పిచ్‌బుక్ గణాంకాల ప్రకారం 2022 ఆగస్ట్‌లో షిప్‌రాకెట్ 1.23 బిలియన్ డాలర్ల విలువలో నిధులను సమీకరించింది. సీఈవో, సహవ్యవస్థాపకుడు శాహిల్ గోయెల్ అధ్యక్షతన నడుస్తున్న సంస్థలో బెర్టెల్స్‌మన్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్, టిమాసెక్ హోల్డింగ్స్ తదితరాలకు పెట్టుబడులున్నాయి. జొమాటో 2021లో ఇన్వెస్ట్ చేసింది.

ఈ వార్తలతో జొమాటో షేరు ఎన్ఎస్ఈలో 2.8% ఎగసి రూ. 128 వద్ద ముగిసింది.

జీఎంఆర్ భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో...

రూ. 675 కోట్ల పెట్టుబడులు



ఇన్వెస్ట్ చేయనున్న ఎన్ఐఐఎఫ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురంలో అభివృద్ధి చేస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టులో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్) రూ. 675 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయనుంది. విమానాశ్రయ నిర్మాణానికి ఏర్పాటైన జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీవీఐఏఎల్)లో ఈ మొత్తాన్ని పెట్టుబడి పెట్టేందుకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్), ఎన్ఐఐఎఫ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. కంపల్సరీ కన్వర్టబుల్ డిబెంచర్స్ రూపంలో ఎన్ఐఐఎఫ్ ఇన్వెస్ట్ చేయనున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ప్రాజెక్టులకు సంబంధించి ఇది తమ రెండో పెట్టుబడని ఎన్ఐఐఎఫ్ మాస్టర్ ఫండ్ మేనేజింగ్ పార్ట్‌నర్ వినోద్ గిరి తెలిపారు. హైదరాబాద్ తరహాలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ మరో ప్రపంచ స్థాయి విమానాశ్రయంగా ఉండగలదని జీఎంఆర్ గ్రూప్ బిజినెస్ చైర్మన్ (ఎయిర్‌పోర్ట్స్) జీబీఎస్ రాజు తెలిపారు. డిజైన్, నిర్మాణం, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన 40 ఏళ్ల వ్యవధికి భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును 2020లో జీవీఐఏఎల్ దక్కించుకుంది. ఏపీలోనే అతి పెద్ద విమానాశ్రయంగా ఆవిర్భవించనున్న ఈ ఎయిర్ పోర్టు వార్షిక ప్రయాణికుల సామర్థ్యం తొలి దశలో 60 లక్షలుగా ఉంటుంది. తర్వాత 4 కోట్లకు చేరనుంది.

ఐషర్ నుంచి కొత్త టిప్పర్ ప్రో 8035ఎక్స్ఎం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వీఈ కమర్షియల్ వెహికల్స్‌లో భాగమైన ఐషర్ ట్రక్స్ అండ్ బసెస్ తాజాగా మైనింగ్ రంగ అవసరాల కోసం 'ప్రో 8035ఎక్స్ఎం' పేరిట టిప్పర్‌ను ఆవిష్కరించింది. స్మార్ట్ షిఫ్ట్, ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీని పొందుపర్చిన ఈ ట్రక్కులు మరింత సమర్థమంతంగా పనిచేయగలవని వీఈసీవీ సీనియర్ వీపీ గగన్‌దీప్ సింగ్ గంధోక్ ఈ సందర్భంగా తెలిపారు. హెవీ డ్యూటీ ట్రక్కుల విభాగం ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో 12% వృద్ధి చెందగా తమ సంస్థ 22% వృద్ధి నమోదు చేసిందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 19,000 ట్రక్కులను విక్రయించగా, ఈసారి ఇప్పటి వరకు 13 వేల పైగా విక్రయించినట్లు వివరించారు.

అశోక్ లేలాండ్‌కు భారీ ఆర్డర్



న్యూఢిల్లీ: వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ తాజాగా తమిళనాడు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎన్ఎస్‌టీసీ) నుంచి భారీ ఆర్డర్ చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా కార్పొరేషన్‌కు అల్ట్రా ఎంట్రీ విభాగంలో 552 బస్‌లను అశోక్ లేలాండ్ సరఫరా చేయనుంది. దీర్ఘకాలిక భాగస్వామిగా ఉన్న అశోక్ లేలాండ్ నుంచి ఇప్పటి వరకు 18,477 బస్‌లను టీఎన్ఎస్‌టీసీ కొనుగోలు చేయడం విశేషం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-12-2023	
విశాఖ	605-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595-00
విజయవాడ	595-00
రిటైల్ ధర (డజను)	72.00
21-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	581-00
వరంగల్	583-00
రిటైల్ ధర	6.40

మైనస్ 586 నుంచి ప్లస్ 359..

భారీ నష్టాల నుంచి కోలుకున్న సెన్సెక్స్

- నిఫ్టీ 105 పాయింట్లు అప్
- ఇంధన, మెటల్, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ రయ్



ముంబై: భారీ నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్‌లో బలంగా పుంజుకొని గురువారం లాభాలతో ముగిశాయి. ఇంధన, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు రాణించడంతో పాటు అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(2%), రిలయన్స్ ఇండస్ట్రీస్(1.40%) షేర్ల ర్యాలీ సూచీల రికవరీకి కలిసొచ్చాయి. సెన్సెక్స్ ఉదయం ఉదయం 586 పాయింట్ల నష్టంతో మొదలైంది. కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడేలో 452 పాయింట్లు పెరిగి 70,959 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 359 పాయింట్లు బలపడి 70,865 వద్ద ముగిసింది. నిఫ్టీ 116 పాయింట్ల నష్టంతో 21,034 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 20,977 – 21,150 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 105 పాయింట్లు పెరిగి 21,255 వద్ద స్థిరపడింది. అన్ని రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతుతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకటిన్నర శాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,636 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,464 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా జీడీపీ డేటా వెల్లడి ముందు అంతర్జాతీయ మార్కెట్లు స్తబ్దుగా ట్రేడవుతున్నాయి.

''బేర్ పుల్‌బ్యాక్‌కు ఇది సరైన సమయం కాదు. ఇన్వెస్టర్లు 'పతనమైన షేర్ల కొనుగోళ్ల' వ్యూహాన్ని అనుసరించడంతో బుల్‌బ్యాక్ అయ్యింది. అధిక వాల్యుయేషన్ల కారణంగా కొంత కాలం స్థిరీకరణ అనివార్యం. క్రూడాయిల్ ధరలు క్రమంగా పెరుగుతుండటం, ఆహార వస్తువుల ధరలు అధికమవుతుండటం తదితర కారణాలు గత రెండు 2 నిరంతర ర్యాలీకి అడ్డంకులుగా మారాయి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

ఐనాక్స్ ఇండియా లిస్టింగ్ హిట్



ఐనాక్స్ ఇండియా లిస్టింగ్ హిట్ అయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.660)తో పోలిస్తే 41% ప్రీమియంతో రూ.933 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 50% ర్యాలీ చేసి రూ.990 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 42% లాభంతో రూ.940 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,531 కోట్లుగా నమోదైంది.

- హ్యాపీ ఫోర్జింగ్ చివరిరోజు నాటికి 82.04 రెట్లకు అధిక స్పందన లభించింది. కంపెనీ మొత్తం 83.65 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 68.62 కోట్ల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 220 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 62.17 రెట్లు, రిటైల్ విభాగం 15.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- ఆర్‌బీజెడ్ పబ్లిక్ ఇష్యూ 17 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రూ.100 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా కంపెనీ 79 లక్షల ఈక్విటీలను జారీ చేసింది. మొత్తంగా 13.31 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. రిటైలర్ల కోటా 25 రెట్లు, క్యూఐబీ కోటా 13 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 9 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.
- క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్ సంస్థ ముఫ్తీ ఐపీఓకు 51.85 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 71 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 137 కోట్ల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి. క్యూఐబి కోటా 105 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 55 రెట్లు, రిటైలర్ల కోటా 20 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించాయి.

ఎవల్యూటిజ్ ఆదాయ లక్ష్యం రూ. 650 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ సేవలు, ఉత్పత్తుల సంస్థ ఎవల్యూటిజ్ వచ్చే రెండేళ్లలో రూ. 650 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఇది రూ. 430 కోట్లుగా ఉంది. వైజాగ్ కేంద్రం ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, సీటీవో ఎ. శ్రీనివాస ఈ విషయాలు చెప్పారు. భారతీయ టెకీలు 2011లో షికాగో కేంద్రంగా ఎవల్యూటిజ్‌ను ప్రారంభించారు. ఇది దేశీయంగా 2013లో వైజాగ్‌తో మొదలుపెట్టి హైదరాబాద్, నోయిడా, బెంగళూరు తదితర నగరాలకు కార్యకలాపాలు విస్తరించింది. ప్రస్తుతం భారత్‌లో 650 మంది సిబ్బంది ఉండగా.. వైజాగ్, హైదరాబాద్ కార్యాలయాల్లో 500 మంది పైగా ఉన్నారని శ్రీనివాస వివరించారు. పటిష్టమైన వ్యూహాల దన్నుతో రెండేళ్లుగా ఆదాయం 140% వృద్ధి చెందిందని, రాబోయే రోజుల్లోను ఇదే స్ఫూర్తితో పని చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా మొదలైన సాంకేతికతల ఆధారిత సొల్యూషన్స్‌కి సంబంధించి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్



చాంపియన్ గుకేశ్

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు ప్లేయర్ దొమ్మరాజు గుకేశ్ విజేతగా నిలిచాడు. చెన్నై వేదికగా ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో గుకేశ్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా గుకేశ్‌కు టైటిల్ లభించింది. అర్జున్ రన్నరప్‌గా నిలిచాడు. హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 4 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. చివరిదైన ఏడో రౌండ్‌లో గుకేశ్-హరికృష్ణ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా'కాగా... అర్జున్ 57 ఎత్తుల్లో సనన్ జుగిరోవ్ (హంగేరి)పై గెలుపొందాడు. టాప్-3లో నిలిచిన గుకేశ్‌కు 18 వేల డాలర్లు (రూ. 14 లక్షల 98 వేలు), అర్జున్‌కు 12 వేల డాలర్లు (రూ. 9 లక్షల 98 వేలు), హరికృష్ణకు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

భారత్‌దే వన్డే సిరీస్

- సంజు సామ్సన్ సెంచరీ
- చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓటమి



సంజు సామ్సన్



తిలక్ వర్మ

పార్ల్: దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌లో సమంగా నిలిచిన భారత జట్టు వన్డే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. చివరి మ్యాచ్‌లో విజయంతో 2–1తో సిరీస్ రాహుల్ బృందం సొంతమైంది. గురువారం జరిగిన మూడో వన్డేలో భారత్ 78 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. సంజు సామ్సన్ (114 బంతుల్లో 108; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) వన్డేల్లో తొలి సెంచరీ సాధించగా, తిలక్ వర్మ (77 బంతుల్లో 52; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 22.4 ఓవర్లలో 116 పరుగులు జోడించారు. అనంతరం దక్షిణాఫ్రికా 45.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. టోనీ డి జోర్జీ (87 బంతుల్లో 81; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతా వారంతా విఫలం కావడంతో సఫారీలకు ఓటమి తప్పలేదు.

తిలక్ అర్ధ సెంచరీ...

అరంగేట్ర మ్యాచ్‌లో వరుస బౌండరీలతో రజత్ పటిదార్ (16 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టగా, సాయి సుదర్శన్ (10) విఫలమయ్యాడు. అయితే వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా... రాహుల్ (21) కూడా ప్రభావం చూపలేకపోవడంతో భారత్ స్కోరు 101/3కి చేరింది. ఈ దశలో సామ్సన్, తిలక్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేయగా... సఫారీ బౌలర్లు పూర్తిగా కట్టిపడేయడంతో భారత్ ఒక్కో పరుగు కోసం శ్రమించాల్సి వచ్చింది. సామ్సన్ ఫర్వాలేదనిపించగా... హైదరాబాద్ బ్యాటర్ తిలక్ బాగా ఇబ్బంది పడ్డాడు. తొలి 38 బంతుల్లో కేవలం 9 పరుగులే చేసిన అతను ఒక్క బౌండరీ కూడా కొట్టలేకపోయాడు. ఆ తర్వాత మెరుగ్గా ఆడిన అతను తర్వాతి 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43 పరుగులు సాధించి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు నిలకడ కొనసాగించిన సామ్సన్ 110 బంతుల్లో కెరీర్‌లో తొలి శతకాన్ని (తన 16వ వన్డేలో) అందుకున్నాడు. ఆ తర్వాత రింకూ సింగ్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో భారత్ మంచి స్కోరు సాధించగలిగింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: పటిదార్ (బి) బర్గర్ 22; సుదర్శన్ (ఎల్బీ) (బి) బ్యూరాన్ 10; సామ్సన్ (సి) రీజా (బి) విలియమ్స్ 108; రాహుల్ (సి) క్లాసెన్ (బి) ముల్డర్ 21; తిలక్ (సి) ముల్డర్ (బి) మహరాజ్ 52; రింకూ (సి) రీజా (బి) బర్గర్ 38; అక్షర్ (సి) ముల్డర్ (బి) బ్యూరాన్ 1; సుందర్ (సి) మార్క్‌రమ్ (బి) బ్యూరాన్ 14; అర్‌ష్‌దీప్ (నాటౌట్) 7; అవేశ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు)** 296. **వికెట్ల పతనం:** 1–34, 2–49, 3–101, 4–217, 5–246, 6–255, 7–277, 8–293. **బౌలింగ్:** బర్గర్ 9–0–64–2, విలియమ్స్ 10–0–71–1, బ్యూరాన్ హెన్‌డ్రిక్స్ 9–0–63–3, ముల్డర్ 7–0–36–1, మహరాజ్ 10–2–37–1, మార్క్‌రమ్ 5–0–19–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రీజా హెన్‌డ్రిక్స్ (సి) రాహుల్ (బి) అర్‌ష్‌దీప్ 19; జోర్జి (ఎల్బీ) (బి) అర్‌ష్‌దీప్ 81; డసెన్ (బి) అక్షర్ 2; మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) సుందర్ 36; క్లాసెన్ (సి) సుదర్శన్ (బి) అవేశ్ 21; మిల్లర్ (సి) రాహుల్ (బి) ముకేశ్ 10; ముల్డర్ (సి) రాహుల్ (బి) సుందర్ 1; మహరాజ్ (సి) రింకూ (బి) అర్‌ష్‌దీప్ 14; బ్యూరాన్ (సి) సామ్సన్ (బి) అవేశ్ 18; విలియమ్స్ (ఎల్బీ) (బి) అర్‌ష్‌దీప్ 2; బర్గర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (45.5 ఓవర్లలో ఆలౌట్)** 218. **వికెట్ల పతనం:** 1–59, 2–76, 3–141, 4–161, 5–174, 6–177, 7–192, 8–210, 9–216, 10–218. **బౌలింగ్:** ముకేశ్ 9–0–56–1, అర్‌ష్‌దీప్ 9–1–30–4, అవేశ్ 7.5–0–45–2, సుందర్ 10–0–38–2, అక్షర్ 10–0–48–1.

కుస్తీకి సాక్షి స్వస్తి



- అప్పుడు నిరసన గళం... ఇప్పుడు వీడ్కోలు నిర్ణయం
- డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా బ్రిజ్‌భూషణ్ విధేయుడు సంజయ్ ఎన్నిక
- నిరసనగా రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పిన భారత మహిళా స్టార్ రెజ్లర్ సాక్షి

న్యూఢిల్లీ: సాక్షి మలిక్... మహిళల కుస్తీలో పతకం పట్టుబట్టే స్టార్ రెజ్లర్. కామన్వెల్త్ క్రీడల్లో మూడు పతకాలు... ఆసియా చాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు... రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం... ఇవిచాలు సాక్షి ఏస్థాయి రెజ్లరో చెప్పడానికి! దేశానికి పతకాలెన్నో తెచ్చిపెట్టిన ఆమె... గురువారం జరిగిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ విధేయుడే అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఇక చేసేదేమీ లేక బయట పోరాటానికి, బౌట్‌లో పతకం ఆరాటానికి సెలవిచ్చింది. కన్నీటి చెమ్మతో బరువెక్కిన హృదయంతో రిటైర్మెంట్ ప్రకటించింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడైన బ్రిజ్‌భూషణ్ ప్రధాన అనుచరుడు సంజయ్ సింగ్ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ రోడ్లెక్కి సాక్షి సహా స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్ తదితరులు నిరసన తెలిపారు. పగలనక... రాత్రనక... తిండి నిద్రలేని రాత్రులెన్నో గడిపి బ్రిజ్‌భూషణ్‌ను గద్దె దింపాలనుకున్నారు. కానీ ఇప్పుడు ఆయన గద్దె దిగినప్పటికీ ఆయన నీడ సంజయ్ సింగ్ అధ్యక్షుడు కావడంతో జీర్ణించుకోలేకపోయిన సాక్షి తన ఆటకు టాటా చెప్పేసింది. స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ కూడా సంజయ్ ఎన్నికపై తప్పుబట్టారు.

అవును... అందుకే గుడ్‌బై

'బ్రిజ్‌భూషణ్ మహిళా రెజ్లర్ల పట్ల ప్రవర్తించిన తీరుపై గళమెత్తాం. కదంతొక్కాం. కేసు నమోదు చేయించాం. కానీ డబ్ల్యూఎఫ్ఐ తాజా ఎన్నికల్లో చివరకు ఆయన వర్గమే గెలిచింది. పదవులన్నీ చేజిక్కించుకుంది. అందుకే కెరీర్‌కు గుడ్‌బై చెప్పా. మేం మహిళా అధ్యక్షురాలైతే బాగుంటుందని అనుకున్నాం. కానీ అలా జరగలేదు' అని మీడియా సమావేశంలో సాక్షి వాపోయింది.

15లో 13 పదవులు బ్రిజ్‌భూషణ్ వర్గానివే

మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ డబ్ల్యూఎఫ్ఐలో తన పట్టు నిరూపించుకున్నాడు. ఆయన బరిలో లేకపోయినా... 15 పదవుల్లో ఆయన వర్గానికి చెందిన 13 మంది పదవుల్ని చేజిక్కించుకున్నారు. అధ్యక్ష పదవి ఎన్నికలో ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సంఘం ఉపాధ్యక్షుడైన సంజయ్... 2010 కామన్వెల్త్ క్రీడల స్వర్ణ పతక విజేత అనిత షెరాన్‌పై 40–7 ఓట్ల తేడాతో గెలిచాడు. అనిత వర్గానికి చెందిన ప్రేమ్‌చంద్ లోచబ్ ప్రధాన కార్యదర్శి పదవి పొందడం... సీనియర్ ఉపాధ్యక్షుడిగా దేవేందర్ సింగ్ కడియాన్ ఎన్నికవడం ఒక్కటే ఊరట. మిగతా 4 ఉపాధ్యక్ష పదవులు బ్రిజ్‌భూషణ్ క్యాంప్‌లోని జైప్రకాశ్ (ఢిల్లీ), అశిత్ సాహా (బెంగాల్), కర్తార్ సింగ్ (పంజాబ్), ఫాని (మణిపూర్)లే సొంతం చేసుకున్నారు. ఉపాధ్యక్ష బరిలో దిగిన మధ్యప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి, మాజీ రెజ్లర్ మోహన్ యాదవ్‌కు కేవలం ఐదు ఓట్లు లభించడం గమనార్హం. కోశాధికారిగా సత్యపాల్ (ఉత్తరాఖండ్), ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులందరూ బ్రిజ్‌భూషణ్ వర్గం వారే ఎన్నికయ్యారు.



డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌తో కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ (కుడి)

> నిరసన దీక్ష చేపట్టిన రెజ్లర్లపై ఎలాంటి వివక్ష చూపం. ప్రతీకారం తీర్చుకోం. రెజ్లర్లందరిని సమానంగా చూస్తాం. వారికి కావాల్సిన సహకారాలు అందిస్తాం. మేం రెజ్లింగ్ ఆటపైనే దృష్టి పెడతాం. రెజ్లర్ల పోరాటాలపై కాదు. ఎన్నికైన కొత్త కార్యవర్గమే డబ్ల్యూఎఫ్ఐని నడిపిస్తుంది. రోజువారీ వ్యవహారాల్లో నా ప్రమేయం ఉండదు. వారు కోరితేనే సలహాలిస్తా. **–మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్**



పూజ

ఆసీస్‌ను పడగొట్టిన పూజ

- తొలి ఇన్నింగ్స్‌లో 219 ఆలౌట్
- పూజ వస్త్రకర్‌కు 4 వికెట్లు
- భారత్ 98/1

ముంబై: ఆస్ట్రేలియాతో ప్రారంభమైన ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు తొలి రోజు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన మన బృందం ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ మెరుగైన స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులకే ఆలౌటైంది. భారత జట్టుపై టెస్టుల్లో ఆసీస్ జట్టుకిదే అత్యల్ప స్కోరు. తహీలా మెక్‌గ్రాత్ (56 బంతుల్లో 50; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... బెత్ మూనీ (40), కెప్టెన్ అలీసా హీలీ (38), కిమ్ గార్త్ (28 నాటౌట్) కీలక పరుగులు సాధించారు. పేసర్ పూజ వస్త్రకర్ (4/53) నాలుగు కీలక వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు స్నేహ్ రాణా 3, దీప్తి శర్మ 2 వికెట్లు తీశారు. తొలి ఓవర్లోనే లిచ్‌ఫీల్డ్ (0) రనౌట్ కాగా, అద్భుత బంతితో ఎలీస్ పెరీ (4)ని పూజ బౌల్డ్ చేయడంతో ఆసీస్ కష్టాల్లో పడగా... మెక్‌గ్రాత్, మూనీ మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అనంతరం భారత్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 19 ఓవర్లలోనే 98 పరుగులు చేసింది. స్మృతి మంధాన (49 బంతుల్లో 43 బ్యాటింగ్; 8 ఫోర్లు), షఫాలీ వర్మ (59 బంతుల్లో 40; 8 ఫోర్లు) ఆరంభం నుంచే దూకుడుగా ఆడి తొలి వికెట్‌కు 100 బంతుల్లోనే 90 పరుగులు జత చేశారు. ప్రస్తుతం భారత్ మరో 121 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మూనీ (సి) స్నేహ్ రాణా (బి) పూజ 40; లిచ్‌ఫీల్డ్ (రనౌట్) 0; ఎలీస్ పెరీ (బి) పూజ 4; తహీలా (సి) రాజేశ్వరి (బి) స్నేహ్ రాణా 50; హీలీ (బి) దీప్తి 38; అనాబెల్ (ఎల్బీ) (బి) పూజ 16; యాష్లీ (సి) యస్తిక (బి) పూజ 11; జెస్ (ఎల్బీ) (బి) దీప్తి 19; అలానా కింగ్ (సి) యస్తిక (బి) స్నేహ్ రాణా 5; గార్త్ (నాటౌట్) 28; లౌరెన్ (సి) స్మృతి (బి) స్నేహ్ రాణా 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (77.4 ఓవర్లలో ఆలౌట్)** 219. **వికెట్ల పతనం:** 1–2, 2–7, 3–87, 4–103, 5–143, 6–159, 7–160, 8–168, 9–198, 10–219. **బౌలింగ్:** రేణుక 7–0–35–0, పూజ వస్త్రకర్ 16–2–53–4, స్నేహ్ రాణా 22.4–4–56–3, రాజేశ్వరి 13–4–29–0, దీప్తి శర్మ 19–3–45–2.

భారత్ తొలి ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీ) (బి) జెస్ 40; స్మృతి (బ్యాటింగ్) 43; స్నేహ్ రాణా (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19 ఓవర్లలో వికెట్ నష్టానికి)** 98. **వికెట్ల పతనం:** 1–90. **బౌలింగ్:** లౌరెన్ 4–2–12–0, కిమ్ గార్త్ 4–0–34–0, పెరీ 4–0–31–0, యాష్లీ 5–3–8–0, జెస్ జొనాసెన్ 2–1–4–1.